మీడియాకు సంబంధించిన అన్ని విషయాల కోసం 9246213493
# సహాయ
మీడియా సర్వీసు రి.
3-7-255,మన్సూరాబాద్,ఎల్బీనగర్,హైదరాబాద్-68

www.navabhoomi.in | epaper.navabhoomi.in | RNI No:TELTEL:82083

# నవభూమి

అనుక్షణం
ANUKSHANAM
NAVABHOOMI TELUGU DAILY
నవతరం తెలుగు దినపత్రిక

Published from Hyderabad and Vijayawada
ఎడిటర్ : అజీద్

హైదరాబాద్ | 19 గురువారం సెప్టెంబర్ 2024 | పేజీలు 8-12 | వెల: రూ.6 | సంపుటి:3 సంచిక: 03

Navabhoomi daily fallows..




# తొలి విడత ప్రశాంతం

- జమ్మూకశ్మీర్‌లో ప్రశాంతంగా తొలి విడత 59% పోలింగ్
- ఎన్నికల ముఖ్య కమిషనర్ పీకే పోలె వెల్లడి
- కిశ్త్‌వాడ్‌లో అత్యధికంగా 77శాతం, పుల్వామాలో
- అత్యల్పంగా 46శాతం పోలింగ్ నమోదు

2



**శ్రీనగర్-నవభూమిబ్యూరో:** జమ్మూకశ్మీర్‌లో అసెంబ్లీ ఎన్నికల తొలి విడత పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. దాదాపు 59శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల ముఖ్య కమిషనర్ పీకే పోలె వెల్లడించారు.
కిశ్త్‌వాడ్‌లో అత్యధికంగా 77శాతం, పుల్వామాలో అత్యల్పంగా 46శాతం పోలింగ్ నమోదైందని తెలిపారు. అన్ని చోట్లా ఓటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా జరిగిందన్న ఆయన.. ఎక్కడా రీపోలింగ్ నిర్వహించాల్సిన అవసరం లేదని తెలిపారు.
జమ్మూకశ్మీర్‌లో మొత్తం 90 అసెంబ్లీ నియోజకవర్గాలుండగా.. తొలి దశలో 24 స్థానాల్లో ఎన్నికలు పూర్తయ్యాయి. 24 అసెంబ్లీ స్థానాల్లో దాదాపు 23లక్షల మంది ఓటర్లు 219 మంది అభ్యర్థుల భవితవ్యాన్ని ఈవీఎంలలో నిక్షిప్తం చేశారు. సెప్టెంబరు 25 రెండో విడత, అక్టోబరు 1న మూడో విడత పోలింగ్ నిర్వహించనున్నారు. అక్టోబర్ 8న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు.

# బీఆర్ఎస్‌కు బిగ్‌షాక్..!

- ◆ 100 కోట్ల బీఆర్ఎస్ కార్యాలయం కూల్చాలని హైకోర్టు ఆదేశం
- ◆ కూల్చివేతకు 15 రోజుల డెడ్ లైన్ విధింపు
- ◆ ఎలాంటి అనుమతులు లేకుండా భవన నిర్మాణం
- ◆ 99ఏళ్లకు భూమి లీజు..గజానికి వందరూపాయల చొప్పున అద్దె
- ◆ మంత్రి ఆదేశాలతో మున్సిపాలిటీ నోటీసులు..హైకోర్టుకు బీఆర్ఎస్

2



**నల్లగొండ-నవభూమిబ్యూరో**
తెలంగాణను పదేళ్లు పాలించి.. 2023 నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయిన బీఆర్ఎస్ అలియాస్ టీఆర్ఎస్ పార్టీకి వరుస షాక్‌లు తగులుతున్నాయి. ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి గత ప్రభుత్వంలో విద్యుత్ కొనుగోళ్లపై విచారణ కమిషన్ నియమించారు. తర్వాత కాళేశ్వరంలో అక్రమాలపై మరో కమిషన్ ఏర్పాటు చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసుపై విచారణ జరుగుతోంది. మరోవైపు 10 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు

# నిఖత్ జరీన్‌కు డీఎస్పీ పోస్ట్

- జరీన్‌ను డీఎస్పీగా నియమిస్తూ డీజీపీ జితేందర్ నియామక పత్రం అందజేత
- స్పెషల్ పోలీసు విభాగంలో విధుల్లో చేరిన జరీన్

2



**హైదరాబాద్-నవభూమిబ్యూరో:** బాక్సర్ నిఖత్ జరీన్‌కు తెలంగాణ ప్రభుత్వం ఉద్యోగం కల్పించింది. జరీన్‌ను డీఎస్పీగా నియమిస్తూ డీజీపీ జితేందర్ నియామక పత్రాన్ని అందజేశారు. జరీన్ మూడేళ్లపాటు ప్రొబెషనరీ ట్రైనింగ్ చేయాల్సి ఉంటుంది. నిఖత్ జరీన్‌కు గ్రూప్-1 క్యాడర్ ఉద్యోగం ఇస్తానని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే.
**ఇందూరు బిడ్డ..**ఇస్తాంబుల్‌లో జరిగిన మహిళల ప్రపంచ బాక్సింగ్ విభాగంలో వరల్డ్ చాంపియన్ షిప్‌ను నిజామాబాద్

# జానీ మాస్టర్‌పై పోక్సో కేసు

- తనపై అత్యాచారం చేశాడని కొరియోగ్రాఫర్ ఫిర్యాదు
- ప్రస్తుతానికి పరారీలో ఉన్న జానీ మాస్టర్‌ను
- పట్టుకునేందుకు పోలీసుల గాలింపులు ముమ్మరం




2

**హైదరాబాద్-నవభూమిబ్యూరో:** నృత్య దర్శకుడు జానీ మాస్టర్ అలియాస్ షేక్ జానీబాషాపై పోక్సో యాక్ట్ కింద కేసు నమోదైంది. మైనర్‌గా ఉన్న సమయంలోనే ముంబయి హోటల్లో ఆయన తనపై అత్యాచారం చేశారని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో బాధితురాలు పేర్కొంది.దీంతో పోక్సో యాక్ట్‌ను పోలీసులు ఎఫ్ఐఆర్‌లో యాడ్ చేశారు. ప్రస్తుతం పరారీలో ఉన్న ఆయన్ని పట్టుకునేందుకు పోలీసులు గాలింపు చర్యలు ముమ్మరం చేసిన విషయం తెలిసిందే.

# 'మిషన్ చబుత్రా', 'ఆపరేషన్ రోమియో' నిలిపివేయమని ఆదేశాలివ్వలేం

- మిషన్ చబుత్రా, ఆపరేషన్ రోమియో, మిడ్‌నైట్ కౌన్సెలింగ్ వంటి పేర్లతో సోదాలు
- హైదరాబాద్ సామాజిక కార్యకర్త మసూద్ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం
- గుర్తింపు కార్డులు చూపాలంటూ ప్రజలను, మహిళలను వేధిస్తున్నారని వాదన
- సోదాలను నిలిపివేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించలేమని హైకోర్టు వ్యాఖ్యలు

2



**హైదరాబాద్-నవభూమిబ్యూరో:** 'మిషన్ చబుత్రా', 'ఆపరేషన్ రోమియో' వంటి పేర్లతో పోలీసులు నిర్వహిస్తోన్న సోదాలను నిలిపివేయడానికి హైకోర్టు నిరాకరించింది.
పోలీసుల నుంచి వివరాలు తెలుసుకోకుండా సోదాలను నిలిపివేయాలంటూ ఆదేశాలివ్వలేమని తేల్చి చెప్పింది. దీనిపై వివరణ ఇవ్వాలంటూ హోంశాఖ ముఖ్య కార్యదర్శి, డీజీపీ, నగర పోలీసు కమిషనర్లకు నోటీసులు జారీ చేస్తూ విచారణను 4 వారాలకు వాయిదా వేసింది. మిషన్ చబుత్రా, ఆపరేషన్ రోమియో, మిడ్‌నైట్ కౌన్సెలింగ్ వంటి పేర్లతో సోదాలు నిర్వహిస్తుండటాన్ని సవాలు చేస్తూ హైదరాబాద్‌కు చెందిన సామాజిక కార్యకర్త మసూద్ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆలోక్ అరాదే, జస్టిస్ జె శ్రీనివాసరావులతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది.
చిన్న చిన్న వ్యాపారులు, వీధి వ్యాపారులను రాత్రి 10:30 నుంచి 11 గంటల్లోనే మూసివేయిస్తున్నారని, ఇది 2015లో జారీ చేసిన జీవోకి విరుద్ధమని పిటిషనర్ తరఫు న్యాయవాది ధర్మాసనానికి తెలిపారు. హోటళ్లు, రెస్టారంట్లను ఉదయం 5 నుంచి రాత్రి 12 గంటలకు వరకు నిర్వహించుకోవడానికి ప్రభుత్వం అనుమతించినా పోలీసులు

# జమిలి ఎన్నికలకు కేంద్ర కేబినెట్ ఆమోదం

- ఇక దేశవ్యాప్తంగా ఒకేసారి ఎన్నికల నిర్వహణ
- మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ రూపొందించిన నివేదికను మంత్రివర్గం ఆమోదం
- సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తులు, హైకోర్టు న్యాయమూర్తులతో సహా 32 పార్టీల సమర్థన
- 18 రాజ్యాంగ సవరణలను ప్యానల్ సిఫార్సు

2



**ఢిల్లీ-నవభూమిబ్యూరో:** దేశంలో జమిలి ఎన్నికలకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. దేశవ్యాప్తంగా ఒకేసారి ఎన్నికల నిర్వహణకు సంబంధించి మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ రూపొందించిన నివేదికను మంత్రి వర్గం ఆమోదించింది.
వచ్చే పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో ఈ బిల్లును ప్రవేశపెట్టే అవకాశాలున్నాయి. సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తులు, హైకోర్టు న్యాయమూర్తులతో సహా 32 పార్టీలు ప్రముఖ న్యాయమూర్తులు దీనిని సమర్థించారు. 18 రాజ్యాంగ సవరణలను ప్యానల్ సిఫార్సు చేసింది. అదేవిధంగా చంద్రయాన్- 4కు, గగన్‌యాన్, చంద్రయాన్ విస్తరణకు కేబినెట్ ఆమోదం తెలిపింది.
"ఒక దేశం, ఒకే ఎన్నికలు" విధానాన్ని అమలు చేయడం ద్వారా ఎన్నికల ప్రక్రియ సులభతరం అవుతుందని, తద్వారా వేగవంతమైన ఆర్థికవృద్ధికి దారితీస్తుందని ప్యానల్ పేర్కొంది. లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీ, పంచాయతీలకు మూడు స్థాయిల్లో ఎన్నికలు నిర్వహించడం వల్ల వలస కార్మికులు పలుమార్లు ఓటేయడం కోసం సెలవులపై తమ ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని..దీనివల్ల ఉత్పత్తిలో అంతరాయం కలుగుతుందని వెల్లడించింది. దానిని నివారించాలంటే జమిలి ఎన్నికలే ఏకైక పరిష్కారమని పేర్కొంది.
ప్రస్తుత ఎన్డీయే సర్కారు హయాంలోనే జమిలి ఎన్నికలు అమలుచేసి చూపుతామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఇటీవల స్పష్టం చేశారు. గతనెల స్వాతంత్ర్య దినోత్సవం రోజున ప్రధాని మోదీ ఎర్రకోట నుంచి ప్రసంగిస్తూ జమిలి ఎన్నికల గురించి ప్రస్తావించారు. దేశవ్యాప్తంగా ఏటా ఏదోఒక రాష్ట్రంలో ఎన్నికలు జరుగుతున్నాయని, వీటి ప్రభావం దేశ పురోగతిపై పడుతోందని ఆందోళన వ్యక్తంచేశారు. దీనినుంచి బయటపడాలంటే జమిలి ఎన్నికలే పరిష్కారమని అన్నారు. ఈ దిశగా అన్ని రాష్ట్రాలు ముందుకురావాలని

# ఖజానాలో డబ్బుల్లేవ్!

- రాష్ట్రానికి రూ.10లక్షల కోట్ల అప్పు..
- రూ.లక్ష కోట్ల పెండింగ్ బిల్లులున్నాయి
- ఎన్డీయే శాసనసభాపక్ష సమావేశంలో సీఎం


2



**మంగళగిరి-నవభూమిబ్యూరో:** రాష్ట్రానికి రూ.10లక్షల కోట్ల అప్పు.. రూ.లక్ష కోట్ల పెండింగ్ బిల్లులు ఉన్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. మంగళగిరి లోని సీకే కన్వెన్షన్‌లో ఎన్డీయే శాసనసభాపక్ష సమావేశం జరిగింది.ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ... గత ప్రభుత్వం నిధులు దుర్వినియోగం చేసింది, కేంద్రం నిధులను పక్కదారి పట్టించిందని విమర్శించారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు నియోజకవర్గాల వారీగా విజన్ డాక్యుమెంట్లు రూపొందించుకోవాలని దిశానిర్దేశం చేశారు.
"అధికారంలోకి వచ్చినప్పుడు ఖజానాలో ఎక్కడా డబ్బులు లేవు. జీతాలు కూడా ఇవ్వలేని పరిస్థితి. అయినా ధైర్యంతో ముందుకెళ్తున్నాం. వచ్చే ఐదేళ్లలో 20లక్షల ఉద్యోగాల కల్పన దిశగా పనిచేస్తున్నాం. కేంద్ర సహకారం లేకపోతే రాష్ట్రం అభివృద్ధి చెందదు. కేంద్ర సహాయం వెంటిలేటర్‌పై ఉన్న వ్యక్తికి ఆక్సిజన్ లాంటిది. మూడు పార్టీల సమష్టి కృషితోనే ఇంతటి ఘన విజయం సాధించాం. నా జీవితంలో ఎన్నడూ చూడని విజయమిది. 151 సీట్లు ఉన్నాయని విర్రవీగిన వారు.. 11 సీట్లకే పరిమితమయ్యారు అదే ప్రజాస్వామ్యం" అని చంద్రబాబు

# బాలినేని రాజీనామా

- వైకాపాకు మరో షాక్.. రాజీనామా లేఖను వైసీపీ నేత జగన్‌కు పంపిన బాలినేని
- జగన్ విధానాలు నచ్చకే రాజీనామా చేస్తున్నా
- జనసేన అధినేత పవన్‌ను కలిసిన తర్వాత రాజకీయ భవిష్యత్తుపై నిర్ణయం తీసుకుంటానన్న బాలినేని



**అమరావతి-నవభూమిబ్యూరో:** వైకాపాకు మరో షాక్ తగిలింది. మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి ఆ పార్టీకి రాజీనామా చేశారు. రాజీనామా లేఖను పార్టీ అధ్యక్షుడు జగన్‌కు పంపారు.జగన్ విధానాలు నచ్చకే రాజీనామా చేస్తున్నట్లు లేఖలో పేర్కొన్నారు. ఒంగోలులో బాలినేని మీడియాతో మాట్లాడారు."కొన్ని రోజులుగా వైకాపా అధిష్ఠానం వద్ద అసంతృప్తి వ్యక్తం చేస్తూనే ఉన్నాను. గురువారం జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను కలవబోతున్నాను. ఆ పార్టీలో చేరబోతున్నాను" అని బాలినేని తెలిపారు.

# దీపావళి నుంచి ఉచిత గ్యాస్ సిలిండర్లు

- ఏపీలో మహిళలకు శుభవార్త..



**అమరావతి-నవభూమిబ్యూరో:** రాష్ట్రంలో మహిళలకు ఎన్డీయే ప్రభుత్వం శుభవార్త చెప్పింది. సూపర్ సిక్స్‌లో భాగంగా ప్రకటించిన ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ పథకాన్ని దీపావళి పండుగ సందర్భంగా అమలు చేయాలని సీఎం చంద్రబాబు నిర్ణయించారు.
ఇదే విషయాన్ని ఎన్డీయే శాసనసభాపక్ష సమావేశంలో సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. మహాశక్తి పథకం కింద పేదలకు ఉచితంగా మూడు వంట గ్యాస్ సిలిండర్లు ఇస్తామని చంద్రబాబు ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ పథకం ద్వారా తెల్ల రేషన్ కార్డు ఉన్న లబ్ధిదారులకు.. ప్రతి ఇంటికి 3 గ్యాస్ సిలిండర్లను ఉచితంగా ప్రభుత్వం అందించనుంది.

# నూతన మద్యం విధానానికి కేబినెట్ ఆమోదం

- నాణ్యమైన మద్యం బ్రాండ్లు అందుబాటులో ఉంచాలి
- రూ.99 నుంచి అందుబాటులో సగటు మద్యం ధర
- సీఎం చంద్రబాబు అధ్యక్షతన ఏపీ మంత్రివర్గభేటీ

**అమరావతి-నవభూమిబ్యూరో:** ఏపీ మంత్రివర్గ సమావేశం ముగిసింది. సీఎం చంద్రబాబు అధ్యక్షతన సుదీర్ఘంగా సాగిన ఈ భేటీలో నూతన మద్యం విధానానికి కేబినెట్ ఆమోదం తెలిపింది.
నాణ్యమైన మద్యం బ్రాండ్లు అందుబాటులో ఉంచాలని నిర్ణయించింది. సగటు మద్యం ధర రూ.99 నుంచి అందుబాటులో ఉంచాలని నిర్ణయించారు. భోగాపురం విమానాశ్రయానికి అల్లూరి సీతారామరాజు విమానాశ్రయంగా నామకరణం చేస్తూ మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. వాలంటీర్ల వ్యవస్థ పునరుద్ధరణపై కేబినెట్ సమావేశంలో చర్చించారు. గతేడాది ఆగస్టులోనే వాలంటీర్ల కాలపరిమితి ముగిసిందని అధికారులు తెలిపారు. ఏడాది క్రితమే వాలంటీర్లను జగన్ తొలగించారని.. 2023లో వాలంటీర్ల పదవీకాలం ముగిసినా రెన్యువల్ చేయలేదని మంత్రులు పేర్కొన్నారు. తప్పుడు విధానాలు.. దొంగ పద్ధతుల్లోనే జగన్ పాలన సాగించారని పలువురు మంత్రులు వ్యాఖ్యానించారు. వాలంటీర్ల పునరుద్ధరణపై మరింత సమాచారం



2

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in


# వరద బాధితుల కోసం కుమారీ ఆంటీ భారీ విరాళం.. ఎంతంటే

**హైదరాబాద్-నవభూమి:** కుమారీ ఆంటీ.. ఈపేరు పరిచయమక్కర్లేదు. హైదరాబాద్‌లో రోడ్ సైడ్ ఫుడ్ స్టాల్ పెట్టుకుని బిజినెస్ చేసుకుంటూ సోషల్ మీడియా పుణ్యమా అని ఒక్కసారిగా ఫేమస్ అయిపోయారు. అయితే వరద బాధితుల కోసం తన వంతు సాయం అందించేందుకు ముందుకు వచ్చారు కుమారీ ఆంటి. ఈ మధ్య కురిసిన భారీ వర్షాలకు ఖమ్మం, వరంగల్ సహా చాలా జిల్లాలు చిగురుటాకులా వణికిన విషయం తెలిసిందే.దీంతో భారీగా నష్టం వాటిల్లింది. వందల సంఖ్యలో నిరాశ్రయులయ్యారు. వారిని ఆదుకునేందుకు ప్రముఖులు, కార్పొరేట్ కంపెనీలు ముందుకు వచ్చారు. అదే సమయంలో



కుమారీ ఆంటీ కూడా తన వంతు సాయం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని తన నివాసంలో ఆమె బుధవారం కలిశారు. ఆ సమయంలో ఆమె వెంట కుటుంబ సభ్యులు ఉన్నారు. అనంతరం వరద బాధితుల సహాయార్థం సీఎంఆర్‌ఎఫ్‌కు రూ.50 వేలను విరాళంగా అందించారు. సీఎం రేవంత్ రెడ్డి ఆమెను అభినందించారు. కుమారీ ఆంటీ సాయంపై నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు.



# కురచ బుద్ధితో విమర్శలు చేసినంత మాత్రాన నిజాలు దాగవ్.. కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ విమర్శలు



**హైదరాబాద్-నవభూమి:** కేసీఆర్‌ను తక్కువ చేయాలని.. కురచ బుద్ధితో విమర్శలు చేసినంత మాత్రాన నిజాలు దాగవని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు అన్నారు. పదేళ్ల కేసీఆర్ పరిపాలనలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల రంగం అభివృద్ధిలో పరుగులు పెట్టిందని గుర్తు చేశారు. తాను చెబుతున్నది కాదని.. స్వయంగా కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారికంగా లెక్కలతో సహా వివరించిందన్నారు. కేసీఆర్‌పై బురద చల్లాలని.. తప్పుడు ఆరోపణలు చేసినప్పటికీ లెక్కలు మాత్రం అబద్ధాలు చెప్పారని కేటీఆర్ తెలిపారు.

బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని తక్కువ చేసి చూపాలని ఎంత ప్రయత్నించినప్పటికీ అది సాధ్యం కాలేదన్నారు. ఇవాళ కాంగ్రెస్ ప్రభుత్వం విడుదల చేసిన సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల పాలసీలో బీఆర్ఎస్ పాలనలో జరిగిన అభివృద్ధిని ప్రస్తావించిన అంశాన్ని కేటీఆర్ గుర్తు చేశారు. కేసీఆర్ హయాంలో పారిశ్రామిక ప్రగతి పరుగులు పెట్టిందనడానికి కాంగ్రెస్ చెప్పిన లెక్కలే నిదర్శనమన్నారు. గత పదేళ్లలో వృద్ధి రేటు 11 శాతం నుంచి 15 శాతం ఉందని ప్రభుత్వమే ఒప్పుకుందని కేటీఆర్ చెప్పారు. 2018-2023 మధ్యలో టీఎస్ఐపాస్ ద్వారా పెరిగిన సగటు పెట్టుబడులు 115శాతం ఉన్నాయన్నారు. జీఎస్డీపీలో ఎంఎస్ఎంఈల వాటాలో 10శాతం వృద్ధి చెందిందన్నారు. ఏటా ఎంఎస్ఎంఈల సంఖ్య 15 శాతం పెరిగిందని, ఎంఎస్ఎంఈల కారణంగా ఉపాధి 20శాతం పెరిగిందన్నారు.ఎంఎస్ఎంఈల్లో ఎస్సీ, ఎస్టీ మహిళలు 30శాతం ఉద్యోగాలు పొందారని.. 2020-2023 మధ్యలో అతి తక్కువ ఎంఎస్ఎంఈలు మూసివేయబడ్డ రాష్ట్రం తెలంగాణ అన్నారు. ఇవి బీఆర్ఎస్ చెబుతున్న లెక్కలు కాదని.. కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పిన లెక్కనేనని కేటీఆర్ చెప్పారు. కేసీఆర్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన టీఎస్ఐపాస్ వంటి ప్రగతిశీల విధానాలు, చిన్న పరిశ్రమలకు ఇచ్చిన ప్రోత్సాహకాలతోనే ఈ అద్భుత ప్రగతి సాధ్యమైందన్నారు. కేసీఆర్‌ని తక్కువ చేయాలనుకొని కురచ బుద్ధితో విమర్శలు చేసినంతా మాత్రాన నిజాలు దాగవని అన్నారు. సూర్యుడు తూర్పున ఉదయిస్తాడు అన్నది ఎంత నిజమో.. కేసీఆర్ తెలంగాణను అన్ని రంగాల్లో అభివృద్ధి చేశాడన్నది అంతే నిజమని కేటీఆర్ అన్నారు. ఇదే విషయాన్ని రానున్న రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వమో ఒప్పుకోకతప్పదని స్పష్టం చేశారు.


# టీపీసీసీ చీఫ్ సరికొత్త నిర్ణయం.. ఇకపై వారానికి రెండు సార్లు



**హైదరాబాద్-నవభూమి:** రాష్ట్ర మంత్రులకు సంబంధించి టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ సరికొత్త నిర్ణయం తీసుకున్నారు. ఇకపై వారానికి రెండు రోజులు మంత్రులు గాంధీభవన్‌కు వచ్చేలా ప్రణాళిక రూపొందించారు. ఆ మేరకు విధి విధానాలను, మంత్రుల షెడ్యూల్‌ను రూపొందించాలని గాంధీ భవన్ సిబ్బందికి టీపీసీసీ చీఫ్ ఆదేశాలు జారీ చేశారు. టీపీసీసీ అధ్యక్షులుగా మహేష్ కుమార్ గౌడ్ పదవీ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా మంత్రులు ప్రతి వారంలో రెండుసార్లు గాంధీ భవన్ రావాలని ఆయన సూచించారు. ప్రతి బుధ, శుక్రవారాలలో ఒక్క మంత్రి.. గాంధీ భవన్‌కు రావాలని మహేష్ సూచించారు. వచ్చే శుక్రవారం నుంచి గాంధీ భవన్‌కు మంత్రుల రాక ప్రారంభంకానున్నట్లు టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ వెల్లడించారు. తెలంగాణ పీసీసీ చీఫ్‌గా బాధ్యతలు చేపట్టిన మహేష్ ముందు పెద్ద సవాలే ఉంది. త్వరలో రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్నాయి. తాము ప్రజా పాలనను అందిస్తున్నామని.. ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నామని కాంగ్రెస్ చెబుతోంది. మరోవైపు కాంగ్రెస్ పాలనపై ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ నేతలు దుమ్మెత్తిపోస్తున్న పరిస్థితి. ఈ నేపథ్యంలో త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలవడం మహేష్ ముందున్న అతిపెద్ద సవాల్‌గా చెప్పుకోవచ్చు.

సీనియర్ నేత మహేష్ కుమార్‌కు టీపీసీసీ చీఫ్ పదవి వరించింది. మహేష్‌కు నాలుగు దశాబ్దాలుగా పైగా కాంగ్రెస్ పార్టీతో అనుబంధం ఉంది. ఎలాంటి పదవులు ఆశించని వ్యక్తి ఆయన. అందరినీ కలుపుకుంటూ పోతూ అధిష్టానం తనకు అప్పగించిన పనులను చేసుకుంటూ వెళ్తుంటారు. టీపీసీసీ చీఫ్‌గా మహేష్ కుమార్‌ను కాంగ్రెస్ అధిష్టానం ప్రకటించడంతో ఆయన ఆనందం వ్యక్తం చేశారు. తెలంగాణలో బీసీ ఓటర్లు ఎక్కువగా ఉండటం.. ఈ మధ్య కాలంలో బీసీ నినాదం ఎక్కువ వినిపిస్తుండటంతో.. బీసీ సామాజిక వర్గానికి చెందిన మహేశ్ కుమార్ గౌడ్‌కు పీసీసీ పదవి దక్కింది.

# కొనసాగుతున్న నిమజ్జన ప్రక్రియ.. పరిశీలిస్తున్న జీహెచ్ఎంసీ కమిషనర్



**హైదరాబాద్-నవభూమి:** 11 రోజులపాటు మండపాల్లో పూజలందుకున్న లంబోదరుడు ఆశేష భక్త జనం నుంచి వీడ్కోలు అందుకుని గంగమ్మ ఒడికి చేరుకుంటున్నాడు. మంగళవారం హైదరాబాద్‌లో ప్రారంభమైన గణేష్ నిమజ్జనం కార్యక్రమం బుధవారం కూడా కొనసాగుతోంది. ఈ రోజు మధ్యాహ్నంలోపు పూర్తిచేసేలా అధికారులు టార్గెట్ పెట్టుకున్నారు. ఈ నిమజ్జనం ప్రక్రియను జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి కార్యాలయం నుంచి పరిశీలిస్తున్నారు. బల్దియా కంట్రోల్ రూమ్ ద్వారా ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నారు. గణేష్ నిమజ్జనాన్ని మధ్యాహ్నంలోపు పూర్తిచేసేలా బల్దియా టార్గెట్ పెట్టుకుంది. సాంకేతిక కారణాలతో మొరాయిస్తున్న క్రేన్ల స్థానంలో తక్షణమే వేరే క్రేన్ల ఏర్పాటు చేశారు. మరోవైపు అత్యాధునికమైన యంత్రాలతో హుస్సేన్ సాగర్‌ను క్లీనింగ్ చేస్తున్నారు.కాగా ట్యాంక్ బండ్ పరిసర ప్రాంతాల్లో వినాయక విగ్రహాలు భారీగా నిలిచిపోయాయి. బషీర్ బాగ్.. బాబు జగ్జీవన్ రావు విగ్రహం వరకు గణనాథులు నిలిచిపోయారు. అటు బర్కత్ పుర ఆర్టీసీ క్రాస్ రోడ్ వరకు గణేష్‌లు బారులు తీరారు. మరో గంటలోగా సాధారణ ట్రాఫిక్ ని అనుమతించేందుకు పోలీస్ అధికారులు ప్రయత్నిస్తున్నారు. నారాయణగూడ నుంచి ట్యాంక్ బండ్ వైపు వచ్చే గణనాథుల్ని వన్ వేలో అనుమతిస్తున్నారు.

# ప్రపంచ దేశాలకు ధీటుగా తెలంగాణ..

## పెట్టుబడులకు స్వర్గధామంగా హైదరాబాద్: రేవంత్



**హైదరాబాద్-నవభూమి:** చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు ఊతమిచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం నూతన ఎంఎస్ఎంఈ పాలసీ-2024ని బుధవారం ప్రారంభించింది. మాదాపూర్ శిల్పకళా వేదికలో కొత్త ఎంస్ఎంఈ పాలసీ-2024ను సీఎం రేవంత్‌రెడ్డి విడుదల చేశారు. రేవంత్ సహా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు ఇందులో పాల్గొన్నారు. రాష్ట్రంలో వ్యాపారాలు, పెట్టుబడుల విస్తరణకు కొత్త పారిశ్రామిక విధానాన్ని ప్రకటించిన సీఎం అందుకుతగినట్లే పాలసీని రూపొందించారు. ప్రపంచ దేశాలకు ధీటుగా పారిశ్రామిక ప్రగతిని సాధించేందుకు రాష్ట్రంలో పుష్కలంగా అవకాశాలు ఉన్నాయని ఆయన స్పష్టం చేశారు.వ్యాపారవేత్తలు, పెట్టుబడిదారులకు హైదరాబాద్ స్వర్గధామంగా మారిందని.. అందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన సంస్కరణలే కారణమని అన్నారు. ప్రపంచ దేశాలకు ధీటుగా రాష్ట్రం అభివృద్ధి చెందుతోందని తెలిపారు. "ఎంఎస్ఎంఈలు ప్రధానంగా 6 అడ్డంకులను ఎదుర్కుంటున్నాయి. భూమి, మూలధన లభ్యత, ముడిపదార్థాల అందుబాటు, శ్రామిక శక్తి కొరత, సాంకేతిక సౌకర్యం లేకపోవడం, మార్కెట్‌లతో అనుసంధానం కాలేకపోవడం వంటి అంశాలు రాష్ట్రంలోని ఎంఎస్ఎంఈలు ఎదుర్కొంటున్న సవాళ్లు. ఈ అడ్డంకులను తొలగించడానికి 40 ప్రతిపాదనలు చేశాం"అని రేవంత్ పేర్కొన్నారు. 20 శాతం ఎంఎస్ఎంఈలకే..రాష్ట్రంలో రానున్న రోజుల్లో నిర్మించతలపెట్టిన ప్రతి పారిశ్రామిక పార్కులో 20 శాతం ప్లాట్లు ఎంఎస్ఎంఈల కోసం రిజర్వు చేయనున్నట్లు రేవంత్ వివరించారు. వచ్చే 5 ఏళ్లలో ప్రతి జిల్లాలో ఒక పారిశ్రామిక పార్కు ఏర్పాటు చేయబోతున్నామని, అలాగే ఓఆర్ఆర్, ట్రిపులార్ మధ్య 10 పారిశ్రామిక పార్కులను ప్రభుత్వం నిర్మించబోతున్నట్లు చెప్పారు. 10 పార్కులలో 5 ఎంఎస్ఎంఈలు ఉంటాయని.. వీటిలోని ప్రతి ఎంఎస్ఎంఈ పార్కులో 5 శాతం ప్లాట్లు మహిళా పారిశ్రామిక వేత్తలకు 15 శాతం ప్లాట్లు ఎస్సీ, ఎస్టీ పారిశ్రామిక వేత్తలకు రిజర్వ్ చేయనున్నట్లు వివరించారు. అలాగే ఎంఎస్ఎంఈలను సమర్థవంతంగా అమలుపరిచి నిర్వహణ, పర్యవేక్షణ కోసం ఉన్నతస్థాయి స్టీరింగ్ కమిటీ ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు.

# జమిలి ఎన్నికలకు కేంద్ర కేబినెట్ ఆమోదం

**(1వపేజీ తరువాయి)**పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో ఎన్డీఏ 3.0 సర్కారులోనే జమిలి ఎన్నికలు అమల్లోకి వస్తాయని రాజకీయ వర్గాలు పేర్కొంటున్నాయి.

**ప్రజాస్వామ్య బలోపేతానికి ముందడుగు.. 'జమిలి'కి ఆమోదంపై ప్రధాని మోదీ**

జమిలి ఎన్నికలపై మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ రూపొందించిన నివేదికకు కేంద్ర కేబినెట్ పచ్చజెండా ఊపిన విషయం తెలిసిందే. దేశవ్యాప్తంగా ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలన్న కమిటీ సిఫార్సులను ఆమోదించింది.దీనిపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 'ఎక్స్' వేదికగా స్పందించారు. దేశ ప్రజా స్వామ్యాన్ని మరింత శక్తిమంతంగా, భాగస్వామ్య యుతంగా మార్చే కీలక ముందడుగుగా పేర్కొ న్నారు. ఉన్నతస్థాయి కమిటీకి నాయకత్వం వహించినందుకు, నివేదిక రూపకల్పనలో భాగంగా అన్ని వర్గాలతో విస్తృత చర్చలు జరిపినందుకు మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌కు అభినందనలు తెలిపారు.

**ఈ ఆమోదం.. ఆచరణాత్మకం కాదు:మల్లికార్జున్ ఖర్గే**

అయితే కాంగ్రెస్‌తో సహా 15 పార్టీలు ఈ విధానాన్ని వ్యతిరేకించాయి. ఈ ప్రతిపాదన ఆచరణాత్మకమైనది కాదని కాంగ్రెస్ పేర్కొంది. పార్టీ అధినేత మల్లికార్జున్ ఖర్గే మాట్లాడుతూ "ఇది ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నం. దీనిని ప్రజలు అంగీకరించరు" అని అన్నారు.

# ఫలించిన రోజా వ్యూహం

- **ఓటమికి కారణమైన సొంత పార్టీ నేతలపై ప్రతీకారం**
- **మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ శాంతి దంపతులపై వేటు**

**తిరుపతి-నవభూమిబ్యూరో**

కోల్పోయిన చోటే వెతుక్కోవాలనే నానుడిని నిజం చేస్తున్నారు మాజీ మంత్రి రోజా. తన సొంత నియోజకవర్గంలో నగరిలో అంతా సెట్ చేసుకోడానికి చకచకా పావులు కదుపుతున్నారు.

తన ఓటమి కారణమైన సొంత పార్టీ నేతలపై ప్రతీకారం తీర్చుకుంటున్నారు. తన కంట్లో నలుసులా వ్యవహరిస్తున్న నగరి మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ కేజే శాంతి దంపతులను పార్టీ నుంచి సస్పెండ్ చేయించిన తన కసిని తీర్చుకున్నారు. నగరిపై మళ్లీ పట్టు పెంచుకునేలా రోజా చేస్తున్న ప్రయత్నాలు ఆసక్తికరంగా మారాయి. మూడేళ్లుగా నగరిలో రోజాకు ఎదురైన కష్టాలు అన్నీఇన్నీ కావు.

అధికార పార్టీలో మంత్రి పదవిలో ఉన్నప్పటికీ రోజాకు సంతోషం ఉండేది కాదు. మొన్నటి ఎన్నికల వరకు ఆమెకు ఇంటాబయటా సమస్యలే. ముఖ్యంగా సొంత పార్టీ నేతలే రోజాను ఓడించేందుకు కంకణం కట్టుకున్నారు. శపథం చేసి మరీ అన్నంత పని చేశారు. కూటమి సునామీలో తానూ కొట్టుకుపోయానన్న బాధ కన్నా సొంత నియోజకవర్గంలో సొంత పార్టీ నేతలే వెన్నుపోటు పొడవడం రోజాను ఎక్కువ బాధపెట్టింది. జిల్లాకు చెందిన వైసీపీ ముఖ్యులు కూడా రోజా ఓటమి వెనక ఉన్నారని అనుమానాలు ఉన్నాయి. ఓటమి తర్వాత మూడు నెలల పాటు సైలెంట్‌గా ఉన్న రోజా.. ఇప్పుడు తన రాజకీయ వ్యూహాన్ని అమలు చేస్తున్నట్లు చెబుతున్నారు.

అసెంబ్లీ ఎన్నికల తర్వాత రోజాపై రకరకాల ప్రచారాలు జరిగాయి. ముఖ్యంగా ఆమె వైసీపీని రాష్ట్ర రాజకీయాలను వదిలేసి తమిళ పాలిటిక్స్‌లోకి ఎంట్రీ ఇస్తారని విస్తృత ప్రచారం జరిగింది. కానీ, ఆ ప్రచారాలను మౌనంగా భరించిన రోజా వాటి వెనుక సొంత పార్టీ ప్రత్యర్థులే ఉన్నారని గ్రహించి వారికి చెక్ చెప్పేలా అడుగులు వేశారని అంటున్నారు.సమయం చూసి ప్రత్యర్థుల పని పట్టాలని భావించిన రోజా.. పార్టీ అధినేత జగన్‌తో జరిగిన సమావేశంలో మొత్తం తన బాధను వెల్లగక్కారని చెబుతున్నారు. మూడు రోజుల క్రితం ఉమ్మడి జిల్లా నేతలతో మాజీ సీఎం జగన్ సమావేశమవ్వగా, తన ఓటమికి కారణాలను వివరించిన రోజా మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ శాంతి దంపతులపై వేటు వేయాల్సిందిగా కోరినట్లు సమాచారం.

రోజా వినతి మేరకు సత్వరమే స్పందించిన జగన్%‰% శాంతి, ఆమె భర్త కుమార్‌ను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తూ ప్రకటన జారీ చేశారు.వాస్తవానికి రోజాకు పార్టీలోని మిగిలిన క్యాడర్‌కు చాలా గ్యాప్ ఉండేదని చెబుతున్నారు. నగరిలో రోజాకు వ్యతిరేకంగా మూడు నాలుగు గ్రూపుల పనిచేసేవి. వీరిలో కేజే శాంతి, కుమార్ తప్ప మిగిలిన వారంతా ఎన్నికలకు ముందే టీడీపీలో చేరిపోయారు. ఎన్నికల్లో శాంతి దంపతులు కూడా రోజాకు వ్యతిరేకంగా పనిచేశారనే ప్రచారం ఉంది.మాజీ మంత్రి పెద్దిరెడ్డి అనుచరులైన శాంతి దంపతులు.. రోజా నగరిని వీడితే వైసీపీ ఇన్‌చార్జి బాధ్యతలు తీసుకోవాలని భావించారు. ఎన్నికల అనంతరం రోజాకు నగరికి సంబంధాలు లేవని ఓ వీడియో కూడా విడుదల చేశారు.

అయితే ఆ వీడియోపై ఎలాంటి వ్యాఖ్యలు చేయని రోజా సైలెంట్‌గా తన పని పూర్తి చేశారు. అధినేత అండదండలతో పెద్దిరెడ్డి మనసులైనా తన నియోజకవర్గంలో తన మాటే శాసనం అన్న సంకేతాలు పంపగలిగారంటున్నారు.వైసీపీ అధికారంలో ఉండగా, కేజే శాంతి ఈడిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా నామినేటెడ్ పదవిని పొందారు. అంతకు ముందు మునిసిపల్ చైర్‌పర్సన్ గానూ పనిచేశారు. నగరిలో తొలి నుంచి వైసీపీకి వెన్నుదన్నుగా ఉన్నది శాంతి దంపతులే. నగరి వైసీపీ ఇన్ ఛార్జ్ గా రోజా బాధ్యతలు స్వీకరించాక ఆమెకు తొలుత ఆశ్రయం ఇచ్చింది కూడా వారే. 2014, 2019 ఎన్నికల్లో రోజా గెలుపు కోసం ఎంతో కృషి చేశారు. రెండోసారి రోజా ఎమ్మెల్యే అయ్యాక కేజే దంపతులతో విభేదాలు మొదలయ్యాయి.

తెలుగుదేశం పార్టీ నేతలను చేరదీసి తమను నిర్లక్ష్యం చేస్తున్నారని రోజాపై కేజే దంపతులు వ్యతిరేకత పెంచుకున్నారు. వారి అసంతృప్తిని రోజా కూడా లైట్‌గా తీసుకోవడంతో క్రమంగా గ్యాప్ పెరిగిపోయింది. చివరికి ఒకనాటి మిత్రులు బద్ధశత్రువులుగా మారిపోయారు. వీరి పంచాయతీపై అధినేత వైఎస్ జగన్ ఫోకస్ చేసిన, అసమ్మతి చల్లారలేదు. శాంతి, రోజా చేతులు కలిపేలా బహిరంగ వేదికపై జగన్ చేసిన ప్రయత్నం బెడిసికొట్టింది. ఇక అప్పటి నుంచి విభేదాలు మరింత ఎక్కువ కావడం.. అవి రోజా ఓటమికి దారితీయడంతో ఇప్పుడు దిద్దుబాటు చర్యలు తీసుకుంటున్నారు.

రోజా..మొత్తానికి పార్టీ నుంచి ప్రత్యర్థులను పంపడం ద్వారా నగరిలో రోజా మాటకే వైసీపీ అధిక ప్రాధాన్యమిచ్చినట్లైంది. జిల్లా పార్టీకి పెద్దదిక్కుగా చెప్పే పెద్దిరెడ్డి సైతం రోజా ఫిర్యాదుపై అభ్యంతరం వ్యక్తం చేయలేదంటున్నారు. దీంతో అధినేత జగన్ వెంటనే చర్యలకు దిగారు. ఇక రోజాకు పార్టీ పరమైన తలనొప్పులు తప్పించడంతోపాటు అదనంగా పార్టీ అధికార ప్రతినిధిగా నియమించి ప్రోత్సహించారు. ఈ పరిణామాలతో వంద రోజులుగా తనపై వస్తున్న అన్నీ ఊహాగానాలకు చెక్ చెప్పిన రోజా నగరి వైసీపీలో తనదే హవా అని చాటిచెప్పారు.

# వైల్డ్ కార్డు ఎంట్రీకి ముహూర్తం

**హైదరాబాద్-నవభూమిబ్యూరో**

బుల్లితెరపై ప్రసారమయ్యే రియాల్టీ షోలలో అన్నింటికంటే ఎక్కువగా పాపులర్ అయిన షో బిగ్ బాస్. తాజాగా తెలుగులో సీజన్ 8 నడుస్తుండగా, 14 మంది కంటెస్టెంట్స్ హౌస్ లోకి అడుగు పెట్టారు.

ఎప్పటిలాగే నాగార్జున హోస్ట్ గా వ్యవహరించడంతో ఈ సరికొత్త సీజన్ ప్రారంభమైంది. అన్లిమిటెడ్ ఎంటర్టైన్మెంట్, అన్లిమిటెడ్ మనీ అంటూ మొదలైన బిగ్ బాస్ తెలుగు లో ప్రస్తుతం 12 మంది కంటెస్టెంట్స్ ఉన్నారు. ఇందులో ఇద్దరు ఇప్పటికే ఎలిమినేట్ అయిన సంగతి తెలిసిందే. అయితే బుల్లితెర ప్రేక్షకులు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న బిగ్ బాస్ సీజన్ 8 వైల్డ్ కార్డ్ ఎంట్రీకి తాజాగా ముహూర్తం ఖరారు అయినట్టుగా తెలుస్తోంది. ఈసారి ఏకంగా నలుగురు కొత్త కంటెస్టెంట్స్ ను వైల్డ్ కార్డు పేరుతో హౌస్ లోకి పంపించబోతున్నారని టాక్ నడుస్తోంది. మరి హౌస్ లోకి అడుగు పెట్టబోతున్న ఆ నలుగురు వైల్డ్ కార్డు ఎంట్రీ కంటెస్టెంట్స్ ఎవరు? ఎప్పుడు ఎంట్రీ ఇవ్వబోతున్నారు? అనే విషయాలను తెలుసుకుందాం.

**వైల్డ్ కార్డు ఎంట్రీకి ముహూర్తం ఫిక్స్...**

గత సీజన్ తో పోల్చుకుంటే బిగ్ బాస్ సీజన్ 8 చాలా తక్కువ టీఆర్పీ రేటింగ్ తో మొదలైంది. దీనికి కారణం హౌస్ లో అడుగు పెట్టిన కంటెస్టెంట్స్ అని చెప్పొచ్చు. వాళ్ళ ముఖాలు పెద్దగా తెలియకపోవడం పట్ల బుల్లితెర ప్రేక్షకులు అసంతృప్తిని వ్యక్తం చేసి, దాన్ని టీఆర్పీ రేటింగ్ తో బయటపెట్టారు. కానీ ఆ తరువాత వారం రోజులకే టీఆర్పీ రేటింగ్ టాప్ లోకి దూసుకెళ్లింది. అన్ని భాషల్లోని బిగ్ బాస్ తో పోల్చుకుంటే తెలుగు బిగ్ బాస్ ఈ సీజన్లో టీఆర్పీ రేటింగ్ పరంగా రికార్డులను తిరగరాసింది. కాగా ఎప్పుడెప్పుడా అని ఈగర్ గా ఎదురు చూస్తున్న వైల్డ్ కార్డు ఎంట్రీని బిగ్ బాస్ 8 తెలుగు 2.0 అనే మరొక గ్రాండ్ లాంచ్ ఈవెంట్ ద్వారా హౌస్ లోకి పంపబోతున్నారని తెలుస్తోంది. దసరా స్పెషల్ బోనంజా వీకెండ్ అక్టోబర్ 6న ఈ బిగ్ బాస్ తెలుగు 8 గ్రాండ్ లాంచ్ 2.0 జరగనుందని అంటున్నారు.

**వైల్డ్ కార్డు ఎంట్రీ ఇవ్వబోతున్న కంటెస్టెంట్స్...**

చాలా కాలంగా బిగ్ బాస్ 8 తెలుగులోకి అడుగు పెట్టబోతున్న కంటెస్టెంట్స్ లిస్ట్ లో జ్యోతి రాయ్ పేరు వైరల్ అవుతుంది. గుప్పెడంత మనసు సీరియల్ ద్వారా మంచి పాపులారిటీని సంపాదించుకున్న జ్యోతి రాయ్ ఆ తరువాత సోషల్ మీడియాలోని బోల్డ్ యాంగిల్ బయట పెట్టి అందరికీ షాక్ ఇచ్చింది.

# బీఆర్ఎస్‌కు బిగ్‌షాక్..!

**(1వపేజీ తరువాయి)** కాంగ్రెస్‌లో చేరారు. ఇలా వరుస షాక్‌లతో ఇబ్బంది పడుతున్న బీఆర్ఎస్‌కు.. తాజాగా హైకోర్టు షాక్ ఇచ్చింది. బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం కూల్చివేయాలని ఉత్తర్వులు జారీ చేసింది.

**అధికారంలో ఉన్నామని..**

తెలంగాణలో బీఆర్ఎస్ పదేళ్లుగా అధికారంలో ఉంది. అధికారంలో ఉన్నామని, తమను ఎవరు ప్రశ్నిస్తారన్న.. ఉద్దేశంలో హైదరాబాద్ - నల్గొండ ప్రధాన రహదారి వెంట నల్గొండ పట్టణ శివారులో రెండెకరాల స్థలంలో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం నిర్మించింది. భవన నిర్మాణానికి మున్సిపాలిటీ నుంచి ఎలాంటి అనుమతి తీసుకోలేదు. మొన్నటి ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడిపోయిన తర్వాత మున్సిపల్ అధికారులు పార్టీకి నోటీసులు జారీ చేశారు. 99 ఏళ్లు భూమిని లీజుకు తీసుకుని గజానికి రూ100 చొప్పున అద్దె చెల్లించేలా ఒప్పందం కుదుర్చుకుంది.

**మంత్రి ఆదేశాలతో..**

మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి నల్గొండ బీఆర్ఎస్ ఆఫీస్ నిర్మాణంపై కీలక వ్యాఖ్యలు చేశారు. భవనానికి ఎలాంటి అనుమతులు లేవని, వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీంతో మున్సిపల్ అధికారులు వెంటనే నోటీసులు జారీ చేశారు. ఈ నోటీసులను సవాల్ చేస్తూ బీఆర్ఎస్ హైకోర్టును ఆశ్రయించింది. ఆఫీస్‌ను క్రమబద్ధీకరించేలా ఆదేశించాలని కోరింది. దీనిపై విచారణ చేపట్టిన హైకోర్టు ధర్మాసనం.. బీఆర్ఎస్‌కు షాక్ ఇచ్చేలా బుధవారం(సెప్టెంబర్ 18న) ఆదేశాలు జారీ చేసింది.

**15 రోజులు గడువు..**

ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మించిన నల్గొండ బీఆర్ఎస్ కార్యాలయ భవనాన్ని కూల్చివేయాలని హైకోర్టు మున్సిపల్ అధికారులను ఆదేశించింది. అంతేకాకుండా మున్సిపాలిటీకి రూ.లక్ష పరిహారం చెల్లించాలని సూచించింది. 15 రోజుల్లో పార్టీ కార్యాలయాన్ని కూల్చివేయాలని ఉత్తర్వులు జారీ చేసింది. ఉత్తర్వుల సందర్భంగా కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఐదేళ్ల క్రితం భవనం నిర్మించి ఇన్నేళ్లు కార్యక్రమాలు నిర్వహించి ఇప్పుడు క్రమబద్ధీకరించాలని కోరడం ఏంటని ప్రశ్నించింది. ఇదిలా ఉంటే బీఆర్ఎస్ భవనం నిర్మించిన స్థలం విలువ బహిరంగ మార్కెట్‌లో రూ.100 కోట్లు ఉంటుందని అంచనా.

# నిఖత్ జరీన్‌కు డీఎస్పీ పోస్ట్

**(1వపేజీ తరువాయి)**జిల్లాకు చెందిన నిఖత్ జరీన్ సాధించారు. గత ప్రభుత్వం జరీన్‌కు నజారానా ప్రకటించింది. నివాస స్థలం కేటాయించింది. కేంద్ర ప్రభుత్వం అర్జున అవార్డు అందజేసింది. గ్రూప్-1 క్యాడర్ ఉద్యోగం ఇస్తామని రేవంత్ ప్రభుత్వం మాట ఇచ్చి నిలబెట్టుకుంది. గత నెల 1వ తేదీన జరిగిన మంత్రివర్గ సమావేశంలో సెక్షన్ 4లో తెలంగాణ రెగ్యులేషన్ ఆఫ్ అపాయింట్ మెంట్స్‌కు సవరణ చేసింది. నిఖత్ జరీన్‌కు ఉద్యోగం ఇవ్వాలని హోం శాఖను ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు హోం శాఖ డీఎస్పీగా నియమించింది.

**రెండుసార్లు టైటిల్**

నిఖత్ జరీన్ వరల్డ్ చాంపియన్ షిప్‌లో రెండుసార్లు టైటిల్ గెలుచుకుంది. 2023, 2022లో కూడా టైటిల్ నెగ్గింది. కామన్వెల్త్ గేమ్స్‌లో స్వర్ణం, ఏషియన్ గేమ్స్‌లో కాంస్య పతకాలు సాధించింది. పారిస్ ఒలింపిక్స్‌లో మాత్రం నిరాశ పరిచింది. మహిళల 50 కేజీల విభాగంలో ప్రీ క్వార్టర్స్‌లో వెనుదిరిగింది.

**డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన బాక్సర్ నిఖత్ జరీన్**

బాక్సింగ్ ఛాంపియన్, అర్జున్ అవార్డు గ్రహీత నిఖత్ జరీన్ డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు జాయినింగ్ ఆర్డర్‌ను నిఖత్ జరీన్ మంగళవారం డీజీపీకి అందజేశారు.నిఖత్ జరీన్‌కు డీఎస్పీ ఉద్యోగం ఇవ్వాలని కేబినెట్ సమావేశంలో తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీంతో తెలంగాణ స్పెషల్ పోలీసు విభాగంలో ఆమెకు డీఎస్పీగా ఉద్యోగం ఇస్తూ ఇటీవల హోంశాఖ ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యలో తాజాగా ఆమె విధుల్లో చేరారు.

# 'మిషన్ చబుత్రా', 'ఆపరేషన్ రోమియో' నిలిపివేయమని

**(1వపేజీ తరువాయి)**మూసివేయిస్తున్నారన్నారు. సోదాలు నిర్వహిస్తూ గుర్తింపు కార్డులు చూపాలంటూ ప్రజలను, ఇళ్లలోని మహిళలను వేధింపులకు గురి చేస్తున్నారని వాదించారు. ఏ చట్టం కింద పోలీసులు సోదాలు నిర్వహిస్తున్నారని పోలీసులకు లేఖలు రాసినా స్పందించలేదని తెలిపారు. పేదలు నివసించే కొన్ని ఎంపిక చేసిన ప్రాంతాల్లోనే సోదాలు నిర్వహిస్తున్నాని చెప్పారు. మిషన్ చబుత్రా, ఆపరేషన్ రోమియో పేర్లతో నిర్వహిస్తున్న సోదాలను నిలిపివేసేలా ఆదేశాలివ్వాలని కోరారు. ఇందులో పిటిషనర్ కూడా బాధితుడేనని న్యాయవాది కోర్టుకు తెలిపారు. వాదనలను విన్న ధర్మాసనం.. ప్రభుత్వానికి నోటీసులు జారీ చేస్తూ విచారణను 4 వారాలకు వాయిదా వేసింది.

# నూతన మద్యం విధానానికి కేబినెట్ ఆమోదం

**(1వపేజీ తరువాయి)**తీసుకోవాలని సీఎం చంద్రబాబు సూచించారు. గత ప్రభుత్వంలో సాక్షి పత్రిక కొనుగోళ్ల పేరిట జరిగిన అవకతవకలపై కేబినెట్‌లో చర్చ జరిగింది. రెండేళ్లలోనే సాక్షి పత్రిక కొనుగోళ్ల కోసం ప్రభుత్వ ఖజానా నుంచి రూ.205 కోట్లు ఖర్చు చేశారని మంత్రులు తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా సాక్షికి జరిపిన చెల్లింపులపై విచారణకు సీఎం ఆదేశించారు. వాలంటీర్లు, సచివాలయాలకు దిన పత్రికల కొనుగోలుకు నెలనెలా ఇచ్చే రూ.200 రద్దు చేశారు.


**మంత్రివర్గం తీసుకున్న నిర్ణయాలు..**

పోలవరం డయాఫ్రమ్ వాల్ నిర్మాణం సీడబ్ల్యూసీ సూచనల మేరకు పాత ఏజన్సీకే ఇవ్వాలని నిర్ణయం. ఒకే ఏజెన్సీకే పనులు కేటాయించడం వల్ల తదనంతరం ఏమైనా సమస్యలు తలెత్తినా ఏజెన్సీ బాధ్యత ఉంటుందని అభిప్రాయపడిన మంత్రివర్గంప్రజారోగ్యానికి ప్రాధాన్యమిస్తూ 'స్టెమీ' పథకం ప్రారంభం ఆధార్ తరహాలో విద్యార్థులకు 'అపార్' గుర్తింపు కార్డులుహోంశాఖలో కొత్త కార్పొరేషన్ ఏర్పాటు.. కొత్త కార్పొరేషన్‌కు రూ.10 కోట్ల కార్పస్ ఫండ్‌వాలంటీర్లను, సచివాలయాలను వివిధ శాఖల్లో కలిపేలా చర్యలు

## తెలంగాణ నయా రికార్డ్.. దేశంలోనే రెండో స్థానం

**న్యూఢిల్లీ-నవభూమి:** భారత్‌లోని ధనిక, పేద రాష్ట్రాల జాబితాను ప్రధానమంత్రి ఆర్థిక సలహామండలి బుధవారం విడుదల చేసింది. అందులోని వివరాల ప్రకారం.. ధనిక రాష్ట్రాల జాబితాలో దేశ రాజధాని ఢిల్లీ తొలిస్థానంలో నిలిచింది. ఆ తరువాతి స్థానంలో తెలంగాణే ఉండటం విశేషం. కర్ణాటక, హరియాణా, తమిళనాడు వరుసగా 3,4,5 స్థానాల్లో నిలిచాయి. ఇక బిహార్, జార?ండ్, యూపీ, మణిపుర్, అసోం రాష్ట్రాలు తొలి ఐదు పేద రాష్ట్రాలుగా నిలిచాయి. రాష్ట్రాల తలసరి ఆదాయం ప్రామాణికంగా ఈ జాబితాను రూపొందించారు.ఐదు పెద్ద దక్షిణాది రాష్ట్రాలు కలిసి మార్చి 2024 ముగిసే ఆర్థిక సంవత్సరం నాటికి దేశంలో దాదాపు 30 శాతం వాటాను కలిగి ఉన్నాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి 2014లో విడిపోయి తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఆవిర్భవించింది.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
3 హైదరాబాద్ గురువారం 19। సెప్టెంబర్। 2024



## 'రాహుల్ గాంధీ నాలుకను కోయడం కాదు కాల్చాలి'.. బీజేపీ ఎంపీ



**న్యూఢిల్లీ-నవభూమి:**కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీపై మరో బీజేపీ నేత వివాదస్పద వ్యాఖ్యలు చేశారు. రిజర్వేషన్ రద్దు చేయాలని విదేశాల్లో అన్న ఆయన నాలుకను కోయడం బదులు కాల్చాలని అన్నారు. బీజేపీ రాజ్యసభ సభ్యుడు అనిల్ బోండే మాట్లాడిన ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. రిజర్వేషన్ వ్యవస్థను రద్దు చేయడంపై అమెరికాలో మాట్లాడిన రాహుల్ గాంధీ నాలుక కోసిన వారికి 11 లక్షల రివార్డ్ ఇస్తానని మహారాష్ట్ర సీఎం షిండే వర్గానికి చెందిన శివసేన ఎమ్మెల్యే సంజయ్ గైక్వాడ్ ఇటీవల ప్రకటించారు. ఇది రాజకీయ వివాదానికి దారి తీసింది.కాగా, శివసేన ఎమ్మెల్యే సంజయ్ గైక్వాడ్ వ్యాఖ్యలపై మహారాష్ట్రకు చెందిన బీజేపీ రాజ్యసభ సభ్యుడు అనిల్ బోండే స్పందించారు. రాహుల్ గాంధీ నాలుకను కోసే బదులు కాల్చివేయాలని అన్నారు. మంగళవారం అమరావతిలో మీడియాతో అనిల్ బోండే మాట్లాడారు. రిజర్వేషన్లపై రాహుల్ గాంధీ మాట్లాడిన మాటలు ప్రమాదకరమని విమర్శించారు. అయితే నాలుక నరకాలన్న భాష సరికాదని తెలిపారు. 'ఎవరైనా విదేశాలలో ఏదైనా అసంబద్ధంగా మాట్లాడితే, అతడి నాలుకను కత్తిరించడం కంటే కాల్చి వాతలు పెట్టాలి. అది రాహుల్ గాంధీ, జ్ఞానేష్ మహారావు, శ్యామ్ మానవ్, లేదా బహుజనులు, మెజారిటీ ప్రజల మనోభావాలను గాయపరిచిన ఎవరైనా సరే' అని అన్నారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఈ నేపథ్యంలో బీజేపీ ఎంపీ అనిల్ బోండే వ్యాఖ్యలపై విమర్శలు వెల్లువెత్తాయి.

## ప్రజాస్వామ్యంలో జమిలి ఎన్నికలు సాధ్యం కావు : కాంగ్రెస్



**న్యూఢిల్లీ- నవభూమి:**జమిలి ఎన్నికలకు కేంద్ర ప్రభుత్వం సన్నద్ధమైంది. జమిలి ఎన్నికలపై కోవింద్ కమిటీ సమర్పించిన నివేదికకు కేంద్ర క్యాబినెట్ బుధవారం ఆమోదముద్ర వేసింది. ఒకే దేశం ఒకే ఎన్నికపై కోవింద్ కమిటీ సిఫార్సులకు కేంద్ర క్యాబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంపై కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే స్పందించారు. ఢిల్లీలో మీడియా ప్రతినిధులతో ఖర్గే మాట్లాడుతూ కేంద్ర క్యాబినెట్ నిర్ణయంతో తాము విభేదిస్తున్నామని, ప్రజాస్వామ్యంలో ఒకే దేశం ఒకే ఎన్నిక విధానం పనిచేయదని స్పష్టం చేశారు.మన ప్రజాస్వామ్యం మనుగడ సాగించాలంటే అవసరమైనప్పుడు ఎన్నికలు నిర్వహించాల్సిన అవసరం ఉందని ఖర్గే పేర్కొన్నారు. కాగా, వన్ నేషన్-వన్ ఎలక్షన్ ప్రక్రియకు ఇవాళ కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. శీతాకాల పార్లమెంట్ సమావేశాల్లో వన్ నేషన్-వన్ ఎలక్షన్ బిల్లును ప్రవేశపెట్టనున్నారు. మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ కమిటీ అందజేసిన రిపోర్టుకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది.ఎట్టి పరిస్థితుల్లోనైనా జమిలి ఎన్నికలు నిర్వహించి తీరుతామని ఇటీవల కేంద్ర మంత్రి అమిత్ షా పేర్కొన్న విషయం తెలిసిందే.రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలోని కమిటీ వన్ నేషన్-వన్ ఎలక్షన్ ప్రతిపాదన చేసింది. సెప్టెంబర్‌లో ఆ ప్యానెల్ ఏర్పాటైంది. లోక్‌సభ ఎన్నికలకు ముందే కోవింద్ ప్యానెల్ తన నివేదికను కేంద్ర ప్రభుత్వానికి అందజేసింది. న్యాయశాఖ ఆ రిపోర్టును ఇవాళ కేంద్ర క్యాబినెట్ ముందు ప్రవేశపెట్టింది. వంద రోజుల మోదీ సర్కార్ పాలన సందర్భంగా ఈ రిపోర్టును ముందుకు తీసుకువచ్చారు.

## కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు..



**న్యూఢిల్లీ- నవభూమి:**ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన బుధవారం జరిగిన కేంద్ర కేబినెట్ భేటీలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నది. భేటీ అనంతరం సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్ వివరించారు. రైతులకు మేలు చేసేందుకు ప్రధాని మోదీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం ఓ పథకం తర్వాత మరో పథకాలకు ఆమోదం తెలిపింది. ఎన్‌పీకే ఎరువులకు రూ.24,475 కోట్ల సబ్సిడీని కేటాయించేందుకు కేబినెట్ ఆమోదం తెలిపిందని పేర్కొన్నారు. మధ్యప్రాచ్యం, రష్యా-ఉక్రెయిన్‌లో నెలకొన్న ఘర్షణతో రైతులు ఎదుర్కొంటున్న సవాళ్ల బారినపడకుండా ఉండేందుకు సబ్సిడీని కేటాయిస్తూ నిర్ణయం తీసుకున్నది.

పీఎం అన్నదాత ఆయ్ సంరక్షణ్ అభియాన్, పీఎం ఆశా కోసం రూ.35వేలకోట్లను కేబినెట్ ఆమోదించిందని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. దీంతో పాటు చంద్రమయాన్ మిషన్‌కు సైతం కేంద్ర కేబినెట్ నిర్ణయించింది. వీనస్ మిషన్, గగన్‌యాన్, తర్వాతి తరం లాంచ్ వెహికిల్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులకు సైతం కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. చంద్రయాన్-4 మిషన్ రూ.2,104 కోట్లతో ఆమోదం తెలిపింది. మిషన్‌లో చంద్రుడిపైకి చేరుకొని.. నమూనాలను సేకరించి తిరిగి భూమిపైకి చేరుకోనున్నది. ప్రధాన మంత్రి జంజాతి ఉన్నత్ గ్రామ్ అభియాన్ కింద గిరిజన సంక్షేమానికి రూ.79,156 కోట్ల పథకం ఆమోదం పేర్కొంది.

## హర్యానా ప్రజలపై కాంగ్రెస్ వరాల జల్లు..

### కులగణన సహా ఏడు గ్యారంటీలతో మేనిఫెస్టో రిలీజ్



**న్యూఢిల్లీ- నవభూమి:**హర్యానా అసెంబ్లీకి వచ్చే నెల ఎన్నికలు జరగనున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆ రాష్ట్ర ప్రజలపై కాంగ్రెస్ వరాల జల్లు కురిపించింది. ఏడు గ్యారంటీలతో మేనిఫెస్టోను రిలీజ్ చేసింది. కనీస మద్దతు ధరకు చట్టబద్దత సహా కులగణన చేపడతామని హామీ ఇచ్చింది.'సాత్ వాదే పక్కే ఇరాదే' పేరుతో ఏడు గ్యారంటీలను కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే ప్రకటించారు. మహిళా సాధికారత కింద 18 నుంచి 60 ఏళ్ల వయసు ఉన్న ప్రతి మహిళకు నెలకు రూ.2 వేలతో పాటు రూ.500కే గ్యాస్ సిలిండర్లను ఇస్తామని ప్రకటించింది. అదేవిధంగా వృద్ధులు, వికలాంగులు, ఒంటరి మహిళలకు నెలకు రూ.6 వేలు పింఛన్ ఇస్తామని తెలిపింది. 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, కుటుంబానికి రూ.25 లక్షల వరకు ఉచితంగా వైద్య చికిత్సను అందిస్తామని హామీ ఇచ్చింది.క్రిమీలేయర్‌ను ప్రస్తుతమున్న రూ.6 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచుతామని తెలిపింది. పేదలకు ఒక్కో కుటుంబానికి 100 చదరపు గజాల స్థలం, ఇంటి నిర్మాణం కోసం రూ.3.5 లక్షలు ఇస్తామని ప్రకటించింది. కుల గణన కూడా నిర్వహిస్తామని కాంగ్రెస్ తన మేనిఫెస్టోలో వెల్లడించింది. ఢిల్లీలో జరిగిన ఈ కార్యక్రమంలో హర్యానా కాంగ్రెస్ చీఫ్ ఉదయ్ భాను, మాజీ ముఖ్య మంత్రి భూపీందర్ సింగ్ హుడా తదితరలు పాల్గొన్నారు. కాగా, 90 స్థానాలున్న హర్యానా అసెంబ్లీకి అక్టోబర్ 5న ఎన్నికలు జరగనున్నాయి. అదే నెల 8వ తేదీన ఓట్లు లెక్కించి ఫలితాలను వెల్లడించనున్నారు.

## గణేష్ విగ్రహం తీసుకెళ్తున్న ట్రాక్టర్ చక్రాల కింద నలిగి.. ముగ్గురు పిల్లల మృతి, పలువురికి గాయాలు

**న్యూఢిల్లీ-నవభూమి:**గణేష్ విగ్రహాన్ని నిమజ్జనానికి తీసుకెళ్తున్న ట్రాక్టర్‌ను నిర్వా హకుడు నడిపేందుకు ప్రయత్నించాడు. ఈ నేపథ్యంలో ఆ ట్రాక్టర్ అదుపుతప్పి జనం మీదకు దూసుకెళ్లింది. ఈ సంఘటనలో ట్రాక్టర్ టైర్ల కింద నలిగి ముగ్గురు పిల్లలు మరణించారు. మరి కొంత మంది యువతీ యువకులు తీవ్రంగా గాయపడ్డారు. వారిని హాస్పిటల్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. మహారాష్ట్రలోని ధులే జిల్లాలో ఈ సంఘటన జరిగింది. మంగళవారం మధ్యాహ్నం చిటోడ్ గ్రామంలో గణేష్ నిమజ్జన శోభాయాత్ర కోసం ట్రాక్టర్‌ను సిద్ధం చేశారు.కాగా, ఉన్నట్టుండి ట్రాక్టర్ డ్రైవర్ కిందకు దిగాడు. ఈ నేపథ్యంలో గణేష్ మండపం నిర్వాహకుడు డ్రైవర్ సీటులో కూర్చొని ట్రాక్టర్‌ను స్టార్ట్ చేశాడు. అయితే రివర్స్ గేర్ వేయడంతో అదుపుతప్పిన ట్రాక్టర్ అక్కడున్న జనం మీదకు దూసుకెళ్లింది.

# మేడారం అడవుల్లో సుడిగాలుల బీభత్సం.. వన్యప్రాణులు ముందే పసిగట్టాయా..?



**ములుగు-నవభూమి:**ఓ వైపు వర్షాలు.. మరోవైపు వరదలు.. ఇటీవల తెలంగాణను వణికించాయి. పెద్ద ఎత్తున నష్టం వాటిల్లింది. ముఖ్యం గా ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాలు తీవ్ర నష్టాన్ని చవిచూశాయి. ఇటు వానలు, వరదలు ప్రజలను, అధికార యంత్రాంగాన్ని కష్టాల పాలు చేస్తుంటే ఇదే క్రమంలో.. మేడారం అడవుల్లో సుడిగాలులు బీభత్సం సృష్టించాయి. ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం అడవుల్లో టోర్నడోలు వచ్చినట్లుగా ఒక్కసారిగా సుడిగాలులు రెచ్చిపోయాయి. సుమారు 50వేల చెట్లు నెలకొరిగాయి. 200 హెక్టార్లలో విస్తరించి ఉన్న ఈ అడవుల్లో పెద్ద ఎత్తున గాలిదుమారం బీభత్సం సృష్టించింది. దీంతో మహావృక్షాలు సైతం మొక్కల్లా నేలకొరిగాయి. పరిశీలనకు వెళ్లిన అధికారులు సైతం ఆశ్చర్యానికి గురయ్యారు. పెద్ద ఎత్తున వాటిల్లిన భయోత్పాతాన్ని లెక్కించే పనిలో నిమగ్నం అయ్యారు. ఆ లెక్క ఇప్పటికీ కొనసాగుతూనే ఉంది. పెద్ద పెద్ద వృక్షాలు నేలకొరిగాయి అంటే కనీసం గంటకు 120 కిలోమీటర్ల వేగంతో వీచిన గాలులే దీనికి కారణమంటూ అటవీ శాఖ అధికారులు అనుమానం వ్యక్తం చేశారు. అయితే.. ఒకేసారి 50వేలకు పైగా చెట్లు నేలకొరగడంపైనా దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు. ఇదిలా ఉంటే.. ఇంతటి పెను గాలులతో అడవిలో అంతలా బీభత్సం నెలకొంటే వన్యప్రాణులు మాత్రం సేఫ్ అయ్యాయి. ఒక్కటంటే ఒక్కటి కూడా ప్రాణాలు కోల్పోయిన దాఖలాలు లేవు. కనీసం గాయపడినట్లుగానూ ఎక్కడా కనిపించలేదు. ఈ అడవిలో జింకలు, ఎలుగుబంట్లు, కుందేళ్లు, అడవి దున్నలు, నీలుగాయిలు, కొండ గొర్రెలు, అడవి పందులు, కోతులు, ఉడుతలు, వివిధ రకాల పక్షులు ఇతర జీవరాశులు చాలా వరకే ఉన్నాయి. వేల సంఖ్యలో వన్యప్రాణులు ఉన్నాయి. అయితే.. సుడిగాలులు ఇంతలా అడవులను నేలమట్టం చేసినా వన్యప్రాణులు చనిపోయినట్లుగా ఇంతవరకు అధికారులకు కనిపించలేదు. దీంతో అధికారులు సైతం ఆశ్చర్యానికి గురవుతున్నారు. అయితే.. దీనిపైనా ఓ రకమైన ప్రచారం జరుగుతోంది. సాధారణంగా వన్యప్రాణులకు ప్రకృతి విపత్తులను ముందుగానే పసిగట్టే గుణం ఉంటుంది. వాసన, శబ్దాలను అవి ఇట్టే గుర్తిస్తాయి. భూ ప్రకంపనలను సైతం ముందు పసిగడతాయి. అయితే.. ఆ రోజు కూడా ఈ విపత్తును ముందే పసిగట్టి అవి సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లి ఉంటాయని భూపలపల్లి అటవీ శాఖ రిటైర్డ్ అధికారి పురుషోత్తం తెలిపారు.

## జమిలి ఎన్నికలపై యూటర్న్ తీసుకోక తప్పదు : సచిన్ పైలట్



**న్యూఢిల్లీ-నవభూమి:**జమిలి ఎన్నికల నిర్వహణపై కాంగ్రెస్ నేత సచిన్ పైలట్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఉత్తరాది రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా వాస్తవ అంశాల నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకే జమిలి ఎన్నికలను తెరపైకి తీసుకొచ్చారని ఆరోపించారు. ఎన్నో అంశాలను కేంద్ర ప్రభుత్వం చేపట్టాల్సి ఉన్నా పార్లమెంట్‌లో తగినంత సంఖ్యాబలం లేకపోవడంతో యూటర్న్ తీసుకోవాల్సి వచ్చిందని అన్నారు. జమ్ము కశ్మీర్‌లో ఈరోజు అసెంబ్లీ ఎన్నికల తొలి దశ పోలింగ్ జరిగిందని, ఇక్కడ బీజేపీ పూర్తిగా వెనుకబడిందని, హరియాణలో సైతం కాషాయ పార్టీది ఇదే పరిస్థితని పేర్కొన్నారు.

ప్రస్తుత పార్లమెంటరీ వ్యవస్థలో జమిలి ఎన్నికలు సాధ్యమయ్యే పని కాదని, క్యాబినెట్‌లో ఆమోదించినంత మాత్రాన అమలు అంత సులభం కాదని వ్యాఖ్యానించారు. వీరు గత నిర్ణయాలపై యూటర్న్ తీసుకున్న తరహాలోనే జమిలి ఎన్నికలపైనా యూటర్న్ తీసుకుంటారని అన్నారు. కాగా, జమిలి ఎన్నికలనిర్వహణకు లైన్ క్లియర్ అవుతోంది. వన్ నేషన్-వన్ ఎలక్షన్ ప్రక్రియకు ఇవాళ కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. శీతాకాల పార్లమెంట్ సమావేశాల్లో వన్ నేషన్-వన్ ఎలక్షన్ బిల్లును ప్రవేశపెట్టనున్నారు.మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ కమిటీ అందజేసిన రిపోర్టుకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఎట్టి పరిస్థితుల్లోనైనా జమిలి ఎన్నికలు నిర్వహించి తీరుతామని ఇటీవల కేంద్ర మంత్రి అమిత్ షా పేర్కొన్న విషయం తెలిసిందే.రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలోని కమిటీ వన్ నేషన్-వన్ ఎలక్షన్ ప్రతిపాదన చేసింది. సెప్టెంబర్‌లో ఆ ప్యానెల్ ఏర్పాటైంది. లోక్‌సభ ఎన్నికలకు ముందే కోవింద్ ప్యానెల్ తన నివేదికను కేంద్ర ప్రభుత్వానికి అందజేసింది. న్యాయశాఖ ఆ రిపోర్టును ఇవాళ కేంద్ర క్యాబినెట్ ముందు ప్రవేశపెట్టింది.

### అజిత్ పవార్ వల్లే మహారాష్ట్ర కేబినెట్‌లో


# మా పార్టీకి చోటు దక్కలేదు: కేంద్ర మంత్రి



**న్యూఢిల్లీ- నవభూమి:** కేంద్ర మంత్రి రాందాస్ అథవాలే కీలక వ్యాఖ్యలు చేశారు. మహారాష్ట్రలోని మహాయుతి ప్రభుత్వంలో అజిత్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీని చేర్చుకోవడం వల్ల తమ పార్టీ ఆర్పీఐ(ఏ)కు చోటు దక్కలేదని అన్నారు. సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి రాందాస్ అథవాలే, పాల్ఘడ్ జిల్లాలోని దహానులో మీడియాతో మాట్లాడారు. 'మహాయుతి ప్రభుత్వంలో అజిత్ పవార్ చేరిన తర్వాత మహారాష్ట్ర కేబినెట్‌లో ఆర్పీఐ (ఏ)కు మంత్రి పదవి రాలేదు. మా పార్టీకి క్యాబినెట్ పదవులు, రెండు కార్పొరేషన్ల చైర్మన్‌లు, జిల్లా స్థాయి కమిటీ పోస్టులు ఇస్తామని హామీ ఇచ్చారు. కానీ అజిత్ పవార్ చేరికతో ఇవేమీ జరుగలేదు' అని అన్నారు. అయితే రానున్న మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఆర్పీఐ(ఏ)కు 12 సీట్లు కేటాయించాలని రాందాస్ అథవాలే డిమాండ్ చేశారు. అలాగే రాష్ట్ర మంత్రివర్గంలో కూడా ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు.

కాగా, మరాఠా రిజర్వేషన్ అంశాన్ని మొదట లేవనెత్తింది తమ పార్టీనే అని అథవాలే తెలిపారు. ప్రత్యేక కేటగిరీ కింద మరాఠాలకు రిజర్వేషన్ కల్పించాలని సూచించారు. ఇతర వెనుకబడిన తరగతుల (ఓబీసీ) కింద వారిని చేర్చడం వల్ల ఆ వర్గం నుంచి వ్యతిరేకత వస్తుందని అన్నారు. 'తమిళనాడు రిజర్వేషన్ విధానాన్ని మహారాష్ట్ర ప్రభుత్వం అధ్యయనం చేయాలి. ప్రతి ఏటా రూ. 8 లక్షల కంటే తక్కువ సంపాదిస్తున్న ఆర్థికంగా బలహీనంగా ఉన్న వర్గాలకు చెందిన మరాఠాలకు రిజర్వేషన్లు కల్పించాలి' అని అన్నారు. వక్ఫ్ (సవరణ) బిల్లు 2024కు తమ పార్టీ మద్దతు ఇచ్చిందని ఆయన వెల్లడించారు.

## రూ.31,000 కోట్లతో.. భారత్- మయన్మార్ సరిహద్దుకు కంచె




**న్యూఢిల్లీ-నవభూమి:** కేంద్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకున్నది. 1,643 కిలోమీటర్ల మేర విస్తరించిన భారత్- మయన్మార్ మధ్య ఉన్న అంతర్జాతీయ సరిహద్దుకు కంచె వేయనున్నది. దీని కోసం రూ.31,000 కోట్లు ఖర్చు చేయనున్నది. ఆయుధాలు, మందుగుండు సామాగ్రి, మాదక ద్రవ్యాల అక్రమ రవాణాతోపాటు చొరబాట్లకు ఈ సరిహద్దు పరిపాటిగా మారింది. ఈ నేపథ్యంలో వీటిని నియంత్రించేందుకు 1,643 కిలోమీటర్ల భారత్- మయన్మార్ సరిహద్దులో ఫెన్సింగ్, రోడ్ల నిర్మాణానికి క్యాబినెట్ భద్రతా కమిటీ ఆమోదం తెలిపినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. మణిపూర్‌లో భద్రతా పరిస్థితిని కేంద్ర హోంమంత్రి అమిత్ షా క్రమం తప్పకుండా సమీక్షిస్తున్నారని, అవసరమైన చర్యలు తీసుకుం టున్నారని ఆ వర్గాలు వెల్లడించాయి.కాగా, మణిపూర్, మిజోరాం, నాగాలాండ్, అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రాల బోర్డర్‌లో భారత్-మయన్మార్ సరిహద్దు ఉంది. 2018లో అమలు చేసిన భారత్ ఈస్ట్ పాలసీలో భాగంగా సరిహద్దుకు సమీపంలో నివసించే ప్రజలు ఎలాంటి పత్రాలు లేకుండా ఒకరి భూభాగంలోకి మరొకరు 16 కిలోమీటర్ల పరిధి వరకు వెళ్లవచ్చు. అయితే మయన్మార్‌లో ఆర్మీ పాలన, సంఘర్షణల వల్ల ఆ దేశ ప్రజలు, గత ప్రభుత్వ అనుకూల సైనికులు, అధికారులు భారత్‌లోకి చొరబడుతున్నారు. ఈ నేపథ్యంలో భారత్-మయన్మార్ ఫ్రీ మూవ్‌మెంట్ రెజీమ్ (ఎఫ్ఎంఆర్)ను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసింది.మరోవైపు మణిపూర్‌లో జాతి హింసకు ఈ చొరబాట్లు మూల కారణమని కేంద్ర హోంమంత్రి అమిత్ తెలిపారు. ఈ నేపథ్యంలో ఈ ప్రాంతంలోని సరిహద్దులో 30 కిలోమీటర్ల మేర కంచె నిర్మాణం పూర్తి చేసినట్లు మంగళవారం చెప్పారు. మోరే సమీపంలో ఇప్పటికే దాదాపు 10 కిలోమీటర్ల ఫెన్సింగ్ పూర్తైందని అన్నారు. మణిపూర్‌లోని ఇతర ప్రాంతాల సరిహద్దులో మరో 21 కిలోమీటర్ల మేర కంచె నిర్మాణ పనులు జరుగుతున్నాయని భద్రతా సమీక్ష అనంతరం వివరించారు.

# ప్రయాణికులకు గుడ్‌న్యూస్..!




**న్యూఢిల్లీ-నవభూమి:**రైలులో ప్రయాణానికి తప్పనిసరిగా టికెట్ కావాల్సిందే. టికెట్ల బుకింగ్ కోసం ఐఆర్‌సీటీసీకి ఉపయోగిస్తున్నారు. అయితే, రైల్వే ప్రయాణికులకు కోసం పలు రకాల యాప్స్‌ను ఉపయోగిస్తున్నది. అయితే, రైల్వే అన్నిరకాల సేవలు అందించేందుకు సరికొత్త సూపర్ యాప్‌ను కేంద్రం తీసుకువస్తుంది. ఇందులో అన్ని రైల్వేసేవలు అందుబాటులోకి రానున్నాయి. రైలు ప్రయాణాన్ని సులభతరం చేసేందుకు కేంద్ర కసరత్తు చేస్తున్నది. ఇందులో భాగంగా సరికొత్తగా సూపర్ యాప్‌ని రూపొందిస్తున్నట్లు కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ గతంలో ప్రకటించాయి. ఇందులోని అన్ని సేవలు ఈ యాప్‌లో ఉంటాయని చెప్పారు. రైలు టికెట్ బుకింగ్ కోసం ఐఆర్‌సీటీసీ యాప్, వెబ్‌సైట్‌ని ఉపయోగిస్తున్నారు. అలాగే, రైలు స్టేటస్‌ని ట్రాక్ చేసేందుకు, పీఎన్ఆర్ స్టేటస్‌ని చూసేందుకు వివిధ రకాల యాప్‌ని ఉపయోగిస్తున్న విషయం తెలిసిందే. అయితే, రైల్వేశాఖకు సంబంధించి టికెట్స్ బుకింగ్, పీఎన్ఆర్ స్టేటస్, ట్రాకింగ్ స్టేటస్ కోసం యాప్స్‌ని ఉపయోగించడం ఇబ్బందికరంగా మారింది.

ఈ సమస్యను అధిగమించేందుకు ప్రభుత్వం సరికొత్త సూపర్ యాప్‌ని తీసుకురాబోతున్నది. ఇకపై ఈ యాప్‌లోనే టికెట్స్ బుకింగ్, పీఎన్ఆర్ స్టేటస్, ట్రెయిన్ ట్రాకింగ్ చేసేందుకు వీలుంటుంది. అయితే, రైల్వే మౌలిక సదుపాయాలను మెరుగుపరిచేందుకు కృషి చేస్తున్నట్లు ఇటీవల రైల్వేశాఖ మంత్రి పేర్కొన్నారు. గత దశాబ్దల కాలంగా రైల్వేలను అత్యాధునికంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం దృష్టి సారిస్తోందన్నారు. అలాగే, సాంకేతికంగా అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. ఇక ప్లాట్‌ఫారమ్ నుంచి జనరల్ టికెట్ వరకు ఆన్‌లైన్ మోడ్‌లో కొనుగోలు చేసే వీలుంటుంది. అదే సమయంలో రైల్వే భద్రతపై ప్రభుత్వం పూర్తిగా దృష్టి సారిస్తోంది. దీంతో రైలు ప్రమాదాల సంఖ్య తగ్గుముఖం పట్టిందని మంత్రి చెప్పారు. ప్రభుత్వం స్వదేశీ ఆటోమేటిక్ ట్రైన్ ప్రొటెక్షన్ వ్యవస్థను అమలు చేస్తున్నది. దీన్ని 'కవచ్'గా పిలుస్తుంటారు. ప్రస్తుతం 10వేలు కవచ్ సిస్టమ్‌లను ఏర్పాటు చేసింది రైల్వేశాఖ.

## జమ్మూకశ్మీర్ పోలింగ్ స్టేషన్‌లో ఉద్రిక్తత.. కాసేపు పోలింగ్ నిలిపివేత



**కిష్ట్‌వార్-నవభూమి:** జమ్మూ కశ్మీర్‌లో ఇవాళ తొలి దశ అసెంబ్లీ పోలింగ్ జరుగుతోంది. కిష్ట్‌వార్‌లో కాసేపు పోలింగ్‌ను నిలిపివేశారు. ఎటువంటి గుర్తింపు కార్డు లేకుండా ఓ వ్యక్తి పోలింగ్ స్టేషన్‌కు వచ్చాడు. దీంతో అక్కడ కాసేపు పోలింగ్‌ను నిలిపివేశారు. ఇక్కడ ఉన్న ప్రజల్లో గందరగోళం ఉన్నదని, ఓ సమస్య వచ్చిందని, కానీ దాన్ని పరిష్కరించినట్లు కిష్ట్‌వార్ డీఎం రాజేశ్ కుమార్ తెలిపారు. ఐడెంటిఫికేషన్‌కు చెందిన ఓ ఇష్యూ వచ్చినట్లు ఆయన వెల్లడించారు. ఓ ఓటరు వద్ద గుర్తింపు కార్డు లేదని, కానీ ప్రస్తుతం పరిస్థితి నార్మల్‌కు వచ్చినట్లు వెల్లడించారు. పీడీపీ, ఎన్సీ వర్కర్లు పోలింగ్ బూత్‌లోకి వెళ్లినట్లు బీజేపీ నేత షాగున్ పరిహార్ ఆరోపించారు. తనను నెట్టివేసినట్లు ఆమె పేర్కొన్నారు. జమ్మూకశ్మీర్‌లో మధ్యాహ్నం ఒకటి వరకు 41.47 శాతం ఓటింగ్ జరిగింది.

## జమిలి.. మోదీ-షాలకే కలిమి.. గట్టి షాకిస్తున్న విపక్షం!

**న్యూఢిల్లీ- నవభూమి:**గత రెండు టర్మ్ లకు భిన్నంగా ఈసారి ఎన్నికల్లో లోక్ సభలో బీజేపీకి సొంతగా సంపూర్ణ మెజారిటీ రాలేదు. అయితే, అంతమాత్రాన చాలా కీలక నిర్ణయాల్లో వెనకడుగు వేయడం లేదు. ఇలాంటివాటిలో జమిలి ఎన్నికలు ఒకటి. ఎందుకనో గానీ.. ఈ వియంలో చాలా గట్టి పట్టుదలగా ఉంది. 'ఒక దేశం-ఒకే ఎన్నిక'కు అన్ని పార్టీల నుంచి మద్దతు లభిస్తుందని కూడా ఆశిస్తోంది. కానీ.. అదేమీ అంత సులువు కాదని స్పష్టం అవుతోంది. మోదీ 3.0.. వంద రోజుల సెన్సేషన్ మోదీ మూడో విడత ప్రభుత్వం వంద రోజుల పాలన పూర్తి చేసుకుంది. ఆ సందర్భంగానే అన్నట్లుగా 'జమిలి ఎన్నికలు' అంశాన్ని తెరపైకి తెచ్చింది. ఈ విషయాన్ని కేంద్ర ప్రభుత్వ వర్గాలే ఇటీవ వెల్లడించాయి. కాగా, లోక్ సభ ఎన్నికల బీజేపీ మేనిఫెస్టోలో జమిలి ఎన్నికల హామీ కూడా ఉండడం గమనార్హం. మరోవైపు జమిలి ఎన్నికలపై మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ సారథ్యంలో అత్యున్నత స్థాయి కమిటీ వేశారు. ఆ కమిటీ లోక్ సభ, రాష్ట్రాల అసెంబ్లీలకు సమాంతరంగా ఒకేసారి ఎన్నికలు జరపాలని.. ఇవి పూర్తయిన వంద రోజుల వ్యవధిలోనే స్థానిక సంస్థల ఎన్నికలు జరపాలని సూచించింది. సిఫారసుల అమలుకు ప్రత్యేక గ్రూపును ఏర్పాటు చేయాలని కోవింద్ కమిటీ ప్రతిపాదించింది. జమిలి ఎన్నికలకు 18 రాజ్యాంగ సవరణలను సూచించింది.

వీటిలో ఎక్కువవాటికి రాష్ట్రాల అసెంబ్లీల ఆమోదం అక్కర్లేదని వివరించింది. - దక్షిణాసియా దేశాలు డేంజర్‌లో ఉన్నాయా..? దానికి కారణం అదేనా..? మంత్రివర్గం ముందుకు.. ఒకే దేశం-ఒకే ఎన్నిక ప్రతిపాదనకు మోదీ మంత్రివర్గం బుధవారం ఆమోదం తెలిపింది. కోవింద్ కమిటీ తన నివేదికను రాష్ట్రపతికి సమర్పించింది. రెండు దశల్లో ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలని సూచించింది. అదే కమిటీ నివేదికను కేంద్ర కేబినెట్ బుధవారం ఆమోదించింది. అయితే, 'ఒకే దేశం-ఒకే ఎన్నిక' అంశంపై పలువురు ప్రతిపక్ష నేతలు ఇది ఆచరణాత్మకం కాదని అంటున్నారు. క్యాబినెట్ ఆమోదం తర్వాత కాంగ్రెస్ తో పాటు పలు పార్టీలు వ్యతిరేకిస్తున్నాయి. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే మాట్లాడుతూ.. దేశ ప్రజలు ఒకే దేశం ఒకే ఎన్నికను అంగీకరించబోరని అన్నారు. ఎన్నికల సమస్యలు సృష్టించి ప్రజలను మళ్లిస్తున్నారని ఆరోపించారు. 'ఒక దేశం-ఒకే ఎన్నికలు' ఆచరణాత్మకం కాదన్నారు. మరోవైపు హైదరాబాద్ ఎంపీ, ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ కూడా ఎక్స్ వేదికగా స్పందించారు. "సమాఖ్య వ్యవస్థను నాశనం చేయడంతో పాటు ప్రజాస్వామ్యాన్ని రాజీపడేలా చేయడం వల్లే ఒకే దేశం-ఒకే ఎన్నికను వ్యతిరేకిస్తున్నట్లు" చెప్పారు. బహుళ ఎన్నికలు మోదీ, షాలకు తప్ప ఎవరికీ ఇబ్బంది కాదన్నారు. మున్సిపల్, స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా ప్రచారం చేయాల్సిన అవసరం ఉన్నందున ఇలా చేస్తున్నారు. సక్రమంగా, ఎప్పటికప్పుడు ఎన్నికలు నిర్వహించడం వల్ల ప్రజాస్వామ్య జవాబుదారీతనం కూడా మెరుగుపడుతుంది." అని రాసుకొచ్చారు.

## చెన్నైలో కరడుగట్టిన గ్యాంగ్ స్టర్ కాల్చివేత

**చెన్నై-నవభూమి:**పెద్దయితే నువ్వేం అవుతావు అంటూ విద్యార్థులను టీచర్లు అడగడం సాధారణమైన విషయం. అందుకు స్టూడెంట్లు బదులిస్తూ... కలెక్టర్ ను అవుతాననో, పోలీస్ అధికారి అవుతాననో, విమాన పైలెట్ అవుతాననో, క్రికెటర్ అనో... ఇలా తమ భవిష్యత్ ప్రణాళికల గురించి చెబుతుంటారు. కానీ, ఓ కుర్రాడు మాత్రం తాను రౌడీ అవుతానని టీచర్ తో చెప్పడమే కాదు, అయ్యాడు కూడా. కానీ, చివరికి పోలీసుల చేతిలో హతమయ్యాడు. అతడి పేరు కక్కతోప్పు బాలాజీ. చెన్నైలో కరడుగట్టిన గ్యాంగ్ స్టర్‌గా పేరుమోసిన కక్కతోప్పు బాలాజీ కథ ఇవాళ వేకువజామున ముగిసింది. 50కి పైగా క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్న బాలాజీని పోలీసులు ఎన్ కౌంటర్ లో కాల్చి చంపారు. గ్రేటర్ చెన్నై పోలీసులు ఓ కేసులో బాలాజీని అరెస్ట్ చేసేందుకు వైసర్పాడి వెళ్లారు. అయితే పోలీసుల రాకను గమనించిన ఆ గ్యాంగ్ స్టర్ మారణాయుధాలతో వారిపై దాడికి యత్నించాడు. దాంతో పోలీసులు కాల్పులు జరపడంతో అతడు మరణించాడు. ఇటీవల కాలంలో గ్రేటర్ చెన్నై పోలీసులు చేపట్టిన రెండో ఎన్ కౌంటర్ ఇది. బీఎస్పీ చీఫ్ కె.ఆర్మ్ స్ట్రాంగ్ హత్య కేసులో నిందితుడిగా ఉన్న నేరస్తుడు తిరువెంగడం కూడా జూన్ 14న పోలీసుల కాల్పుల్లో హతమయ్యాడు.

## తాజ్‌మహల్‌పై పిచ్చి మొక్కలు.. ప్రమాదంలో వారసత్వ కట్టడం!



**న్యూఢిల్లీ–నవభూమి:** ప్రపంచంలోని ఏడు వింతల్లో ఒకటైన తాజ్‌మహల్ నిర్వహణలో నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. ఈ కట్టడాన్ని కాపాడుకోవడంలో ఆగ్రా అధికారులు విఫలమవుతున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. నాలుగు రోజుల క్రితం ఆగ్రా పరిసర ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు తాజ్ మహల్ ప్రధాన డూమ్‌లోంచి నీరు లీక్ అయింది. ఇందుకు సంబంధించిన వీడియోలు నెట్టింట వైరల్ అయ్యాయి. నీరంతా సమాధి చుట్టూ వచ్చి చేరాయి. ఇది జరిగి వారం గడవకముందే.. తాజ్‌మహల్ పైన పిచ్చి మొక్కలు పెరిగిన వీడియోలు నెట్టింట్ వైరల్ అవుతోంది.

రెండు పాలరాయి బండలు, అచ్చు మధ్య ఒక మొక్క పెరిగినట్లు వీడియోలో కనిపిస్తోంది. తాజ్‌మహల్‌పై మొక్కలు గత కొంత కాలంగా పెరుగుతున్నాయని.. అధికారులు పట్టించుకోవట్లేదని టూరిస్టులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే కాలుష్యంతో తాజ్‌మహల్ సహజ రంగును కోల్పోతోందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. మరోపక్క నీటి లీకేజీ సమస్యా ఉంది. తాజాగా.. మొక్కలు పెరగడం సందర్భకులను తీవ్ర ఆందోళనకు గురి చేస్తోంది. ఆగ్రా టూరిజం గిల్డ్ ప్రెసిడెంట్ రాజీవ్ సక్సేనా వీడియోపై స్పందించారు. "%రాూ×% ప్రతి సంవత్సరం తాజ్ మహల్ సంరక్షణ కోసం రూ.3 – 4 కోట్లు ఖర్చు చేస్తుంది. ఇలాంటి సంఘటనలు ఏఎస్ఐ ప్రతిష్ఠను దెబ్బతీస్తాయి.



## వృత్తుల ఆధునికీకరణ

గ్లోబలైజేషన్ సందర్భంలో అగ్రవర్ణాలు సైతం డ్రైక్లీనింగ్, సెలూన్ వంటి వృత్తులలోకి ప్రవేశించారు. ఇది ఎలా సాధ్యమైంది? కేవలం వృత్తిని ఆధునికీకరించడం వల్ల మాత్రమే సాధ్యమైంది. గ్రామీణ స్థాయిలో వృత్తిని నమ్ముకొని పొట్టపోసుకునే వాళ్లకు వృత్తిని ఆధునికీకరించుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పిస్తోంది. తద్వారా వృత్తి బ్రతకడమే కాకుండా, ఆ వృత్తి మీద ఆధారపడి జీవించే సమూహాలు కూడా బ్రతికేందుకు అవకాశం లభిస్తోంది.

తెలంగాణ రాష్ట్రంలో వృత్తుల సంక్షేమం కీలకంగా మారింది. మునుపెన్నడూ లేనివిధంగా వృత్తులకు పెద్దపీటవేయడం పట్ల భిన్నమైన స్పందనలు వ్యక్తమవుతున్నాయి. వృత్తిని ప్రోత్సహించడం అంటే రాజ్యాధికారానికి దూరం చేయడమా? లేక వృత్తులను కాపాడాల్సిన అవసరం ఉందా? అందులో వృత్తుల ఆధునికీకరణ అవసరాన్ని గుర్తిస్తున్నామా? అనే ప్రశ్నలు ప్రస్తుతం తెలంగాణ సమాజాన్ని, బుద్ధిజీవులను ఆలోచింపజేస్తున్నవి. వృత్తి అనగానే వెంటనే గుర్తుకు వచ్చే అంశం కులమే. చేతి వృత్తులు, సేవ వృత్తులు వెనుకబడిన కులాలకు చెందినవే. జనాభాలో సింహభాగంగా యాభై రెండు శాతంగా ఉన్న బీసీలతో మెజారిటీ వృత్తులు మమేకమై ఉన్నాయి. బీసీలకు సంక్షేమ ఫలాలు అందాలన్న ప్రభుత్వ లక్ష్యానికి గమ్యాగమనాలు చర్చించడమే ఈ వ్యాసోద్దేశం.

తెలంగాణలో వృత్తుల విధ్వంసం గ్లోబలైజేషన్ కంటే ముందే మొదలైంది. ఆంధ్ర వలస పాలనలో తెలంగాణలో వ్యవసాయ సంక్షోభం తలెత్తింది. అది పరోక్షంగా వృత్తుల మీద పడ్డది. దీంతో వృత్తుల మీదే ఆధారపడి జీవించే కులాలకు ఉపాధి లేకుండా పోయింది. వృత్తి మీద మమకారంతో దాన్ని?వదులుకోలేని కులాలు ఆకలి చావుల, ఆత్మహత్యల బాట పట్టిన విషాదం కూడా ఉంది. ఈ నేపథ్యంలో అధికారంలోకి వచ్చిన తెలంగాణ సర్కార్ తెరమీదికి తెచ్చిన అంశం వృత్తులకు ప్రోత్సాహం.

వృత్తులను ప్రోత్సహించడమంటే కుల వ్యవస్థను కాపాడడమేనా? అనే ప్రశ్న సమర్థనీయమైంది కాదు. గ్రామీణ భారతపు ఎకానమీ అంతా వ్యవసాయం, వృత్తుల మీదే ఆధారపడి ఉందనే విషయాన్ని గమనించాలి. తెలంగాణ వెనుకబాటులో ఈ రెండు ప్రధాన సమస్యలుగా ఉన్నాయి. వీటిలో కులం వల్ల వృత్తికి వచ్చిన అమానుష గుర్తింపులను వదిలించడానికి ప్రయత్నాలు జరగాలి. గౌతమ బుద్ధుని కాలం కంటే ముందు నుంచే వృత్తులు ఉన్నాయి. కానీ, ఆనాడు కులాలు లేకపోవడం వల్ల వృత్తులకు గౌరవం దక్కింది. మనువాద కుల వ్యవస్థ మొదలైన తరువాత వృత్తుల్లో గౌరవనీయమైన వృత్తులు, నీచ వృత్తులు, అంటరాని వృత్తులు అనే విభజన ఏర్పడింది. బీసీలు చేసే వృత్తులను బ్రాహ్మణీయ సమాజం గౌరవనీయమైనవిగా గుర్తించ నిరాకరించింది. ఇక సేవ కులాలుగా ఉన్న చాకలి, మంగలి వృత్తుల పట్ల ఇప్పటికీ వివక్ష కొనసాగుతూనే ఉంది. ఈ పరిస్థితి మారాలంటే ప్రభుత్వం కల్పించే ప్రోత్సాహం ఈ వృత్తిని ఆధునికీకరించే విధంగా ఉండాలి.

గ్లోబలైజేషన్ సందర్భంలో అగ్రవర్ణాలు సైతం డ్రైక్లీనింగ్, సెలూన్ వంటి వృత్తులలోకి ప్రవేశించారు. ఇది ఎలా సాధ్యమైంది? కేవలం వృత్తిని ఆధునికీకరించడం వల్ల మాత్రమే సాధ్యమైంది. వృత్తి ఆధునికీకరణ అనేది పూర్తిగా ఆర్థిక వనరుల మీద ఆధారపడిన విషయం. స్కిల్, టెక్నాలజీ, నాలెడ్జ్ దానికి తోడైనా సరే డబ్బున్నవారికి మాత్రమే వృత్తిని ఆధునికీకరించుకునే వెసులుబాటు ఏర్పడింది. అయితే గ్రామీణ స్థాయిలో వృత్తిని నమ్ముకొని పొట్టపోసుకునే వాళ్లకు వృత్తిని ఆధునికీకరించుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పిస్తోంది. తద్వార వృత్తి బ్రతకడమే కాకుండా, ఆ వృత్తి మీద ఆధారపడి జీవించే సమూహాలు కూడా బ్రతికేందుకు అవకాశం లభిస్తోంది. అలాగే వృత్తిని ఆధునికీకరించడం వల్ల మాత్రమే వృత్తికి ఆపాదించబడిన తక్కువ ఎక్కువ కొలమానాలు కూడా క్రమంగా కనుమరుగై వృత్తి ప్రొఫెషన్‌గా ఎదుగుతుంది. ఈ దిశగా ప్రభుత్వం సంపూర్ణ ఆర్థిక పరిపుష్టికై ఆలోచనలు చేయాల్సిన అవసరం ఉంది. మార్కెట్ అవసరాలకు అనుగుణంగా వృత్తిని ఆధునికీకరించాలి. ప్రత్యామ్నాయం లేకుండా వృత్తులు పోవాలని కోరుకోవడం అత్యాశ.

ఇక రాజ్యాధికార భాగస్వామ్యం విషయానికొస్తే... వృత్తులను ప్రోత్సహించడం పేరుతో, బహుజనులను రాజ్యాధికారానికి దూరం చేస్తున్నారనే చర్చ కూడా ఉంది. ఇది పాక్షిక సత్యమే. రాజ్యాధికారంలో వాటా జనాభా దామాషా ప్రకారం దక్కాల్సిందే. దాన్ని వృత్తుల ప్రోత్సాహానికి ముడిపెట్టడం సరైనది కాదు. ఇవి రెండు వేరు వేరు విషయాలు. ఇవాళ ఆకలితో ఉన్న వృత్తికులాలకు నీకు అధికారం కావాలా? అన్నం కావాలా? అంటే ఖచ్చితంగా ఆకలితీరే దారి గురించే ఆలోచిస్తాయి. అలాగని వారినేం అధికారానికి దూరం చేయాల్సిన అవసరం లేదు. ఇందుకోసం చేయాల్సిన పని దశలవారీగా ఉంది. ముందుగా వృత్తుల మీద ఆధారపడి జీవిస్తున్న వారి లెక్కలు తీయాలి.వారి వయసులు, చదువు ఆధారంగా ప్రోత్సాహం అందించాలి. అలాగే చదువు ఉండి ఉపాధి లేక అవస్థలు పడుతున్న వారికి ఆర్థిక వెసులుబాటు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలి. ఇక ఇప్పటికే చదువు ఉండి, ఆర్థిక వెసులుబాటు ఉన్న వృత్తుల యువతకు రాజ్యాధికారంలో భాగస్వామ్యం కల్పించాలి.

# సరైన అభ్యసనానికి పాఠశాలే కీలకం



పుట్టినప్పటి నుంచి మరణించే వరకు ఎదురయ్యే ఆయా అనుభవాల పరంపరే జీవితం. ఆయా అనుభవాల నుండి అనేక విషయాలు నేర్చుకుంటునే ఉంటాము. నేర్చుకోవడంతోనే జీవితం ఫలప్రదమవుతుంది. నేర్చుకోవాలనే జిజ్ఞాస ఉండాలే కానీ ఎక్కడైనా ఎప్పుడైనా ఏదైనా నేర్చుకోవచ్చు. అయితే నేర్చుకునే క్రమంలో అది సరైనదా? ఉపయోగమా? అనుయుక్తమా? అని వాటిని బేరీజు చేసుకోవాల్సి ఉంటుంది. అనాలోచితంగా ఏది పడితే అది నేర్చుకోవడం. ఉపయుక్తం కాబోదు. కచ్చితంగా మన నైపుణ్యాలకు, వైఖరులకు అభ్యసనం సరిపడినదై ఉండాలి. ప్రకృతి నుండి, పుస్తకాల నుండి అనేక విషయాలను నేర్చుకునే వీలుంది. నేర్చుకోవడాన్ని అభ్యసనమంటారు. అభ్యసనం జీవితాంతం కొనసాగే నిరంతర ప్రక్రియ. అభ్యసనము అంటే పాత, కొత్త అనుభవాల సంశ్లేషణ ఫలితంగా సంభవించే అనుభవపు పూర్తి నూతన అమరిక. అభ్యసనం జీవితాంతం కొనసాగుతూ గతిశీలంగా ఉంటుంది. ఒక ముక్కలో చెప్పాలంటే అభ్యాసనం లేకుండా వ్యక్తి జీవితంలో వికాసం ఉండదు. అందుకే సార్వత్రికమైనది.

జీవిత కాలమంతా పరిసరాల నుండి, పుస్తకాల నుండి, పాఠశాలలో ఉపాధ్యాయుల నుండి, తోటి వారి నుండి నేర్చుకోవాలనే తపన ఉంటే ఎక్కడైనా, ఎవరి నుండైనా, ఎప్పుడైనా నేర్చుకోవచ్చు. నేర్చుకోవడానికి అవధులు లేవు. జీవిత పర్యంతము నేర్చుకోవచ్చు. సందర్భానుసారంగా నేర్చుకుంటే అనవసరమైన భయాలు, (ఫోబియా), ద్వేషాలు, అసూయలు, ఆందోళనలు నశిస్తాయి. జ్ఞానోదయం కలుగుతుంది. నేర్చుకోవాలనే తపన ఉంటే మొదట తల్లిదండ్రుల నుండి, చుట్టుప్రక్కల వారి నుండి, సమవయస్క బృందాల నుండి, ఉపాధ్యాయుల నుండి, సమాజం నుండి, అన్నింటి నుండి నేర్చుకోవచ్చు. నేర్చుకుంటేనే కదా అభివృద్ధి సాధించేది.

అభ్యసన ప్రక్రియలో పాఠశాలే కీలకం. పాఠశాలలో అభ్యసనానికి సురక్షిత, ఆహ్లాద పూరిత పరిసరాలను



విధిగా ఏర్పరచాలి. లేనిచో విద్యార్థుల్లో అభద్రతా భావం చోటు చేసుకుంటుంది. అభద్రత భావంతో విపరీత ప్రవర్తనలు మరియు ఆయా విభేదాలు చోటు చేసుకోవడంతో అభ్యాసనం అనుకునే రీతిలో జరగదు. అందుచే పాఠశాల సురక్షితమైన ప్రదేశంగా ఉంటూ ఆహ్లాదకరమైన పరిస్థితులను కల్పించాలి. పాఠశాల ప్రత్యేక రక్షిత ప్రాంతంగా ఉండాలి. ఆహ్లాదకరంగా ఆనందమయంగా సురక్షితమైనదిగా పాఠశాల నిర్వహించబడాలి. అప్పుడే విద్యార్థుల అభ్యసన ప్రక్రియలో ఇమిడి పోతుంటారు. ఫలితంగా ప్రయోజకులవుతుంటారు. ఇందుకుగాను

1.పాఠశాల వాతావరణం ఆహ్లాదకరంగా ఉండాలి. పిల్లలకు మంచి పరిశీలన స్వభావం ఉంటుంది. ఆహ్లాదకర సురక్షిత వాతావరణంలో వారు అమితమైన ఆనందాన్ని పొందుతారు. ఇక్కడే చదువుకోవాలనే భావన కలిగించాలి. పరిశుభ్రతను విధిగా పాటిస్తే పిల్లలు ఆకర్షితులవుతారు. వ్యవస్థీకృతంగా పాఠశాల వాతావరణం ఉంటే మంచి గుణాలతో చక్కని అభ్యసన సామర్థ్యాలను పెంపొందించుకుంటారు. ఈ మేరకు పాఠశాలలో తగురీతుల్లో ఆకర్షణీయమైన భౌతిక వాతావరణం ఏర్పరచాలి.

**2) పాఠశాల – భద్రత:**

విద్యార్థులకు తమ పాఠశాల వాతావరణం తమకు భద్రత కల్పిస్తుందనే ధీమాను కలిగించాలి. అపరిచితులను పాఠశాలకు దూరంగా ఉంచాలి. ఏ సమయంలోనైనా ఉపాధ్యాయులు స్పందిస్తూ, విద్యార్థులకు భరోసా కల్పించాలి. ఏ పరిస్థితుల్లోనైనా ఉపాధ్యాయులు తమకు సహాయకారిగా ఉంటారనే నమ్మకాన్ని విద్యార్థుల్లో పెంచితే ఇక వారు అభద్రతకు లోను కాక ధైర్యంగా తమ అభ్యాసనాన్ని కొనసాగిస్తుంటారు.

3) విద్యార్థులు – తల్లిదండ్రులకు అవగాహన:

సురక్షిత, భద్రత గల పాఠశాల వాతావరణానికి వీలు కల్పిస్తూ, వాటిని అనుసరించాల్సిన విధానాలతో విద్యార్థులకు– తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలి. అపరిచితులను రానివ్వకపోవడం, పాఠశాల గేట్లు వేయడం, అనవసర వస్తువులను పదార్థాలను పాఠశాలకు తీసుకురానీయకపోవడం, పాఠశాల నియమాలు నిబంధనలను ప్రతినెల మూడో శనివారం నిర్వహించే తల్లిదండ్రులు–టీచర్ల సమావేశంలో స్పష్టం చేయడం, పాఠశాల వ్యవహారాల్లో తల్లిదండ్రులు శ్రద్ధ వహించేలా చేయడం, మొదలగు విషయాల్లో స్పష్టమైన అవగాహన కలిగించాలి.

**4) గృహం – పాఠశాల – సహకారం:**

విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు పాఠశాల విధానాలపై స్పష్టమైన అవగాహన కలిగించి, పాఠశాల వ్యూహాల్లో తల్లిదండ్రుల సహకారం తప్పనిసరిగా తీసుకోవాలి. పాఠశాలలో, తరగతి గదిలో నిర్వహిస్తున్న రోజువారీ కార్యక్రమాల గురించి తల్లిదండ్రులకు విధిగా తెలియజేయాలి. తెలుసుకోవాలనే తపనను వారిలో పెంపొందించాలి. విద్యార్థుల ప్రగతి, పనితీరు పట్ల అభినందనలు తెలియజేస్తూ విద్యార్థుల విద్యాభివృద్ధిలో పాలుపంచుకునేలా తల్లిదండ్రులను ప్రోత్సహించాలి. తల్లిదండ్రుల సహకారాన్ని పొందుతూ, పరస్పర భావ వినిమయానికి సమావేశాల్లో ప్రాధాన్యత ఇవ్వాలి. బడిలో ఏం జరుగుతుందో అది తల్లిదండ్రులకు తెలియజేయాలి. అప్పుడే వారిలో విశ్వసనీయత పెరుగుతుంది.

5) క్రమశిక్షణ – మౌల్య విలువలు:

పాఠశాల సురక్షితం అనటానికి క్రమశిక్షణే ప్రాతిపదిక, చక్కని క్రమశిక్షణ పాఠశాలకు పెట్టనికోటగా ఉంటుంది. పేరు ప్రఖ్యాతులు తెస్తుంది. ఎందుకంటే క్రమశిక్షణ లేని ఏ వ్యవస్థ రాణించదు కాబట్టి.! పాఠశాల చక్కని క్రమశిక్షణ విలువలను పాటించినప్పుడే, విద్యార్థులు సంతోషంగా, సురక్షితంగా ఉంటారు. కనుక అందరూ క్రమశిక్షణ నిబంధనల అమలులో చిత్తశుద్ధి కనపరచాలి. అప్పుడే పిల్లలు ఆయా నిబంధనలకు లోబడుతుంటారు.

**ఉదాహరణకు కొన్ని:–**

పాఠశాల రావడంలో సమయపాలన పాటించడం,
క్రమంగా రోజూ పాఠశాలకు హాజరు కావడం,
శుభ్రమైన ఏకరూప దుస్తులతో రావడం,
ఉపాధ్యాయులు, పెద్దలతో గౌరవంగా, సావధానంగా ప్రవర్తించడం. వారి సూచనలు విధిగా పాటించడం.
పాఠశాలకు హాజరు కాని పక్షంలో సదురు విషయాన్ని వెంటనే తరగతి టీచర్లకు విన్నవించడం.
తరగతి పని, ఇంటి పనిని క్రమంగా చేయడం.
ఎవరికీ, దేనికీ హాని, కీడు తలపెట్టకుండా మంచి భావనలతో మర్యాదగా హుందాగా ప్రవర్తించడం.
పాఠశాలను,తరగతి గదులను పరిశుభ్రంగా, ఆహ్లాదకరంగా ఉంచడం.
చెడుకు, చెడు పదార్థాలకు అతి దూరంగా ఉండడం.
అన్ని విషయాలలో సమయపాలన పాటించడం, ఎలర్ట్‌గా ఉండడం.


ఈలాంటి క్రమశిక్షణగా విలువలను విద్యార్థుల్లో పెంపొందిస్తే వారు అభ్యసనం పట్ల శ్రద్ధను కలిగి ఉంటారు. క్రమశిక్షణ నియమాలు పాటించడంలో పాఠశాల యావత్తు సిబ్బంది ఉమ్మడిగా కృషి చేస్తే విద్యార్థులు క్రమశిక్షణను ఉల్లంఘించరు. కావున క్రమశిక్షణ విషయాల్లో నిరంతరం జాగరుకత అవశ్యం. ఈ విధంగా విద్యార్థుల్లో స్వయం సన్నద్ధత, ప్రేరణ కలిగిస్తే, అది అభ్యసనంపై అత్యంత ప్రభావం చూపుతుంది. పాఠశాలను ఆహ్లాదకరంగా నిర్వహిస్తూ విద్యార్థుల్లో ప్రేరణను కలిగిస్తే పాఠశాల అభ్యసనం చక్కటి ఫలితాలను సాధిస్తుంది. విద్యార్థులంతా ప్రయోజకులవుతూ లక్ష్యం నెరవేరుతుంది.

***డాక్టర్ ప్రభు దయాల్***
***మాజీ సెనేట్ సభ్యుడు – కాకతీయ యూనివర్సిటీ***
***జీవిత సభ్యుడు – ఐఏటిఇ***
***నోడల్ అధికారి – కొత్తగూడెం***

# జీవ వైవిధ్యం కళ చెదురుతోంది

నీరు అడవి, భూమి అనేవి జీవరాశుల ప్రధాన ఆవాసాలు. జీవం పుట్టుక జలం నుంచి ఆవిర్భవిస్తే ఈ సజీవ ప్రపంచాన్ని ప్రధానంగా మొక్కలే నిర్దేశిస్తున్నాయి. సమస్త జీవుల భాగస్వామ్యంతో ప్రకృతి సమతుల్యత సంరక్షించబడితే దాన్నే జీవ వైవిధ్యంగా పేర్కొనవచ్చు. 2021లో "మేము పరిష్కారంలో భాగం" అనే థీమ్ తో జీవ వైవిధ్య దినోత్సవం జరుపుకోబోతున్నాం. సమస్త జీవులకు ఆహారోత్పత్తి చేసే చెట్ల నరికివేత దురదృష్టవశాత్తు పర్యావరణానికి పెనుశాపంగా మారింది. ప్రపంచీకరణ, సరళీకరణల్లో భాగంగా అభివృద్ధి సాకుతో కొందరు స్వార్థపరులు విలాస జీవితం కోసం ప్రకృతి వనరుల విధ్వంసం పెరిగింది. స్వార్థ ప్రయోజనాల కోసం దుండగులు అడవులు నరకడం వల్ల ప్రతీ ఏటా భూమిపై మూడు కోట్ల అరవై లక్షల ఎకరాల మేర అడవులు తరిగి పోతున్నాయి. దీని వల్ల వన్య ప్రాణుల ఆవాసాలకు ముప్పు నెలకొనడం, నేల కోత పెరగటం వంటి సమస్యలతో పాటు, గ్రీన్ హౌస్ వాయువుల విడుదలతో భూతాపం జోరెత్తుతోంది. ప్రపంచ వ్యాప్తంగా విడుదలయ్యే గ్రీన్ హౌస్ వాయువుల్లో 15 శాతం అడవుల నరికివేతన వల్లే చోటుచేసుకుంటున్నాయి.

జీవుల మనుగడకు నీటి వనరులే అత్యావశ్యం. నీటి వనరుల సంరక్షణకు ప్రధాని మోఢీ ప్రారంభించిన 'అటల్ భూజల్ యోజన్' వల్ల మహారాష్ట్ర, హర్యానా, రాజస్థాన్, గుజరాత్, మధ్య ప్రదేశ్, ఉత్తర ప్రదేశ్, కర్నాటక ల్లోని 78 జిల్లాల పరిధిలో వున్న 8,300 గ్రామాల్లో భూగర్భ జలాలను పెంచేందుకు ప్రణాళిక కొనసాగుతోంది. కొల్లేరు పరివాహక ప్రాంతంలో వ్యవసాయం, పరిశ్రమలు విస్తరించడంతో అక్వాకల్చర్ కు ముప్పు ఏర్పడింది. ఎరువులు, క్రిమి సంహారకాలు, పరిశ్రమల నుంచి వెలువడే వ్యర్థాలు, గృహ వ్యర్థాలు చేరి సరస్సులో కాలుష్యం పెరిగింది. ఫలితంగా నీటిలో క్షార స్వభావం పెరిగి, ఆక్సిజన్ పరిమాణం తగ్గుతోంది. సరస్సు ఆక్రమణలకు గురికావడంతోనూ దాదాపు 15 రకాల స్థానిక చేపల రకాలు అంతరించి పోయే ప్రమాదంలో ఉన్నాయి. భూచర జీవుల ఆవాసాలు, వివిధ ఆక్రమణలకు,




కాలుష్యానికి గురికావడంతో జీవుల మధ్య శక్తిని బదిలి చేసే ఆహార గొలుసు సంబంధాలు తెగిపోతున్నాయి. స్థానిక జీవ జాతులు దాదాపుగా అంతరించిపోయె దశలో ఉన్నాయి. అడవులు అంతరిస్తున్న క్రమంలో ప్రధానంగా భూఉపరితలంపై ఆక్సీజన్ శాతం (20.95) తగ్గుముఖం పడుతోంది. క్రమక్రమంగా అటవీ ఉత్పత్తులు తరిగి పోవడంతో పాటు అడవి తల్లి ఒడిలో జీవించే గిరిజనులు సహజ వనరులకు దూరమవుతున్నారు. అభివృద్ధి పేరుతో పరిమితి దాటి ప్రాజెక్టులు నిర్మించడం, ఖనిజాల వెలికితీత వంటి విధ్వంసకర పరిణామాల వల్ల ఎక్కువగా గిరిజన తెగల వారు నిర్వాసితులవుతున్నారు. 1950–2020 మధ్య కాలంలో వివిధ అభివృద్ధి ప్రాజెక్టుల వల్ల దేశ వ్యాప్తంగా సుమారు మూడుకోట్ల మంది ప్రజలు నిర్వాసితులయ్యారు.

జీవ వైవిధ్యానికి ఆదివాసీ ప్రాంతాలే ముఖ్య స్థావరాలు. ప్రకృతి ఒడిలో కొండలు, కోనలు, నదీనదాల మధ్య పూర్తి స్వేచ్ఛ, స్వాతంత్ర్యం అలరారిన గిరిజన తెగలు 'నాగరికత–అభివృద్ధి' ముసుగులో విధ్వంసానికి గురై తరిగిపోతున్న తీరు ఆందోళన కలిగిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా ఇప్పటికే వందలాది గిరిజన తెగలు అంతరిస్తున్నాయి. అడవులు, సముద్ర తీరప్రాంతాలపై ఆదివాసుల సహజ హక్కును గుర్తించి, వారి జీవన విధానాలను పరిరక్షించడంలో ఇప్పటి దాకా జరిగిన పదకొండు అంతర్జాతీయ 'జీవ వైవిధ్య సదస్సులు' ఆచరణలో సాధిం చింది శూన్యమనే చెప్పాలి. 2013 హైదరాబాద్ మహానగరంలో జరిగిన 11వ మహాసభ కూడా ఇదే తీరును ప్రదర్శించింది. ప్రకృతి వనరులు పొంగిపొరలే ఆదివాసీ ప్రాంతాలు పారిశ్రామికీకరణ వల్ల వారి మనుగడకు పెనుముప్పుగా పరిణమిస్తోంది. యురేనియం నిక్షేపాల వెలికితీతతో నల్లమలలో చెంచులను అడవి నుంచి గెంటివేసే ప్రయత్నం జరుగుతున్నది. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 70 దేశాల్లో వివిధ పేర్లతో విస్తరించిన ఐదు వేల తెగలు, మన దేశంలో వున్న 461 గిరిజన తెగల్లో వైవిధ్య జీవనం కనుమరుగవుతున్నది. ప్రభుత్వం పర్యావరణ పరిరక్షణ, వన్య ప్రాణుల సంరక్షణ చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించి కట్టుదిట్టం చేయాలి. పాఠశాల స్థాయి నుంచే జీవ వైవిధ్య ప్రతిజ్ఞను ప్రోత్సహించాలి.

**గుమ్మడి లక్ష్మీనారాయణ**
9491318409



# విశ్వశక్తి వైభవం



శాశ్వతమైన ఉనికి 'సత్'. ఆ ఉనికి స్వభావమైన చైతన్యమే 'చిత్'. ఈ రెండూ ఒకే వస్తువు లక్షణాలు. ఇదే వస్తువును 'పరబ్రహ్మ' అంటుంది వేదం. ఈ బ్రహ్మం ఆనంద స్వరూపంగా ఉంటుంది. అందుకే పరబ్రహ్మను రుషులు 'సచ్చిదానందం'గా భావిస్తారు.

ఈ అనంత విశ్వానికి సచ్చిదానంద తత్వమే కారణం. ఇది విశ్వవ్యాపకమైనది. శక్తి అంటే ఇదే! ఈ సచ్చిదానంద శక్తిని మహర్షులు 'జగదంబ'గా సాక్షాత్కరింపజేసుకున్నారు. విశ్వవ్యాపకమైన, విశ్వాతీతమైన మహాశక్తి ఇది. వేదాల్లో, ఆగమాల్లో (మంత్ర శాస్త్రాలు), పురాణాల్లో ఇది బహురూపాలుగా ప్రతిపాదితమైంది.విశ్వంలో నిండిన శబ్దమయ నాదశక్తి– బ్రాహ్మీ. జగత్ వ్యాపక మహాతరంగాల చైతన్యం– వైష్ణవి. కర్మానుగుణంగా జీవులను నిర్వహించే శాసక శక్తి– మాహేశ్వరి. జ్ఞానస్వరూపం– కౌమారి. అలాగే అన్నశక్తి– వారాహి. బలప్రదాయకమై శిష్టరక్షణ దుష్టశిక్షణ నిర్వర్తించే మహాశక్తి– ఇంద్రాణి. సంసార లంపటత్వాన్ని నిర్మూలించే తత్వరూప మోక్షశక్తిని 'చాముండా'గా ఆరాధిస్తారు. ఇవన్నీ సప్త మాతృకా స్వరూపాలు, విశ్వవ్యాపక మహాచైతన్యానికి సంబంధించిన విభిన్న రూపాలు. వీటన్నింటినీ సనాతన ధర్మం 'ఉపాసనా మూర్తులు'గా ఆవిష్కరించింది. అనంతాకాశంలో సహజమైన నీలిమ, అంధకారం కాళీదేవిగా గోచరిస్తాయి. అంతరిక్షంలోని జ్యోతిఃస్వరూపాల కాంతితత్వమే గౌరీ దేవి (ప్రకాశ స్వరూపిణి). గగనాల్లో భువనాల్లో నిండిన సౌందర్య శోభాశక్తి 'లక్ష్మి'గా వెలుగులీనుతుంది. బుద్ధుల్లో భాసించే విద్యారూపిణి 'సరస్వతి'గా ప్రత్యక్షమవుతుంది. ఆకాశ శక్తిని 'భువనేశ్వరి'గా భావిస్తారు. కాలశక్తిని 'కాళి'గా, మూడు కాలాల ముల్లోకాల వ్యాపక శాసక శక్తిని 'త్రిపుర'గా– మరికొన్ని ఆగమాలు వర్ణించాయి. నిగమ (వేద), ఆగమాల వర్ణనల్ని, దృక్కోణాల్ని సమన్వయపరచింది పురాణం. అది దేవీరూప, మంత్ర, ఆరాధన, లీలా కథల్ని అద్భుతంగా ఆవిష్కరించింది. బహురూపాలుగా ఉన్న ఆ ఏక శక్తిని ఆదిశక్తిగా ఉపాసించే విధానాలున్నాయి. వాటిలో శరన్నవరాత్రులకు అత్యంత ప్రాధాన్యముంది. ఆదిశక్తి పలు రూపాలు. కాలాల పరిణామాల్ని అనుసరించి, సనాతన ధర్మంలో అనేక పండుగలు కనిపిస్తాయి. వీటిలో– ఆయా కాలాల్లో జరిగే ప్రకృతి పరిణామాలు, జ్యోతిర్మండలాల ప్రభావాల మార్పులు ప్రతిఫలిస్తాయి.

క్షేమకారక రక్షణ శక్తిగా విశ్వమాతను ఆరాధించే సందర్భమే– ఆశ్వయుజ నవరాత్రుల మహా పర్వం. పూర్ణత్వానికి సంకేతంగా 'నవ'సంఖ్యతో దేవీపూజల్ని ఆచరించే తొమ్మిదిరోజుల పండుగ ఇది. ఈ పండుగకు జ్యోతిర్విజ్ఞాన, ఉపాసన, ఆధ్యాత్మిక ప్రాధాన్యాలు ఉన్నాయి. వీటికి విభిన్న జీవన రీతుల సంస్కృతీ సంప్రదాయాల శోభలూ జత కలిసి, దేశవ్యాప్త మహాపర్వ ప్రాముఖ్యం సంతరించుకుంది. అంతరంగ, బహిరంగ ప్రతికూల శక్తుల్ని జయించే ఆనందకర దివ్య శక్తుల విజయోత్సాహం ఇది. ఇదే దసరా మహోత్సవాల ప్రధాన లక్షణం, లక్ష్యం. సర్వ దేవతల సమాహార మూర్తిగా, సకల శక్తుల సమన్వయ దీప్తిగా మహాశక్తిని పూజిస్తారు. స్త్రీరూపంగా సంభావించి సమర్చన చేయడం ఒక గణనీయ విశిష్టాంశం.ప్రతి స్త్రీమూర్తినీ పరాశక్తి కళగా గౌరవించాలనే భావం బాల, కుమారి, సువాసినీ పూజల్లో కనిపిస్తుంది. కలశంలో, యంత్రంలో, విగ్రహాల్లో, హోమగుండాల్లో 'లోకాల తల్లి'ని

## రూ.8,000 లోపు ధరకే శాంసంగ్ గెలాక్సీ ఎఫ్05 ఫోన్.. 20 నుంచి సేల్స్

దక్షిణ కొరియా ఎలక్ట్రానిక్స్ జెయింట్ శాంసంగ్ తన శాంసంగ్ గెలాక్సీ ఎఫ్05 ఫోన్‌ను భారత్ మార్కెట్లో మంగళవారం ఆవిష్కరించింది. ఒక్టాకోర్ మీడియాటెక్ హెలియో జీ85 ప్రాసెసర్, 4జీబీ ర్యామ్ తో వస్తోంది. 25 వాట్ల వైర్డ్ ఫాస్ట్ చార్జింగ్ మద్దతుతో 5000 ఎంఏహెచ్ కెపాసిటీ గల బ్యాటరీ కలిగి ఉంటుంది. 50-మెగా పిక్సెల్ డ్యుయల్ రేర్ కెమెరా సెటప్, సెల్ఫీలూ వీడియో కాల్స్ కోసం 8-మెగా పిక్సెల్ సెన్సర్ కెమెరా ఉంటాయి.




శాంసంగ్ గెలాక్సీ ఎం05/ శాంసంగ్ గెలాక్సీ ఏ05 ఫోన్లను రీ బ్యాడ్జ్ చేసి శాంసంగ్ గెలాక్సీ ఎఫ్05 ఫోన్ ఆవిష్కరించినట్లు తెలుస్తోంది. శాంసంగ్ గెలాక్సీ ఎఫ్05 ఫోన్ 4జీబీ ర్యామ్ విత్ 64 జీబీ స్టోరేజీ వేరియంట్ రూ.7,999లకు లభిస్తుంది. ఈ నెల 20 నుంచి ఈ-కామర్స్ ప్లాట్ ఫామ్ ఫ్లిప్ కార్ట్, శాంసంగ్ ఇండియా వెబ్ సైట్, సెలెక్టెడ్ ఆఫ్ లైన్ రిటైల్ స్టోర్లలో లభిస్తుంది. ట్విలైట్ బ్లూ కలర్ ఆప్షన్ లో అందుబాటులో ఉంటుంది స్మార్ట్ ఫోన్.

శాంసంగ్ గెలాక్సీ ఎఫ్05 ఫోన్ 6.7 అంగుళాల హెచ్డీ+ స్క్రీన్ కలిగి ఉంటుంది. 4జీబీ ర్యామ్ విత్ 64 జీబీ స్టోరేజీతో మీడియాటెక్ హెలియో జీ85 ప్రాసెసర్ తో పని చేస్తుంది. వర్చువల్ గా ఫోన్ ర్యామ్ మరో 4జీబీ పెంచుకోవడంతోపాటు మైక్రో ఎస్డీ కార్డు సాయంతో ఒక టిగా బైట్ వరకూ స్టోరేజీ విస్తరించవచ్చు. ఆండ్రాయిడ్ 14 బేస్డ్ వన్ యూఐ 5 ఓఎస్ వర్షన్ పై పని చేస్తుంది. రెండేండ్ల పాటు ఓఎస్ అప్ డేట్స్, నాలుగేండ్ల పాటు సెక్యూరిటీ అప్ డేట్స్ అందిస్తుంది.

# చిరుధాన్యాల రుచుల పంట



ఆరోగ్యకరమైన జీవనానికి తృణధాన్యాలు ముఖ్యమని చాలామంది భావిస్తున్నారు. ఇవి మనకు ఆరోగ్యకరమైన జీవనాన్ని ఇవ్వటంతో పాటుగా తినటానికి రుచికరంగా కూడా ఉంటాయి. అందుకే రాగి, సజ్జ, అవిస... ఇలా రకరకాల తృణధాన్యాల ద్వారా వంటలు చేసుకోవటం కూడా బాగా పెరిగింది. అలాంటి కొన్ని వంటలు తయారీ ఎలాగో చూద్దాం.

**రాగి, అరిటిపండు**

**స్మూతీ**

**కావాల్సిన పదార్థాలు**

రెండు స్పూన్ల రాగి పొడి, ఒకటిన్నర కప్పుల నీళ్లు, బాగా ముగ్గిన ఒక అరటి పండు, గింజలు తీసేసిన మూడు ఖర్జూరాలు, తగినన్ని బాదం పప్పులు, ఒక టేబుల్ స్పూను అవిస గింజలు, అరకప్పు మామూలు పాలు లేదా బాదం పాలు.

తయారీ విధానం

ఒక కప్పులో రాగి పొడిని నీళ్లతో కలపాలి. ఒక గిన్నెలో తగినన్ని నీళు పోసి వేడి చేయాలి. ఈ వేడి నీళ్లలో రాగి మిశ్రమాన్ని కలపాలి. ఇది బాగా ఉడికిన తర్వాత కిందకు దింపి చల్లార్చాలి.

ఒక మిక్సీలో అరటిపండు, ఖర్జూరాలు, అవిస గింజలు, పాలు వేసి బాగా తిప్పాలి. దీనిలో రాగి మిశ్రమాన్ని కలిపి తిప్పాలి.

ఇలా తయారైన స్మూతీపైన బాదం పప్పులు వేయాలి.

**రాగి ఉప్మా**

**కావాల్సిన పదార్థాలు**

ఒక కప్పు రాగి రవ్వ, రెండున్నర కప్పుల నీళ్లు, నాలుగు టీ స్పూన్ల నూనె లేదా నెయ్యి, తగినంత కరివేపాకు, రెండు పచ్చి మిరపకాయలు, అర స్పూను ఆవాలు, అర స్పూను జీలకర్ర, ఒకటిన్నర టేబుల్ స్పూను శనగపప్పు, ఒకటిన్నర టేబుల్ స్పూను మినపప్పు, తగినంత అల్లం, సన్నగా తరిగిన ఉల్లిపాయ (ఒకటి), తగినన్ని వేరుశనగ గుళ్లు.

**తయారీ విధానం**

రాగి రవ్వను బాగా కడగాలి. 30 నిమిషాలు నీళ్లలో నానపెట్టాలి. ఆ తర్వాత నీళ్లు అన్నీ పారబోయాలి.

ఫ ఒక మూకుడులో నూనె లేదా నెయ్యి వేసి వేడి చేయాలి. దానిలో ఆవాలు, జీలకర్ర వేసి వేగించాలి. ఆ తర్వాత శనగపప్పు, మినపప్పు, వేరుశనగ గుళ్లు వేసి వేగించాలి. ఆ తర్వాత ఉల్లిపాయ ముక్కలు, అల్లం ముక్కలు, పచ్చి మిరపకాయ ముక్కలను వేసి వేగించాలి. ఉల్లిపాయ ముక్కలు బంగారపు రంగు వచ్చే దాకా వేగించాలి. ఆ తర్వాత ముందుగా వేగించుకున్న రాగి రవ్వను కలపాలి.

రాగి రవ్వను కలిపిన తర్వాత రెండున్నర కప్పుల నీళ్లను పోసి.. మూకుడుపై మూత పెట్టి ఉడకనివ్వాలి. నీళ్లు అన్నీ ఆవిరి అయ్యేదాకా ఉడకనిచ్చి పొయ్యిపై నుంచి దింపేయాలి. దింపిన తర్వాత అవసరమైతే కొద్దిగా నెయ్యి కలుపుకోవచ్చు.

జొన్న పేలాలు

**కావాల్సిన పదార్థాలు**

ఒక కప్పు జొన్నలు, తగినంత ఉప్పు, కారం, పసుపు, కొద్దిగా నూన.

తయారీ విధానం

జొన్నలను నీళ్లలో కడగాలి. కడిగిన తర్వాత వెంటనే ఒక పొడి గుడ్డలో ఆరబెట్టాలి. నీళ్లు పూర్తిగా పోయేవరకు ఆరబెట్టాలి.

చిన్న ప్రెషర్ కుక్కర్‌ను తీసుకొని వాటిలో ఈ జొన్నలను వేసి ఒక విజిల్ వచ్చేదాకా వదిలేయాలి. ఈ లోపులోనే మనకు జొన్నలు పేలుతున్న శబ్దాలు వినిపిస్తాయి. జొన్నలు

పేలాలుగా మారతాయి.

పేలాలుగా మారిన జొన్నలను ఒక ప్లేటులో చల్లబరచాలి.

ఒక మూకుడులో కొద్దిగా నూనె వేసి దానిలో పసుపు వేసి, జొన్న పేలాలను వేగించాలి. ఆ తర్వాత తగినంత ఉప్పు కలపాలి.

**కొర్రల సలాడ్**

**కావాల్సిన పదార్థాలు**

అర కప్పు ఉడకపెట్టిన కొర్రలు, పావు కప్పు ఉడకపెట్టిన శనగలు, సగం కీరా దోసకాయ ముక్కలు, సగం క్యారెట్ ముక్కలు, చిన్న క్యాప్సికం ముక్కలు, తగినంత కొత్తిమీర, ఒక టేబుల్ స్పూను ఆలివ్ నూనె లేదా వేరుశనగ నూనె, వెల్లుల్లి (రెండు రెబ్బలు), ఒక టేబుల్ స్పూను నిమ్మ రసం, ఉప్పు తగినంత, మిరియాల పొడి తగినంత, నచ్చిన డ్రైఫ్రూట్స్ తగినన్ని.

**తయారీ విధానం**

ఒక గిన్నెలో నూనె వేయాలి. దానిలో వెల్లుల్లి రెబ్బలు, మిరియాల పొడి, నిమ్మ రసం, ఉప్పు వేసి బాగా కలపాలి.

దానిలో ఉడకపెట్టిన కొర్రలు, ఉడకపెట్టిన శనగలు, కీరా దోసకాయ ముక్కలు, క్యారెట్ ముక్కలు, క్యాప్సికం ముక్కలు, కొత్తిమీర వేసి కలపాలి.

ఆ తర్వాత నచ్చిన డ్రైఫ్రూట్స్‌ను వేయాలి.

### 'రొమ్ము క్యాన్సర్'ను ప్రాథమిక దశలోనే గుర్తిస్తూ..

# వేల మరణాలను ఆపుతున్న అంధులు

**కళ్లు లేవని వాళ్లు కలత చెందలేదు! తమకున్న అసాధారణ సర్శ జ్ఞానంతో.. అద్భుతాలు చేస్తున్నారు. 'రొమ్ము క్యాన్సర్'ను ప్రాథమిక దశలోనే గుర్తిస్తూ.. వేల మరణాలను ఆపుతున్నారు. ప్రాణాంతక వ్యాధిని పసిగట్టడంలో.. అంధ మహిళలు ప్రధానపాత్ర పోషిస్తున్నారు.**



మనదేశంలో ఏటా సుమారు 75,000 మంది రొమ్ము క్యాన్సర్‌తో మరణిస్తున్నారు. ఇందుకు కారణాలు అనేకం.. భారతీయ మహిళల్లో రొమ్ము క్యాన్సర్‌పై సరైన అవగాహన లేకపోవడం ఒక కారణమైతే.. ఈ వ్యాధిని గుర్తించే 'మమోగ్రఫీ పరీక్ష' చేయడానికి కావాల్సిన పరికరాల కొరత ఇంకోటి! ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో ఈ సమస్య మరీ ఎక్కువ! ఫలితంగా.. రొమ్ము క్యాన్సర్‌ను మూడు లేదా నాలుగో దశలోనే గుర్తిస్తున్నారు. దాంతో సరైన చికిత్స అందకపోవడంతో వేలమంది మరణిస్తున్నారు. ఈ సమస్యకు అంధ మహిళలు అద్భుతమైన పరిష్కారం చూపుతున్నారు.

**ఆ చేతుల్లోనే అంతా!**

'రొమ్ము క్యాన్సర్ కణితిని ఎంత త్వరగా గుర్తిస్తే.. అంతమంచి చికిత్స అందించవచ్చు!'.. జర్మనీకి చెందిన గైనకాలజిస్ట్ డాక్టర్.ఫ్రాంక్ హాఫ్‌మన్ చెప్పేమాట. ఆయన ఆలోచనల్లోంచి పురుడుపోసుకున్నదే.. 'డిస్కవరింగ్ హ్యాండ్స్'. ఎలాంటి లాభాపేక్ష లేని ఈ సంస్థ.. జర్మనీతోపాటు ప్రపంచవ్యాప్తంగా పెరిగిపోతున్న రొమ్ము క్యాన్సర్ కేసులను ప్రాథమిక దశలోనే గుర్తించడంలో సాయపడుతున్నది. ఇందుకోసం వైద్యులకు సహాయక సిబ్బందిగా అంధ మహిళలకు ప్రత్యేక్ష శిక్షణ ఇప్పిస్తున్నది. వారే ఎందుకంటే.. సాధారణ వ్యక్తులతో పోలిస్తే దృష్టిలోపం ఉన్నవారిలో 'స్పర్శ జ్ఞానం' ఎక్కువ. అంతేకాకుండా.. వారి విద్యాభ్యాసం అంతా 'బ్రెయిలీ'లోనే సాగుతుంది.

ఈ చుక్కల లిపిని చేతులతో తడుముతూ.. పదాలను గుర్తించగలుగుతారు. అలా వారిలో 'స్పర్శ జ్ఞానం' ఎక్కువగా అభివృద్ధి చెంది ఉంటుంది. ఈ అనుభవాన్నే రొమ్ము క్యాన్సర్‌ను గుర్తించడానికి వాడుతున్నారు. తమ చేతి స్పర్శ ద్వారా.. ప్రారంభ దశలలో ఉన్న సూక్ష్మ కణతులను కూడా వీరు స్పష్టంగా గుర్తిస్తున్నారు. వైద్యులు 1 నుంచి 2 సెం.మీ. గడ్డలను కనుగొంటే.. దృష్టిలోపం ఉన్న మహిళలు 0.5 సెం.మీ. కణతులనూ గుర్తించగలుగుతున్నారు.

వందలమందికి శిక్షణ..

'డిస్కవరింగ్ హ్యాండ్స్' సంస్థ ద్వారా భారతదేశంలోని పలు నగరాల్లో 'రొమ్ము క్యాన్సర్'ను గుర్తించడంపై అంధ మహిళలకు శిక్షణ ఇస్తున్నారు. తొమ్మిది నెలల శిక్షణలో.. ఆరు నెలలు స్టడీకోర్స్‌తోపాటు మూడు నెలలు ఇంటర్న్‌షిప్ అందిస్తున్నారు. ఇందులో భాగంగా.. వీరు మహిళల శరీరం గురించి ముఖ్యంగా రొమ్ము అనాటమీపై ప్రత్యేక శిక్షణ తీసుకుంటారు. ట్రైనింగ్ తర్వాత ప్రముఖ ఆసుపత్రుల్లో వైద్యులకు సహాయకులుగా, లేదా ఫ్రీలాన్స్ మెడికల్ టాక్టయిల్ ఎగ్జామినర్‌గా పనిచేస్తున్నారు. వీరు చర్మానికి అనుకూలమైన టేప్‌ను ఉపయోగిస్తూ.. రోగి ప్రతి రొమ్మునూ నాలుగు జోన్లుగా విభజిస్తారు.

చేతివేళ్లతో సున్నితంగా పరిశీలించడం, వివిధ రకాల పద్ధతులను ఉపయోగించి రొమ్ములో ప్రతి అంగుళాన్నీ నిశితంగా పరిశీలిస్తారు. అక్కడి కణజాలాల్లో జరుగుతున్న మార్పులను వైద్యులకన్నా 30% మెరుగ్గా గుర్తిస్తున్నారు. కేవలం 35 నుంచి 40 నిమిషాల్లోనే రోగిని పరీక్షించి.. రొమ్ము క్యాన్సర్ కణతులను కనిపెడతారు. 2023 రికార్డుల ప్రకారం.. భారత్‌లో నిర్వహించిన 'డిస్కవరీ హ్యాండ్స్' ప్రోగ్రాం ద్వారా 1,338 మంది మహిళల్లో ఈ ప్రాణాంతక క్యాన్సర్‌ను ప్రాథమిక దశలోనే కనుగొన్నారు.

# స్ట్రాబెర్రీ గర్ల్‌గా మారుమోగుతున్న గుర్లీన్ చావ్లా





2021 సంవత్సరపు మొదటి 'మన్ కీ బాత్'లో నరేంద్ర మోడీ గుర్లీన్ చావ్లాను ప్రస్తావించారు. 'ఆమె బుందేల్‌ఖండ్ ఆశాజ్యోతి' అన్నారు. ఉత్తరప్రదేశ్‌లోని బుందేల్‌ఖండ్‌లో వ్యవసాయం దుర్భరంగా ఉంది. ఉష్ణోగ్రత ఎక్కువ. వానలు, నీటివసతి తక్కువ. అలాంటి చోట సంప్రదాయ పంటలే కష్టం. కాని లా చదువుతున్న 23 ఏళ్ల గుర్లిన్ లాక్‌డౌన్‌లో తన ఊరు ఝాన్సీ వచ్చి ఊరికే ఉండకుండా తండ్రి పొలంలో స్ట్రాబెర్రీ వేసింది. విజయవంతంగా పండించింది. 'స్ట్రాబెర్రీ గర్ల్'గా ఇవాళ ఆమె పేరు ఉత్తరప్రదేశ్‌లో మారుమోగుతోంది.

లాక్‌డౌన్ ఎవరికి ఏం హాని చేసినా బుందేల్‌ఖండ్‌కి ఒక మేలు చేసింది. ఒక లా చదివే అమ్మాయి- గుర్లిన్ చావ్లా అక్కడ స్ట్రాబెర్రీ పంటను పండించి ఆదాయం గడించవచ్చని రైతులకు అర్థమయ్యేలా చేసింది. నిజంగా ఇది అనూహ్యమైన విషయమే. ఎందుకంటే స్ట్రాబెర్రీ 35 డిగ్రీల సెల్సియస్ కంటే ఎక్కువ ఎండలు కాసే చోట పండదు. నీటి వసతి కూడా ఉండాలి. బుందేల్‌ఖండ్‌లో ఉష్ణోగ్రత ఎక్కువే అయినా నీరు తక్కువే అయినా సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించుకుని గుర్లిన్ ఈ ఘనత సాధించింది. అందుకే ఇప్పుడు ఆమె అక్కడ 'స్ట్రాబెర్రీ గర్ల్'గా ఖ్యాతి పొందింది.

ఇంటి పంటతో మొదలు

గుర్లిన్ చావ్లాది బుందేల్‌ఖండ్ (ఉత్తరప్రదేశ్ దక్షిణాది ప్రాంతం)లో ఝాన్సీ. పూనెలో లా చదువుతోంది. లాక్‌డౌన్‌లో కాలేజీ మూతపడటంతో ఇంటికి చేరుకుంది. ఇంట్లో తండ్రి టెర్రస్ మీద ఆర్గానిక్ పద్ధతిలో కూరగాయలు పండించడం గమనించి ఎలాగూ ఖాళీగా ఉంది కనుక తోటపనిలో పడింది. రసాయనాలు లేని తాజా కూరగాయలు ఇంట్లోనే దొరుకుతున్నాయి అని అర్థం చేసుకుంది. 'ఇలాంటి ఆరోగ్యకరమైన కూరగాయలు ఝాన్సీలో ప్రతి ఒక్కరూ తినే వీలు కల్పించాలి కదా' అని తండ్రితో అంది. తండ్రి 'అదంత సులభం కాదు తల్లీ' అని గుర్లిన్‌తో అనేవాడు.

స్ట్రాబెర్రీలను కోస్తున్న గుర్లీన్ చావ్లా

**మార్చిన స్ట్రాబెర్రీ**

ఒకరోజు గుర్లిన్ 20 స్ట్రాబెర్రీ మొలకలను తెచ్చి తన ఇంటి డాబా మీద ఉన్న తోటలో నాటింది. కోకోపీట్ ఉన్న మట్టికుండీలలో వాటిని వేసింది. 'ఇవి బతకవు' అని అందరూ అన్నారు. 'కాని ఆ మొక్కలు బతికాయి. ఇంకా ఆశ్చర్యంగా కాయలు కూడా కాశాయి. అవి సైజులు చిన్నగా, జ్యూస్ తక్కువగా ఉన్నా రుచిగా ఉన్నాయి. అరె... వీటిని పొలంలో ఎందుకు పండించకూడదు అనుకుంది గుర్లిన్. తండ్రితో పోరు పెట్టడం మొదలెట్టింది. తండ్రికి ఝాన్సీ దాపునే నాలుగున్నర ఎకరాల పొలం ఉంది. అందులో సేద్యం ఏమీ చేయడం లేదు. ఝాన్సీ ఉత్సాహం చూసి 'కావాలంటే అందులో ట్రై చెయ్' అన్నాడు తండ్రి. లాక్‌డౌన్ సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలనుకుంది గుర్లిన్. 2020 అక్టోబర్‌లో సేంద్రియ పద్ధతి ద్వారా ఒకటిన్నర ఎకరాలో స్ట్రాబెర్రీ పంట వేసింది. ఈ విషయం రైతులకు వింత వార్త అయ్యింది. కాని గుర్లిన్‌కు తెలుసు.. తాను ఎలాగైనా విజయం సాధిస్తానని.

**పది వేల కిలోల దిగుబడి..**

జనవరి నెల వచ్చేనాటికి స్ట్రాబెర్రీని పండించడంలో మెళకువలన్నీ తెలుసుకుంది గుర్లిన్. 'ఈ సీజన్‌లో పది వేల కిలోల దిగుబడిని ఆశిస్తున్నాను. ఇప్పుడు రోజూ కాయను కోసి మార్కెట్‌లో కిలో 250 రూపాయలకు అమ్ముతున్నాను' అని చెప్పిందామె. ఆమె పొలంలో స్ట్రాబెర్రీ కాయ పెద్దదిగా కాయడమే కాదు రంగులో, జ్యూస్‌లో మరింత ఫలవంతంగా ఉంది. 'రైతులు ఒక పంట ఒకే పద్ధతిలో పోకుండా భిన్నంగా ఆలోచిస్తే ఇలాంటి విజయాలు సాధించవచ్చు' అని కూడా గుర్లిన్ అంది. అంతే కాదు ఒకవైపు స్ట్రాబెర్రీ వేసి మరోవైపు మిగిలిన మూడు ఎకరాల్లో ఆమె సేంద్రియ పద్ధతిలో బెంగళూరు మిర్చి, టొమాటో, కాలిఫ్లవర్ పండిస్తోంది. 'చదువుకున్న యువత కూడా సేద్యం చేయడానికి ఆసక్తిగా ఉంది. కాకపోతే ప్రభుత్వం నుంచి వారికి సపోర్ట్ కావాలి' అని గుర్లిన్ అంది.

**స్ట్రాబెర్రీ అంబాసిడర్**

జనవరి 16 నుంచి ఝాన్సీలో 'స్ట్రాబెర్రీ ఫెస్టివల్' జరుగుతోంది. ప్రభుత్వమే దానిని నిర్వహిస్తోంది. బుందేల్‌ఖండ్ ప్రాంతంలో స్ట్రాబెర్రీని ప్రోత్సహించడానికి చేస్తున్న ఈ ఉత్సవానికి ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యానాథ్ గుర్లిన్‌ను 'స్ట్రాబెర్రీ అంబాసిడర్'గా ప్రకటించారు. అంతే కాదు ప్రధాని మోడి తన మన్ కీ బాత్‌లో గుర్లిన్‌ను ప్రస్తావించారు. దాంతో గుర్లిన్‌పై ప్రశంసలు కురుస్తున్నాయి. భవిష్యత్తులో ఈమె కథా ఒక బయోపిక్ అయినా ఆశ్చర్యపోవాల్సింది లేదు.

## దిగుమతి సుంకం ఆసరాగా వంట నూనెల ధరలు పెంచొద్దు.. కేంద్రం హితవు

**న్యూఢిల్లీ–నవభూమి:** వంట నూనెల దిగుమతిపై సుంకం పెంచడాన్ని ఆసరాగా చేసుకుని వంట నూనెల ధరలు పెంచొద్దని వంట నూనెల తయారీ సంస్థలకు కేంద్రం సూచించింది. సుంకం పెంచడం వల్ల దిగుమతి తగ్గి దేశీయ మార్కెట్లో వంట నూనెల ధరలు పెరిగే అవకాశం ఉందని నిపుణులు అంటున్నారు. ఇప్పటికే తక్కువ సుంకంతో దిగుమతి చేసుకున్న వంట నూనెల నిల్వలు అవసరాలకు సరిపడా



ఉన్నాయని కేంద్రం వివరించింది. ప్రస్తుతం అందుబాటులో ఉన్న 30 లక్షల టన్నుల స్టాక్ దాదాపు రెండు నెలల అవసరాలకు సరిపోతాయని, ధరలు పెంచొద్దని కేంద్ర ఆహార మంత్రిత్వశాఖ వ్యాఖ్యానించింది. చౌక దిగుమతులతో దేశీయంగా నూనె గింజల ధరలు పడిపోతున్నాయి. దీంతో దేశీయ రైతులకు లబ్ధి చేకూర్చడానికే ఇటీవల కేంద్రం వంటనూనెల దిగుమతిపై సుంకం పెంచేసింది. ఎటువంటి సుంకం లేని ముడి పామాయిల్, సోయాబీన్, సన్ ఫ్లవర్ ఆయిల్ మీద20 శాతం, రిఫైన్డ్ పాయిమాయిల్, సోయాబీన్, సన్‌ఫ్లవర్ నూనెపై 12.5 శాతం నుంచి 32.5 శాతానికి పెంచింది. దీనికి అదనంగా వ్యవసాయ సెస్ వడ్డిస్తుంది.




## మదుపరుల అప్రమత్తత.. గరిష్ఠాలకు పెరిగి.. నష్టాల్లోకి జారుకున్న స్టాక్ మార్కెట్లు



**న్యూఢిల్లీ– నవభూమి:** దేశీయ ఈక్విటీ మార్కెట్లు స్వల్ప నష్టాల్లో ముగిశాయి. యూఎస్ ఫెడ్ రిజర్వ్ సమావేశం నేపథ్యంలో మదుపరులు అప్రమత్తంగా వ్యవహరించారు. కీలమైన వడ్డీ రేట్లను తగ్గించనున్న నేపథ్యంలో మదుపరులు అప్రమత్తత పాటించడంతో ఉదయం మార్కెట్లు నష్టాల్లోకి జారుకున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లలోని ప్రతికూల ప్రభావంతో సూచీలు ఉదయం ఫ్లాట్‌గా ముగిశాయి. ఆ తర్వాత పెట్టబడులు పెరిగాయి. దీంతో మార్కెట్లు లాభాల్లోకి దూసుకెళ్లాయి. ఈ క్రమంలో మార్కెట్లు సరికొత్త గరిష్ఠాలను నమోదు చేశాయి. సెన్సెక్స్ తొలిసారిగా 83,326.38 పాయింట్ల గరిష్ఠాన్ని తాకింది. ఈ స్థాయికి సెన్సెక్స్ చేరడం ఇదే తొలిసారి. ఆ తర్వాత ఐటీ, ఎనర్జీ రంగాల్లో స్టాక్స్ అమ్మకాలతో మార్కెట్లు ఒక్కసారిగా ఒత్తిడికి గురైన నష్టాల్లోకి వెళ్లాయి. సెన్సెక్స్ ఉదయం 83,037.13 పాయింట్ల వద్ద ప్రారంభమైంది.

ఇంట్రాడేలో 82,700.63 పాయింట్ల కనిష్ఠానికి చేరింది. చివరకు 131.43 పాయింట్ల నష్టంతో 82,948.23 వద్ద ముగిసింది. 41 పాయింట్ల నష్టంతో 25,377.55 వద్ద స్థిరపడింది. నిఫ్టీ ఇంట్రాడేలో 25,482.20 పాయింట్ల రికార్డు స్థాయి హైకి చేరింది. ట్రేడింగ్‌లో 1,453 షేర్లు పెరగ్గా.. మరో 2,343 షేర్లు పతనమయ్యాయి. నిఫ్టీ అత్యధికంగా నష్టపోయిన వాటిలో టీసీఎస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా, విప్రో ఉన్నాయి. బజాజ్ ఫైనాన్స్, శ్రీరామ్ ఫైనాన్స్, బజాజ్ ఫిన్‌సర్వ్, ఐసీఐసీఐ బ్యాంక్, నెస్లే ఇండియా లాభపడ్డాయి. బ్యాంక్ మినహా, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ 3 శాతానికిపైగా నష్టపోవడంతో అన్ని రంగాల సూచీలు నష్టాల్లో ముగిశాయి. ఆటో, ఫార్మా, మెటల్, ఆయిల్, గ్యాస్ 0.5 నుంచి ఒకశాతం వరకు తగ్గాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.7 శాతం, స్మాల్ క్యాప్ ఇండెక్స్ 0.5 శాతం తగ్గాయి.

## అక్టోబర్‌లో బ్యాంకులకు 12 రోజులు మూసివేత..! హాలీడేస్ ఆర్‌బీఐ ఫుల్ లిస్ట్ ఇదే..!




**న్యూఢిల్లీ– నవభూమి:** రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అక్టోబర్ మాసానికి సంబంధించిన సెలవుల జాబితాను విడుదల చేసింది. దాదాపు 12 రోజులపాటు బ్యాంకులు మూతపడనున్నాయి. బ్యాంకుల్లో ఏవైనా పనులు ఉంటే ముందస్తుగా చేసుకోవడం మంచిది. లేకపోతే ఇబ్బందులుపడే ఛాన్స్ ఉంటుంది. అక్టోబర్‌లో గాంధీ జయంతి, బతుకమ్మ పండుగ, దసరా శరన్నవరాత్రులు, కర్వాచౌత్, ధన్‌తేరాస్, దీపావళి పండుగల సందర్భంగా సెలవులు రానున్నాయి. పండుగలు, ప్రత్యేక రోజులు, శనివారాలు.. ఆదివారాల్లో కలిపి 12 రోజులు బ్యాంకులకు సెలవులు పడనున్నాయి. అయితే, రాష్ట్రాల వారీగా సెలవుల్లో మార్పులు ఉంటాయి. ఆయా రాష్ట్రాల్లో పండుగలకు సెలవులు ఉంటాయి. అలాగే, రెండు, నాల్గో శనివారాలతో పాటు ఆదివారాలు దేశవ్యాప్తంగా బ్యాంకులు మూతపడే విషయం తెలిసిందే. అయితే, ఇంతకీ బ్యాంకులకు ఎప్పుడెప్పుడు సెలవులు వచ్చాయో ఓ లుక్కేద్దాం రండి..!

**సెలవులు జాబితా**

అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా బ్యాకులకు సెలవు.
అక్టోబర్ 3న నవరాత్రి వేడుకలు ప్రారంభం. మహారాజా అగ్రసేన్ జయంతి సందర్భంగా బ్యాంకులకు సెలవు.
అక్టోబర్ 6న ఆదివారం బ్యాంకుల మూసివేత.
అక్టోబర్ 10 మహా సప్తమి సందర్భంగా బ్యాంకులకు హాలీడే.
అక్టోబర్ 11న మహానవమి సందర్భంగా మూసివేత.
అక్టోబర్ 12న దసరా, రెండో శనివారం సందర్భంగా బ్యాంకుల మూసివేత.
అక్టోబర్ 13న ఆదివారం కావడంతో సెలవు.
అక్టోబర్ 17న కటి బిహు (అసోం), వాల్మీకి జయంతి కారణంగా బ్యాంకులకు హాలీడే.
అక్టోబర్ 20న ఆదివారం సెలవు.
అక్టోబర్ 26న విలీన దినోత్సవం సందర్భంగా జమ్మూ కశ్మీర్‌లో, నాల్గో శనివారం కారణంగా హాలీడే.
అక్టోబర్ 27న ఆదివారం సెలవు.
అక్టోబర్ 31న దీపావళి, సర్దార్ వల్లభాయ్ పటేల్ సందర్భంగా సెలవు.

## నాలుగు నెలల కనిష్ఠానికి టోకు ధరల సూచీ

**న్యూఢిల్లీ– నవభూమి:** టోకు ధరల సూచీ శాంతించింది. వరుసగా



రెండో నెల ఆగస్టులోనూ టోకు ధరల సూచీ నాలుగు నెలల కనిష్ఠ స్థాయి 1.31 శాతానికి పడిపోయింది. కూరగాయలు, ఆహార, చమురు ధరలు తగ్గుముఖం పట్టడం వల్లనే ధరల సూచీ తగ్గిందని కేంద్ర ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది.

%జూలై నెలలో 2.04 శాతంగా ఉన్న ధరల సూచీ..ఏడాది క్రితం మైనస్ 0.46 శాతంగా ఉన్నది. ఆహారపదార్థాల ధరల సూచీ 3.11 శాతంగా ఉన్నది.

# దేశ ఎగుమతి అధోగతి



**న్యూఢిల్లీ–నవభూమి:** దేశీయ ఎగుమతులు దారుణంగా పడిపోయాయి. గత నెలలో ఏకంగా 9.3 శాతం క్షీణించాయి. గడిచిన 13 నెలల్లో ఈ స్థాయిలో పతనం కావడం ఇదే తొలిసారి. ఆగస్టులో ఆయా దేశాలకు భారత్ నుంచి జరిగిన ఎగుమతుల విలువ 34.71 బిలియన్ డాలర్లకే పరిమితమైంది. మరోవైపు వివిధ దేశాల నుంచి భారత్‌కు వచ్చిన దిగుమతుల విలువ 3.3 శాతం పెరిగి 64.36 బిలియన్ డాలర్లకు ఎగిసింది. ఇది రికార్డుస్థాయి కావడం గమనార్హం. దీంతోనే వాణిజ్య లోటు సైతం 10 నెలల గరిష్ఠాన్ని తాకుతూ 29.65 బిలియన్ డాలర్లను తాకింది. ఈ మేరకు మంగళవారం విడుదలైన కేంద్ర ప్రభుత్వ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.ఆగస్టులో దేశంలోకి పసిడి, వెండి దిగుమతులు పెద్ద ఎత్తున జరిగాయి. వీటిలో బంగారం విలువ 10.06 బిలియన్ డాలర్లుగా నమోదైంది. గత ఏడాది ఇదే నెలలో 4.93 బిలియన్ డాలర్లుగానే ఉన్నది. అలాగే వెండి దిగుమతులు 727 మిలియన్ డాలర్లకు ఎగిశాయి. నిరుడు 159 మిలియన్ డాలర్లే. దీంతో దేశీయ దిగుమతులు మొత్తంగా పెరగడానికీ ఇవి దోహదం చేశాయి. నిజానికి దేశీయ దిగుమతుల్లో క్రూడాయిల్ వాటానే ఎక్కువ. దేశ ఇంధన అవసరాల్లో 80 శాతం దిగుమతుల ద్వారానే తీరుతున్నాయి. కానీ పెట్రోలియం ధరలు తక్కువగా ఉండటంతో ముడి చమురు దిగుమతులు ఈ ఆగస్టులో 11 బిలియన్ డాలర్లుగానే ఉన్నాయి.క్రిందటి ఏడాది ఆగస్టుతో చూస్తే ఇది 32.38 తక్కువ. కానీ ఇదే స్థాయిలో బంగారం, వెండి దిగుమతులుండటం.. ఈసారి వాణిజ్య లోటును ఎగదోసింది. అయితే కస్టమ్స్ సుంకాల కోత, పండుగ సీజన్ డిమాండ్ వల్లే ఈ స్థాయిలో గోల్డ్, సిల్వర్ ఇంపోర్ట్స్ జరిగాయని కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ అంటున్నది. కస్టమ్స్ సుంకాల తగ్గింపు.. స్మగ్లింగ్, ఇతర చట్టవ్యతిరేక కార్యకలాపాలను తగ్గుముఖం పట్టేలా చేసిందని వాణిజ్య కార్యదర్శి సునీల్ భరత్‌వాల్ చెప్తున్నారు. ఈ ఏడాది జూలైలో ప్రకటించిన కేంద్ర బడ్జెట్‌లో సుంకాన్ని 15 శాతం నుంచి 6 శాతానికి దించిన సంగతి విదితమే.

**చైనాతో చెట్టాపట్టాల్**

సరిహద్దుల్లో కుస్తీ.. వాణిజ్యంలో దోస్తీ అన్నట్టుగా చైనాతో కేంద్ర ప్రభుత్వం వైఖరి సాగుతున్నది. గత నెల చైనాకు భారత్ నుంచి ఎగుమతులు 22.44 శాతం పతనమై 1 బిలియన్ డాలర్లకు పరిమితమైతే.. చైనా నుంచి భారత్‌కు దిగుమతులు 15.55 శాతం పెరిగి 10.8 బిలియన్ డాలర్లకు చేరాయి. ఈ ఏడాది ఏప్రిల్–ఆగస్టు మధ్య చైనాకు భారతీయ ఎగుమతులు గతంతో చూస్తే 8.3 శాతం దిగజారి 5.8 బిలియన్ డాలర్లుగానే ఉన్నాయి. కానీ చైనా నుంచి భారత్‌కు దిగుమతులు 10.96 శాతం ఎగబాకి 46.65 బిలియన్ డాలర్లను తాకాయి. దీంతో ఇరు దేశాల మధ్య వాణిజ్య లోటు 35.85 బిలియన్ డాలర్లుగా ఉన్నది.2013–14 నుంచి 2017–18 వరకు అలాగే 2020–21లో భారత్‌కు చైనానే అతిపెద్ద వాణిజ్య భాగస్వామి. ఇక అమెరికా, యూఏఈ, సింగపూర్, బంగ్లాదేశ్, ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, ఫ్రాన్స్, నేపాల్, బెల్జియం, టర్కీ దేశాలకూ భారత్ నుంచి ఎగుమతులు గత నెల పడిపోయాయి. ఇదే సమయంలో యూఏఈ, స్విట్జర్లాండ్, కొరియా, జపాన్, థాయిలాండ్, వియత్నాం, తైవాన్ దేశాల నుంచి భారత్‌కు దిగుమతులు పెరిగాయి. మొత్తానికి అంతర్జాతీయ ఆర్థిక మందగమనం, ఎర్ర సముద్రం సంక్షోభం.. భారతీ ఎగుమతుల్ని దెబ్బతీశాయని కేంద్రం తాజా పరిస్థితులను వెనకేసుకొస్తున్నప్పటికీ, ఇతర దేశాల నుంచి భారత్‌కు దిగుమతులు పెరగడం.. దేశీయ తయారీ రంగాన్ని వెక్కిరిస్తోందని పలువురు ఆర్థిక నిపుణులు ఒకింత అసహనం వ్యక్తం చేస్తున్నారు.

గత ఆర్థిక సంవత్సరం (2023–24) దేశంలోకి బంగారం దిగుమతులు 30 శాతం పెరిగి 45.54 బిలియన్ డాలర్లకు చేరాయి.

ఈ ఆర్థిక సంవత్సరం (2024–25) ఏప్రిల్–ఆగస్టులోనే 22.70 బిలియన్ డాలర్లకు చేరిక. దేశంలోకి జరుగుతున్న పసిడి దిగుమతుల్లో దాదాపు 40 శాతం స్విట్జర్లాండ్ నుంచే. తర్వాతి స్థానాల్లో యూఏఈ (16 శాతానికిపైగా), దక్షిణాఫ్రికా ( 10 శాతం).

భారతీయ దిగుమతుల్లో బంగారం వాటానే 5 శాతానికిపైగా ఉన్నది.

ప్రపంచవ్యాప్తంగా బంగారం వినియోగంలో చైనా తర్వాత భారత్‌దే రెండో స్థానం. ఆభరణాల పరిశ్రమ నుంచి పెద్ద ఎత్తున ఆదరణ కనిపిస్తున్నది.

# కదం తొక్కుతున్న మార్కెట్లు




**న్యూఢిల్లీ– నవభూమి:** దేశీయ స్టాక్ మార్కెట్లు కదంతొక్కాయి. రికార్డుల మీద రికార్డులు బద్దలు కొడుతున్న సెన్సెక్స్ మంగళవారం 83 వేల మైలురాయిని అధిగమించింది. మార్కెట్ చరిత్రలో ఇంతటిస్థాయికి చేరుకోవడం ఇదేతొలిసారి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల పవనాలకు తోడు వడ్డీరేట్ల తగ్గింపునకు అమెరికా ఫెడరల్ మొగ్గుచూపే అవకాశం ఉన్నట్లు వచ్చిన సంకేతాలు మదుపరులను కొనుగోళ్ల వైపు నడిపించాయి. నష్టాల్లో ప్రారంభమైన సూచీలకు గ్లోబల్ మార్కెట్లు భారీగా లాభపడటంతో దేశీయ సూచీలు ఎగిశాయి. ఇంట్రాడేలో 160 పాయింట్లకు పైగా లాభపడి 83,152.41 పాయింట్ల గరిష్ఠ స్థాయిని తాకిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు 90.88 పాయింట్లు అందుకొని చారిత్రక గరిష్ఠ స్థాయి 83,079.66 వద్ద ముగిసింది. మరో సూచీ నిఫ్టీ సైతం లైఫ్‌టైం హై 25,400 పాయింట్ల పైన ముగిసింది. చివరకు 34.80 పాయింట్లు ఎగబాకి 25,418.55 వద్ద స్థిరపడింది. స్టాక్ మార్కెట్లు పాజిటివ్‌లోనే కదలాడుతున్నాయని, ఫెడ్ వడ్డీరేట్లను పావుశాతం తగ్గించే అవకాశాలుండటం సూచీల్లో జోష్ పెంచిందని జియోజిట్ ఫైనాన్షియల్ సర్వీసెస్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు. అలాగే కూరగాయల ధరలు శాంతించడంతో ఆగస్టు నెలకుగాను టోకు ధరల సూచీ ఆధారిత ద్రవ్యోల్బణం నాలుగు నెలల కనిష్ఠ స్థాయికి పడిపోవడం కూడా కలిసొచ్చిందన్నారు.భారతీ ఎయిర్‌టెల్, ఎన్‌టీపీసీ, మహీంద్రా షేర్లు లాభపడ్డాయి.

అలాగే టైటాన్, ఎల్‌అండ్‌టీ, కొటక్ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, బజాజ్‌ఫైనాన్స్, హెచ్‌యూఎల్, టెక్ మహీంద్రా, సన్‌ఫార్మా, ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీ, అల్ట్రాటెక్ సిమెంట్, రిలయన్స్ షేర్లు బలపడ్డాయి.

టాటా మోటార్స్ షేరు 1.33 శాతం పతనం చెంది టాప్ లూజర్‌గా నిలిచింది.

దీంతోపాటు అదానీపోర్ట్స్, ఐటీసీ, టాటా స్టీల్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, పవర్‌గ్రిడ్, మారుతి, ఎస్బీఐ, టీసీఎస్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, నెస్లె, యాక్సిస్ బ్యాంకులు నష్టపోయాయి.

**బజాజ్ హౌజింగ్ మరో 10 శాతం**

నూతనంగా స్టాక్ మార్కెట్లో లిట్కస్టైన బజాజ్ హౌజింగ్ షేరు కదంతొక్కుతున్నది. వరుసగా రెండోరోజు కూడా కంపెనీ షేరు 10 శాతం పెరిగి అప్పర్ సర్క్యూట్‌ను తాకింది. స్టాక్ మార్కెట్ ముగిసే సమయానికి బీఎస్ఈలో కంపెనీ షేరు 10 శాతం లాభపడి రూ.181.48 వద్ద ముగిసింది. దీంతో కంపెనీ మార్కెట్ విలువ మరో రూ.13,733.12 కోట్లు పెరిగి రూ.1,51,139.21 కోట్లకు చేరుకున్నది. ఇష్యూ ధర రూ.70తో పోలిస్తే గత రెండు రోజుల్లో షేరు ధర 159.28 శాతం ఎగబాకింది. రూ.150 వద్ద బీఎస్ఈ, ఎన్ఎస్ఈ వద్ద లిట్కస్టైనది తెలిసిందే.

## ఫెడ్ సమావేశం ముంగిట అప్రమత్తత.. నష్టాల్లో దేశీయ సూచీలు..

**న్యూఢిల్లీ– నవభూమి:** మరికొద్ది గంటల్లో అమెరికా ఫెడరల్ బ్యాంక్ రిజర్వ్ అధ్యక్షుడు జొరెమ్ పావెల్ మీడియా ముందుకు రాబోతున్నారు. వడ్డీ రేట్ల విషయంలో ఫెడ్ తీసుకున్న నిర్ణయాన్ని వెల్లడించారు. ఫెడ్ నుంచి వడ్డీ రేట్ల తగ్గింపు ఉంటుందని మార్కెట్ ఆశిస్తోంది. ఈ నేపథ్యంలో మదుపర్లు కాస్త అప్రమత్తంగా వ్యవహరించారు. అంతర్జాతీయంగా మిశ్రమ సంకేతాల కారణంగా దేశీయ సూచీలు కూడా నష్టాల్లోనే పయనించాయి. సెన్సెక్స్, నిఫ్టీ నష్టపోయాయి. మిడ్, స్మాల్ క్యాప్ ఇండెక్స్‌లు భారీ నష్టాలను మూటగట్టుకున్నాయి

మంగళవారం ముగింపు (83, 079)తో పోల్చుకుంటే స్వల్ప నష్టంతో 83, 037 వద్ద ప్రారంభమైన సెన్సెక్స్ రోజంతా లాభనష్టాలతో దోబూచులాడింది. ఒక దశలో 300 పాయింట్లకు పైగా కోల్పోయి 82, 700 వద్ద ఇంట్రాడే కనిష్టానికి చేరుకుంది. బుధవారం సెన్సెక్స్ 82, 700–83, 326 శ్రేణి మధ్య కదలాడింది. చివరకు 131 పాయింట్ల నష్టంతో 82, 9489 వద్ద రోజును ముగించింది. మరో వైపు నిఫ్టీ కూడా సెన్సెక్స్ బాటలోనే కదలాడింది. దాదాపు 41 పాయింట్ల నష్టంతో 25, 377 వద్ద స్థిరపడింది. మళ్లీ 25, 400 దిగువకు వచ్చింది.

సెన్సెక్స్‌లో మదర్సన్, శ్రీరామ్ ఫైనాన్స్, బజాజ్ ఫైనాన్స్, ఐఈఎక్స్ షేర్ల లాభాలు సంపాదించాయి. ఒరాకిల్ ఫిన్‌సెర్వ్, ఎంఫసిస్, గ్లెన్‌మార్క్, అబాట్ ఇండియా షేర్లు నష్టాలు మూటగట్టుకున్నాయి. బీఎస్ఈ మిడ్ క్యాప్ ఇండెక్స్ ఏకంగా 427 పాయింట్లు నష్టపోయింది. బ్యాంక్ నిఫ్టీ మాత్రం రోజంతా లాభాల్లోనే సాగింది. 561 పాయింట్లు లాభపడింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ 83.75గా ఉంది.

## రివోల్ట్ నుంచి ఈవీ బైక్ ఆర్వీ1.. రెండు వేరియంట్లలో లాంచింగ్.. ఇవీ డిటెయిల్స్..!




**న్యూఢిల్లీ– నవభూమి:** ప్రముఖ ఎలక్ట్రిక్ టూ వీలర్స్ తయారీ సంస్థ రివోల్ట్ మోటార్స్.. దేశీయ మార్కెట్లో రివోల్ట్ ఆర్వీ1 (%=వజశ్రీ=ఎ%1) మోటారు సైకిల్ ఆవిష్కరించింది. రివోల్ట్ ఆర్వీ1 రెండు వేరియంట్లలో లభిస్తుంది. రివోల్ట్ ఆర్వీ1 ఈవీ మోటారు సైకిల్ రూ.84,990, రివోల్ట్ ఆర్వీ1ం మోటారు సైకిల్ రూ.99,990 పలకుతుంది. ఇంతకుముందు ఓలా ఎలక్ట్రిక్ ఆవిష్కరించిన ఓలా రోడ్ స్టర్‌ఎక్స్ మోటారు సైకిల్ కు పోటీగా ‘రివోల్ట్ ఆర్వీ 1’ వస్తోంది.

రివోల్ట్ ఆర్వీ1 మోటారు సైకిల్ చైన్ డ్రైవ్ సిస్టమ్ తోపాటు రెండు బ్యాటరీ ఆప్షన్లతో వస్తోంది. 2.2 కిలోవాట్ల బ్యాటరీ 100 కి.మీ దూరం, 3.24 కిలోవాట్ల బ్యాటరీ 160 కి.మీ దూరం ప్రయాణిస్తాయి. ఎల్‌ఈడీ హెడ్ లైట్స్, 6–అంగుళాల డిజిటల్ ఎల్‌సీడీ ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్, డ్యుయల్ డిస్క్ బ్రేక్స్, మల్టిపుల్ స్పీడ్ మోడ్స్, రివర్స్ మోడ్, స్టేబుల్ రైడ్ కు వీలుగా వైడర్ టైర్లు ఉంటాయి.

## ఈరోజు కూడా తగ్గిన బంగారం, వెండి ధరలు.. ఎంతకు చేరాయంటే



**న్యూఢిల్లీ– నవభూమి:** గత కొన్ని రోజులుగా దేశవ్యాప్తంగా బంగారం( వెండి( ధరల్లో హెచ్చుతగ్గులు కనిపిస్తున్నాయి. మొన్న భారీగా పెరిగిన ఈ ధరలు నిన్నటి నుంచి మళ్లీ తగ్గుముఖం పట్టాయి. ఈ నేపథ్యంలో నేడు (సెప్టెంబర్ 18న) కూడా బంగారం, వెండి ధరలు స్వల్పంగా తగ్గాయి. ఈ క్రమంలో ఉదయం 6.20 నిమిషాల నాటికి హైదరాబాద్, విజయవాడలో 22 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములకు స్వల్పంగా 10 రూపాయలు తగ్గి రూ. 68,640కి చేరుకోగా, 24 క్యారెట్ల గోల్డ్ ధర 10 గ్రాములకు రూ. 74,880కి చేరింది.

ఇక దేశ రాజధాని ఢిల్లీలో 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర స్వల్పంగా 10 రూపాయలు తగ్గి రూ. 68,790కి చేరగా, 24 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములకు రూ. 75,030కి చేరుకుంది. మరోవైపు వెండి ధర కూడా కిలోకు 100 రూపాయలు తగ్గింది. దీంతో దేశంలోని ప్రధాన నగరాల్లో ఉన్న బంగారం, వెండి ధరల వివరాలను ఇక్కడ చుద్దాం.

%ూదీచీ% ఛానల్ ఫాలో అవ్వండి
%ూశ్రీఖఎఖఅఎప్వ
ఖీబశ్రీశ్రీంఎతీవవఖ

%దేశంలోని ప్రధాన ప్రాంతాల్లో గోల్డ్ రేట్లు (10 గ్రాములకు, 24 క్యారెట్లు, 22 క్యారెట్లు)

హైదరాబాద్‌లో రూ. 74,880, రూ. 68,640

విజయవాడలో రూ. 74,880, రూ. 68,640

ఢిల్లీలో రూ. 75,030, రూ. 68,790

వడోదరలో రూ. 74,930, రూ. 68,690
బెంగళూరులో రూ. 74,880, రూ. 68,640





ముంబైలో రూ. 74,880, రూ. 68,640
కోల్‌కతాలో రూ. 74,880, రూ. 68,640

చెన్నైలో రూ. 74,880, రూ. 68,640

ప్రధాన నగరాల్లో కిలో వెండి రేట్లు
ఢిల్లీలో రూ. 91900
చెన్నైలో రూ. 96900
బెంగళూరులో రూ. 85900
హైదరాబాద్‌లో రూ. 96900
విజయవాడలో రూ. 96900
ముంబైలో రూ. 91900
గోవాలో రూ. 85900
కేరళలో రూ. 96900
కోల్‌కతాలో రూ. 91900
అహ్మదాబాద్‌లో రూ. 91900
జైపూర్‌లో రూ. 91900
వడోదరలో రూ. 91900
పూణేలో రూ. 91900
లక్నోలో రూ. 91900

## ఆర్‌ఆర్ 310 ఆవిష్కరణ.. రూ.2.75 లక్షల నుంచి షురూ..!



**న్యూఢిల్లీ– నవభూమి:** 310 ఎ ప్రముఖ టూ వీలర్స్ తయారీ సంస్థ టీవీఎస్ మోటార్ కంపెనీ తన అప్ డేటెడ్ టీవీఎస్ అపాచీ ఆర్‌ఆర్310 మోటారు సైకిల్ భారత్ మార్కెట్లో ఆవిస్కరించింది. బాంబర్ గ్రే రంగుతోపాటు పలు మార్పులతో వస్తున్న ఈ మోటారు సైకిల్ ధర రూ.2.75 లక్షల (ఎక్స్ షోరూమ్) నుంచి ప్రారంభం అవుతుంది. రేసింగ్ రెడ్ కలర్ విత్ క్యూఎస్ ధర రూ.2.92 లక్షలు (ఎక్స్ షోరూమ్), న్యూ బాంబర్ గ్రే కలర్ ఆప్షన్ బైక్ రూ.2.97 లక్షలు (ఎక్స్ షోరూమ్) పలుకుతుంది. అదనంగా రెండు కిట్స్ డైనమిక్, డైనమిక్ ప్రో కూడా ఆఫర్ చేస్తున్నాయి. డైనమిక్ రూ.18,000, డైనమిక్ ప్రో రూ.16,000 పలుకుతున్నాయి.



## మార్క్ మనసుతో శాసిస్తాడు.. అలెక్సా పాటిస్తుంది



**న్యూయార్క్..నవభూమి:** సెప్టెంబరు 17: అమెజాన్ అలెక్సాతో పనిచేయించాలంటే.. దాన్ని పేరు పెట్టి పిలవాలి. మనకు నచ్చిన పాటో, సినిమానో ప్లే చెయ్యమని ఆజ్ఞాపించాలి. అప్పుడే పనవుతుంది. కానీ.. అమెరికాకు చెందిన 64 ఏళ్ల మార్క్ అనే వృద్ధుడు కేవలం తన మనసుతో ఆలోచించడం ద్వారానే అమెజాన్ అలెక్సాను పనిచేయించగలుగుతున్నారు! ఇది తావీజ్ మహిమ కాదు. సింక్రాన్ అనే కంపెనీ తయారుచేసిన బ్రెయిన్ ఇంప్లాంట్ మహిమ. మెదడులో అమర్చే చిప్‌లపై చాలాకాలంగా పరిశోధనలు చేస్తున్న సింక్రాన్ సంస్థ.. ఆయన మెదడులో అమర్చిన చిప్ ద్వారానే ఇది సాధ్యమవుతోంది. మెదడు, వెన్నుపూసలోని నాడులను క్రమంగా క్షీణింపజేసే ఏఎల్ఎస్ (అమ్యోట్రోపిక్ లాటెరల్ స్క్లెరోసిస్) వంటి వ్యాధులతో బాధ పడేవారి కోసం సింక్రాన్, ఈలన్ మస్క్‌కు చెందిన 'న్యూరాలింక్' వంటి సంస్థలు చాలాకాలంగా ప్రయోగాలు చేస్తున్నాయి. వాటిలో తొలుత న్యూరాలింక్ సంస్థ.. తొలిసారిగా ఒక మనిషి మెదడులో బ్రెయిన్–కంప్యూటర్ ఇంటర్‌ఫేసను (బీసీఐ) అమర్చినట్లు ఈ ఏడాది మొదట్లో ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు దాని సరసన సింక్రాన్ కూడా చేరింది. ఏఎల్ఎసతో బాధపడుతున్న మార్క్ మెదడులో ఈ ఇంప్లాంట్‌ను అమర్చింది. తద్వారా అతను తన ఆలోచనలతోనే 'అమెజాన్ ఫైర్ టాబ్లెట్' పరికరాన్ని పనిచేయించగలిగారు. ఇష్టమైన వీడియోలను ప్లే చేయగలిగారు.

## దూసుకొస్తున్న ఎక్స్‌ఈసీ వైరస్ .. యూరప్‌లో తొలి కేసు నమోదు



**న్యూఢిల్లీ– నవభూమి:** కొవిడ్ మహమ్మారి ప్రపంచాన్ని ఎంతగా కలవర పెట్టిందో అందరికి తెలిసిందే. ఆ కొవిడ్–19కు సంబంధించిన కొత్త వేరియంట్ ఎక్స్‌ఈసీ రూపంలో ఇప్పటికే యూరప్‌లో విస్తరిస్తుందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ ఏడాది జూన్‌లో ఈ ఎక్స్‌ఈసీ వేరియంట్‌ను తొలి సారి యూరప్‌లో గుర్తించారని తెలిపారు. అనంతరం ఈ వేరియంట్ యూకే, యూఎస్, డెన్మార్క్‌తోపాటు ఇతర దేశాలకు సైతం విస్తరించిందని పేర్కొన్నారు.ఇది రెండు ఒమిక్రాన్ సబ్ వేరియంట్స్ నుంచి ఎక్స్‌ఈసీ హైబ్రిడ్ రకంగా అవిర్భవించిందని వివరించారు. శీతాకాలంలో ఈ వైరస్ వ్యాప్తి చెందే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయన్నారు. ఈ నేపథ్యంలో దీనిని ఎదుర్కొనేందుకు వ్యాక్సిన్ లేదా బూస్టర్ డోస్ తీసుకోవాలని వైద్య నిపుణులు సూచించారు. తద్వారా ఆసుపత్రిలో చేరడం కానీ, అనారోగ్యం బారిన పడడం కాని ఉండదని చెప్పారు.

ఇప్పటికే 27 దేశాల నుంచి 500 శాంపిల్స్ సేకరించగా.. ఆ నమూనాల్లో ఎక్స్‌ఈసీ వేరియంట్ గుర్తించినట్లు వెల్లడించారు. డెన్మార్క్, జర్మనీ, యూకే, నెదర్లాండ్స్‌లలో ఈ ఎక్స్‌ఈసీ బలంగా పెరుగుతుందని వైద్య నిపుణులు ఆందోళన వ్యక్తం చేశారు.

జర్వం, గోంతు మంట, దగ్గు, వాసన తెలియక పోవడం, ఆకలి లేకపోవడం, ఒంటి నొప్పులు ద్వారా కొత్త రకం కోవిడ్ ఎక్స్‌ఈసీ లక్షణాలను గుర్తించ వచ్చన్నారు. పరిశ్రుభతను పాటించడంతోపాటు స్వచ్ఛమైన గాలిని పీల్చే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలకు యూఎస్ సెంటర్స్ ఫర్ డిసీజస్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన (సీడీసీ) ఈ సందర్భంగా సూచించింది.

## సీఎం మమత అప్పుడే చర్యలు తీసుకుని ఉంటే..

**కోల్‌కతా–నవభూమి:** 2021 నుంచి ఆర్ జీ కర్ మెడికల్ కాలేజీ



ఆసుపత్రి మాజీ ప్రిన్సిపాల్ ప్రొ. సందీప్ ఘోష్ అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్నారని హత్యాచారానికి గురైన ఆ కాలేజీ వైద్యురాలి తండ్రి వెల్లడించారు. ఆ నాడే ప్రొ. సందీప్ ఘోష్‌పై ముఖ్యమంత్రి మమతా బెనర్జీ కఠిన చర్యలు తీసుకుని ఉంటే.. ఈ రోజు తమ కుమార్తె బతికి ఉండేదన్నారు. కోల్‌కతాలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తన కుమార్తె హత్యాచారం కేసులో ఎవరి ప్రమేయం ఉంది, ఘటన స్థలంలో ఆధారాలు ఎవరు చేరిపి వేశారనే విషయాలు దర్యాప్తులో తేలుతాయన్నారు. ఈ కేసు.. ప్రస్తుతం సీబీఐ విచారణ జరుపుతుందని.. దీనిపై తానేమి వ్యాఖ్యానించబోనని ఆయన స్పష్టం చేశారు. తన కుమార్తెకు జరిగిన అన్యాయంపై ఆందోళనకు దిగిన జూనియర్ డాక్టర్లలో ఆ బాధ స్పష్టంగా కనిపిస్తుందని చెప్పారు. వాళ్లంతా తన పిల్లలతో సమానమన్నారు. ఈ హత్యాచారం కేసులో నిందితులు పట్టుబడిన రోజు.. మనం విజయం సాధించినట్లు అవుతుందని ఆయన పేర్కొన్నారు. మరోవైపు కోల్‌కతా పోలీస్ కమిషనర్‌గా మనోజ్ కుమార్ వర్మను మమతా బెనర్జీ నియమించింది. దీంతో ఆయన నగర సీపీగా మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఆ పదవిలో ఉన్న వినీత్ గోయేల్.. స్పెషల్ టాక్స్ ఫోర్స్‌కు బదిలీ చేసింది. ఆగస్ట్ 9వ తేదీన ఆర్ జీ కర్ మెడికల్ కాలేజీ ఆసుపత్రి పోస్ట్ గ్రాడ్యుయేషన్ ట్రైయినీ వైద్యురాలిపై హత్యాచారం ఘటన చోటు చేసుకుంది. అనంతరం ఈ కేసులో నిందితులను కఠినంగా శిక్షించాలంటూ జూనియర్ డాక్టర్లు ఆందోళన చేపట్టారు. దీంతో పశ్చిమ బెంగాల్‌లో వైద్య సేవలు నిలిచిపోయాయి. అలాంటి వేళ.. విధుల్లో చేరాలంటూ జూనియర్ డాక్టర్లతో సీఎం మమతా బెనర్జీ చర్చలు జరిపారు. అందులోభాగంగా పలు డిమాండ్లను మమత ప్రభుత్వం ఎదుట ఉంచారు. వాటిలో కొన్నింటిని మాత్రమే సీఎం మమతా బెనర్జీ ఒప్పుకున్నారు. అందులో ఒకటి కోల్‌కతా పోలీస్ కమిషనర్‌పై బదిలీ వేటు. ఇంకోవైపు ఆర్ జీ కర్ మెడికల్ కాలేజీ ఆసుపత్రి మాజీ ప్రిన్సిపాల్ ప్రొ. సందీప్ ఘోష్‌పై అవినీతి ఆరోపణలు వెల్లవెత్తడంతో.. ఆయన నివాసాలతోపాటు ఫామ్ హౌస్‌పై ఈడీ దాడులు చేపట్టింది. ప్రస్తుతం సందీప్ ఘోష్ సీబీఐ కస్టడీలో ఉన్న సంగతి తెలిసిందే.

## రెండు సుకన్య సమృద్ధి ఖాతాలున్నాయా.. జాగ్రత్త పడండి.. లేకుంటే అంతే..

**న్యూఢిల్లీ–నవభూమి:** చిన్న మొత్తాల పొదుపు పథకాల రెగ్యులరైజేషన్‌పై కేంద్ర ప్రభుత్వం కీలక ఆదేశాలు జారీ చేసింది. సరైన మార్గదర్శకాలు పాటించకుండా ఓపెన్ చేసిన చిన్న మొత్తాల పొదుపు పథకాల ఖాతాలను రెగ్యులరైజ్ చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని ఆర్థిక వ్యవహారాల విభాగం ఖాతాదారులకు కీలక సూచనలు చేసింది. దీనికి సంబంధించి నూతన మార్గదర్శకాలను విడుదల చేసింది. ఒకే కుంటుంబంలో రెండు కంటే ఎక్కువ సుకన్య సమృద్ధి ఖాతాలు ఉంటే వాటిని వెంటనే రెగ్యులరైజ్ చేయాలని తెలిపింది. లేదంటే ఖాతాలు క్లోజ్ అయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించింది.ఒకే కుటుంబానికి చెందిన వారు రెండు కంటే ఎక్కువ సుకన్య సమృద్ధి యోజన ఖాతాలు తెరిచినట్లయితే.. ఉపయోగించని ఖాతాలను వెంటనే మూసివేయాల్సి ఉంటుందని ఆర్థిక వ్యవహారాల విభాగం తెలిపింది. ఒకవేళ అలా చేయకపోతే సుకన్య యోజన స్కీమ్–2019 మార్గదర్శకాలకు వ్యతిరేకంగా ఉన్న ఖాతాలను గుర్తించి.. సరైన మార్గదర్శకాలు పాటించని వాటిని మూసివేస్తామని సర్క్యులర్ జారీ చేసింది. చట్టపరంగా ఆడపిల్లల సంరక్షకులు కానీ వారు గ్రాండ్ పేరెంట్స్ ఆధ్వర్యంలో సుకన్య సమృద్ధి ఖాతా ఇప్పటికే తెరిచి ఉంటే.. అలాంటి ఖాతాలను వెంటనే చట్టప్రకారం సహజ సంరక్షకులకు బదిలీ చేయాలి. అంటే జీవించి ఉన్న తల్లిదండ్రులు లేదా చట్టపరమైన సంరక్షకులకు వాటిని ట్రాన్స్‌ఫర్ చేయాలని ఆగస్టు 21, 2024న తెలిపింది.సుకన్య సమృద్ధి యోజన పథకం తెరిచిన సమయంలో పాన్ కార్డు, ఆధార్ కార్డు ఇవ్వకపోతే తాజాగా మార్గదర్శకాల ప్రకారం వెంటనే వాటిని సమర్పించాలి. రెండూ అంతకు మించి ఉన్న ఖాతాలను రెగ్యులరైజ్ చేయడానికి ముందే వీటిని అప్డేట్ చేయాల్సి ఉంటుంది.

పాన్, ఆధార్ కార్డులు లేని ఖాతాలను గుర్తించాలని ఇప్పటికే కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ పోస్టాఫీసులకు ఆదేశాలు జారీ చేసింది.

# ఒకేసారి ఎన్నికలు సాధ్యమేనా.. లాభనష్టాలేంటి




**న్యూఢిల్లీ– నవభూమి:** ప్రజాధనం ఆదా చేయడంతోపాటు, అభివృద్ధికి ఆటంకం కలగకూడదనే ఉద్దేశంతోనే జమిలీ ఎన్నికలను ప్రతిపాదిస్తున్నట్లు అధికార బీజేపీ చెబుతూ వస్తోంది. అయితే జమిలీ ఎన్నికలు ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని కాంగ్రెస్ సహా ప్రధాన విపక్షాలన్నీ ఆరోపిస్తున్నాయి. తాజాగా రామ్ నాథ్ కోవింద్‌తో కూడిన కమిటీ సమర్పించిన నివేదికకు కేంద్ర కేబినెట్ ఆమోదముద్ర వేయడంతో జమిలీ ఎన్నికలపై దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. త్వరలో జరగనున్న పార్లమెంటు సమావేశాల్లో వన్ నేషన్ వన్ ఎలక్షన్ బిల్లును కూడా ప్రవేశపెట్టనున్నట్లు తెలుస్తోంది. దేశవ్యాప్తంగా ఏకకాలంలో ఎన్నికలు నిర్వహిస్తే లాభమా? నష్టమా? తెలుసుకుందాం..

2014 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ మేనిఫెస్టోలో వన్ నేషన్, వన్ ఎలక్షన్ అనే అంశాన్ని చేర్చింది. 2016లో నీతి ఆయోగ్ జమిలీ కాన్సెప్ట్ అమలు కోసం వర్క్‌షాప్‌ను నిర్వహించింది. 2 ఏళ్ల తర్వాత, 2018లో లా కమిషన్ ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించేందుకు ఐదు రాజ్యాంగ సిఫార్సులు అవసరమని సూచించింది. ఈ అంశంపై చర్చించేందుకు 2019లో ప్రధాని మోదీ అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశాన్ని కాంగ్రెస్, బహుజన్ సమాజ్‌వావదీ పార్టీ, సమాజ్ వాదీ పార్టీ, డీఎంకే వంటి విపక్షాలు బహిష్కరించాయి. ఈ సమావేశానికి ఆమ్ ఆద్మీ పార్టీ, టీడీపీ, బీఆర్ఎస్ హాజరయ్యాయి. 2022లో అప్పటి ప్రధాన ఎన్నికల కమిషనర్ సుశీల్ చంద్ర జమిలీకి సంబంధించి కీలక వ్యాఖ్యలు చేశారు. ఒకేసారి ఎన్నికలు నిర్వహించేందుకు ఈసీ సిద్ధంగా ఉన్నప్పటికీ అందుకోసం రాజ్యాంగంలో కొన్ని సవరణలు అవసరమని చెప్పారు.


లాభాలు..కొన్ని నివేదికల ప్రకారం.. 2019 లోక్‌సభ ఎన్నికలకు మొత్తంగా రూ.60 వేల కోట్లు ఖర్చైంది. ఇందులో అభ్యర్థులు, రాజకీయ పార్టీలు, ఎన్నికల సంఘం ఖర్చులు ఉంటాయి. దేశంలో ఏకకాలంలో ఎన్నికలు జరిగితే ఎన్నికల ఖర్చును తగ్గించుకోవచ్చనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. ఎన్నికల కోసం అధికారిక సిబ్బందిని నియమించడం రోజువారీ పరిపాలనా విధులు సాఫీగా సాగడంలో ఆటంకం కలుగుతోంది. ఎన్నికలు జరుగుతున్న సమయంలో అధికారుల సంఖ్య పెంచాల్సి ఉంటుంది.

దీంతో ఇది సాధారణ పరిపాలనానూ ప్రభావితం చేస్తోంది. ఏకకాలంలో ఎన్నికలు నిర్వహిస్తే పాలనాపరమైన పనులపై ఎలాంటి ప్రభావం పడదని అధికార పక్షం భావిస్తోంది. రాష్ట్రాల్లో ఒక్కోసమయంలో ఎన్నికలు జరుగుతుండటంతో ప్రజాధనం వృథాతోపాటు, సంక్షేమ పథకాల అమలుపై ప్రభావం పడుతోందని చెబుతోంది. భారీ స్థాయిలో ఎన్నికలు నిర్వహించాల్సిన ప్రక్రియ ఉన్నందున అధికారులు సంక్షేమ పథకాలను చేరవేయడంపై దృష్టి పెట్టకపోవచ్చని అంటోంది. మరోవైపు ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించడం వల్ల ఓటింగ్ శాతం పెరుగుతుందని ఇంకొందరు నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

**ప్రతికూలతలు..**

రాష్ట్రాల్లో దశాబ్దాలకొలది వేళ్లూనుకున్న ప్రాంతీయ పార్టీలు జమిలి ఎన్నికలను వ్యతిరేకిస్తున్నాయి. అందుకు కారణమూ లేకపోలేదు. ఏకకాలంలో ఎన్నికలు జరిగితే ప్రాంతీయ పార్టీల మనుగడ ప్రశ్నార్థకం అవుతుందని ఆయా పార్టీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించే ప్రక్రియతో స్థానిక సంస్థల సమస్యలు పరిష్కారం కాకుండా పోయే ప్రమాదం ఉందని మరికొందరు అంటున్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఓటర్లు ఒకే పార్టీకి పట్టం కట్టే అవకాశమూ లేకపోలేదని.. తద్వారా స్థానిక పార్టీలు లేదా ప్రాంతీయ పార్టీల ఉనికే ప్రమాదంలో పడే అవకాశం ఉందని చెబుతున్నారు.

## జమిలి ఎన్నికలపై కాంగ్రెస్ ఘాటు రియాక్షన్



**న్యూఢిల్లీ– నవభూమి:** ఒకే దేశం ఒకే ఎన్నిక విధానం ప్రజాస్వామ్య హక్కులను కాలరాయడమేనని కాంగ్రెస్ విమర్శించింది. జమిలి ఎన్నికలకు కేంద్ర కేబినెట్ బుధవారం ఆమోదం తెలిపిన విషయం విదితమే. దీనిపై ప్రధాన ప్రతిపక్ష పార్టీ కాంగ్రెస్ స్పందించింది. జమిలి ఎన్నికలు దేశంలో సాధ్యం కావని పేర్కొంది. కేంద్ర ప్రతిపాదనను అంగీకరించడానికి ఎవరూ సిద్ధపడరని అభిప్రాయం వ్యక్తం చేసింది.

ఈ మేరకు కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే బీజేపీపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఆయన మాట్లాడుతూ.. " జమిలి ఎన్నికలు దేశంలో సాధ్యం కావు. కేంద్రం ప్రతిపాదనను ఎవరు అంగీకరించరు. దేశంలోని సమస్యలను పక్కదారి పట్టించేందుకే జమిలి ఎన్నికల ప్రస్తావన తెస్తున్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎప్పుడు ఎన్నిక వస్తే అప్పుడు నిర్వహించాల్సిందే. జమిలి ఎన్నిక ప్రజాస్వామ్య వ్యవస్థలో నడవదు. జమిలి ఎన్నికను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది" అని ఖర్గే స్పష్టం చేశారు. అయితే.. ఆ పార్టీ విమర్శలపై బీజేపీ మండిపడుతోంది.

**త్వరలో పార్లమెంటులో బిల్లు..**

కేంద్ర ప్రభుత్వం జమిలీ ఎన్నికలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. వన్ నేషన్ వన్ ఎలక్షన్‌పై మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలోని కమిటీ ఇచ్చిన నివేదికను కేబినెట్ బుధవారం మధ్యాహ్నం ఆమోదించింది. రానున్న శీతాకాల సమావేశాల్లో పార్లమెంటు ఉభయ సభల్లో బిల్లు ప్రవేశపెట్టనుంది.

**8 మంది సభ్యులతో కమిటీ..**

కేంద్ర సర్కార్ వన్ నేషన్ – వన్ ఎలక్షన్ ప్రతిపాదన కోసం రామ్‌నాథ్ కోవింద్ సహా 8 మంది సభ్యులతో కూడిన కమిటీని ఏర్పాటు చేసింది. ఇందులో లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీలు, స్థానిక సంస్థలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించే అవకాశాలపై కమిటీ సభ్యులతో రామ్‌నాథ్ కోవింద్ చర్చించారు. ఎన్నికలకు సంబంధించి అన్ని పార్టీల అభిప్రాయాలను, రాష్ట్రాల సవాళ్లను కమిటీ పరిశీలించింది. సుదీర్ఘ చర్చోపచర్చల అనంతరం రామ్‌నాథ్ కోవింద్ కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది.

## 41 ఏళ్ల క్రితమే ప్రతిపాదన.. జమిలీ వెనక చరిత్ర తెలుసా




**న్యూఢిల్లీ–నవభూమి:** ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామిక దేశం మనది. ఇక్కడ ఎన్నికల నిర్వహణ కూడా ఎప్పుడూ ప్రత్యేకమే. సాధారణంగా భారత్‌లో కేంద్రానికి, రాష్ట్ర అసెంబ్లీలకు విడివిడిగా ఎన్నికలు జరుగుతుంటాయి. పార్లమెంట్‌కు, రాష్ట్రాల అసెంబ్లీలకూ ప్రతి ఐదేళ్లకు ఓ సారి ఎలక్షన్లు జరుగుతాయి. అయితే అన్ని రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు ఏకకాలంలో జరగవు. శాసనసభ గడువు ముగిసే ఏడాది మాత్రమే ఎన్నికలు జరుగుతాయి. దీంతో ఏటా ఏదో ఒక చోట ఎన్నికలు జరుగుతూనే ఉంటాయి. ఈ కారణంతో అభివృద్ధి పనులకు విఘాతం కలుగుతోందని, ప్రభుత్వ ఖర్చు పెరిగిపోతోందని కేంద్ర ప్రభుత్వం గత కొన్నేళ్లుగా జమిలీ ఎన్నికలపై ఆలోచిస్తోంది.

ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించింది. మాజీ రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్ అధ్యక్షతన ఓ కమిటీని ఏర్పాటు చేసింది. సుదీర్ఘ కాలంపాటు విచారించి14 మార్చి, 2024న రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు కమిటీ నివేదిక అందించింది. 18 వేల పేజీలకు పైగా ఉన్న ఈ నివేదికలో లోక్‌సభ, అసెంబ్లీ, స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ కోసం ఓటర్లకు ఒకే ఓటరు జాబితా సిద్ధం చేయాలని నివేదికలో సూచించారు. 2023, సెప్టెంబర్ 2న ఏర్పాటైన ఈ కమిటీ నివేదికను రూపొందించడానికి 191 రోజులు పట్టింది. సెప్టెంబర్ 18, 2024న కేంద్ర కేబినెట్ జమిలీ ఎన్నికలు జరపడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మీకు తెలుసా.. జమిలీ ఎన్నికల ఆలోచన ఇప్పటిది కాదు. సుమారు 41 ఏళ్ల క్రితమే1983లో జమిలి ఎన్నికలు జరపాలని ఎన్నికల సంఘం నిర్ణయించింది.

చరిత్ర ఇదే..1983లో వన్ నేషన్ వన్ ఎలక్షన్ జరపాలని ఎన్నికల సంఘం సూచించింది. 1999లో లా కమిషన్ ఆఫ్ ఇండియా ఎన్నికల చట్ట సంస్కరణలపై 170వ నివేదికను సమర్పించింది. 2018లో లా కమిషన్ ఆఫ్ ఇండియా జమిలీ ఎన్నికలపై నివేదిక విడుదల చేసింది. 15 ఆగస్టు, 2019 నాటి స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో దేశమంతటా ఒకే సమయంలో ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించినట్లు ప్రధాని నరేంద్ర మోదీ ఎర్రకోట సాక్షిగా ప్రకటించారు. 1 సెప్టెంబర్, 2023న మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ అధ్యక్షతన 'ఒక దేశం, ఒకే ఎన్నిక'పై కమిటీ ఏర్పాటైంది. 2 సెప్టెంబర్ 2023న కమిటీ సభ్యులను ప్రకటించారు.

హోం శాఖ మంత్రి అమిత్ షా సహా ఏడుగురు సభ్యులు ఇందులో ఉన్నారు. వారిలో రామ్‌నాథ్ కోవింద్ కూడా ఒకరు. 23 సెప్టెంబర్ 2023న కమిటీ మొదటి సమావేశం జరిగింది. ఈ అంశంపై ముందుగా అన్ని రాజకీయ పార్టీల అభిప్రాయం తీసుకోవాలని సమావేశంలో నిర్ణయించారు. రోడ్‌మ్యాప్‌కు సంబంధించి లా కమిషన్‌తో చర్చించి ముందుకు వెళ్లాలని కూడా నిర్ణయించారు. మొత్తానికి అన్ని పార్టీల అభిప్రాయాలు తీసుకుని నివేదిక రూపొందించారని అధికార వర్గాలు చెబుతున్నాయి.

## రెండు వర్గాల మధ్య ఘర్షణ.. పోలీసులు లాఠీచార్జి



**న్యూఢిల్లీ– నవభూమి:** దేశవ్యాప్తంగా గణపతి నవరాత్రులు ముగిశాయి. నిమజ్జనంలో భాగంగా వినాయకుడు.. గంగమ్మ ఒడికి చేరుతున్నాడు. వినాయకుడిని నిమజ్జనం కోసం వెళ్తున్న ఊరేగింపుపై ఓ వర్గం రాళ్ల దాడికి దిగింది. దీంతో ఊరేగింపులో పాల్గొన్న భక్తులు సైతం ఎదురు దాడికి దిగారు. దాంతో రెండు వర్గాలు ఘర్షణకు దిగాయి.ముంబయి, సెప్టెంబర్ 18: దేశవ్యాప్తంగా గణపతి నవరాత్రులు ముగిశాయి. నిమజ్జనంలో భాగంగా వినాయకుడు.. గంగమ్మ ఒడికి చేరుతున్నాడు. వినాయకుడిని నిమజ్జనం కోసం వెళ్తున్న ఊరేగింపుపై ఓ వర్గం రాళ్ల దాడికి దిగింది. దీంతో ఊరేగింపులో పాల్గొన్న భక్తులు సైతం ఎదురు దాడికి దిగారు. దాంతో రెండు వర్గాలు ఘర్షణకు దిగాయి. పోలీసులు జోక్యం చేసుకుని లాఠీ ఛార్జికి దిగారు. దాంతో ప్రజలతోపాటు పోలీసులకు సైతం గాయాలయ్యాయి.

ఈ ఘటన మంగళవారం అర్ధరాత్రి థానే జిల్లాలోని భివాండిలో మంగళవారం చోటు చేసుకుంది. గుంఘట్ నగర్ నుండి వినాయకుడిని నిమజ్జనం కోసం నదినాక కమ్వారి నది వద్దకు ఊరేగింపుగా భక్తులు తీసుకు వెళు న్నారని తెలిపారు. ఆ క్రమంలో వంజరపట్టి నాకా వద్దకు ఊరేగింపు చేరుకుందని చెప్పారు. ఆ సమీపంలోని హిందూస్థాన్ మాసీద్ వద్ద కొందరు యువకులు ఆ ఊరేగింపుపై రాళ్ల రువ్వారని పోలీసులు వివరించారు. అయితే ఈ ఘటనకు బాధ్యులను వెంటనే అరెస్ట్ చేయాలని ఓ వర్గం డిమాండ్ చేస్తుంది. అంత వరకు ఈ గణేశుడి నిమజ్జనం జరుపబోమని సదరు వర్గం స్పష్టం చేసింది. ఈ ఘర్షణపై సమాచారం అందుకున్న స్థానిక ఎమ్మెల్యే, బీజేపీ నేత మహేశ్ చౌగులే తన అనుచరులతో కలిసి ఘటన స్థలానికి చేరుకున్నారు.

ఈ ఘర్షణకు బాధ్యులపై వెంటనే చర్యలు తీసుకోవాలని స్థానిక శివాజీ చౌక్ వద్ద తన అనుచరులతో కలిసి ఎమ్మెల్యే ఆందోళనకు దిగారు. భివాండిలోని పలు ప్రాంతాల్లో భారీగా పోలీసులు మోహరించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసు ఉన్నతాధికారులు వెల్లడించారు. అందులోభాగంగా ఇప్పటికే పలువురిని అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నామని తెలిపారు. ఈ ఘటనకు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. భివాండిలో ప్రస్తుతం శాంతి భద్రతలు పూర్తిగా అదుపులో ఉన్నాయన్నారు. వినాయక చవితి ప్రారంభమైన అనంతరం కర్ణాటకలోని నాగమంగళ పట్టణంలో సైతం దాదాపు ఇదే తరహా ఘటన చోటు చేసుకున్న సంగతి తెలిసిందే.

## నీలగిరుల్లో అడవి ఏనుగుల సంచారం..



**న్యూఢిల్లీ–నవభూమి:** నీలగిరి జిల్లాలో గత కొద్ది రోజులుగా వన్యమృగాలు అడవుల నుండి వచ్చి జనావాస ప్రాంతాల్లో సంచరిస్తున్నాయి. నీరు, ఆహారం కోసం ఆ జంతువులు కొండదిగువనున్న నివాసాల్లోకి చొరబడేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఊటీ(ంచి మంజూరు మీదుగా కోవై వెళ్లే రహదారిలో ఓ పెద్ద ఎలుగుబంటిని చూసి వాహన చోధకులు భీతిల్లారు. ఈ నేపథ్యంలో మంజూరు నుంచి కోయంబత్తూరు వెళ్లే రహదారిలో అడవి ఏనుగులు గుంపుగా రోడ్డులో సంచరించటంతో వాహన చోదకులు దిగ్భ్రాంతి చెందారు.ఆ రహదారి చాలా ఇరుకుగా ఉండటంతో వాహన చోదకులు హారన్ కొట్టినా అవి కదలడం లేదు. సుమారు రెండు గంటలపాటు ఆ ఏనుగులు రోడ్డుపై సంచరిస్తూ వాహనాల రాకపోకలకు అడ్డుగా నిలిచాయి. ఆ తర్వాత అడవిలోకి వెళ్లటంలో వాహనాలు కదిలాయి. నీలగిరి రహదారుల్లో ప్రస్తుతం ఏనుగుల సంచారం అధికంగా ఉందని వాహన చోదకులు అప్రమత్తంగా ఉండాలని హైవే అధికారులు హెచ్చరిస్తున్నారు.

## జమ్మూ కశ్మీర్ ఎన్నికల మొదటి దశ ఓటింగ్ షురూ.. ప్రధాని మోదీ విజ్ఞప్తి

**న్యూఢిల్లీ– నవభూమి:** జమ్మూ కశ్మీర్ అసెంబ్లీ 2024 ఎన్నికల మొదటి దశ ఓటింగ్ ప్రారంభమైంది. 10 ఏళ్ల తర్వాత జమ్మూ కశ్మీర్‌లో ముఖ్యమంత్రిని ఎన్నుకునేందుకు అక్కడి ప్రజలు ఓట్లు వేస్తున్నారు. ఏడు జిల్లాల్లో తొలి దశలో 24 స్థానాలకు ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరగనుంది. ఇందులో 8 సీట్లు జమ్మూ నుంచి, 16 సీట్లు కశ్మీర్‌లో ఉన్నాయి.జమ్మూ కశ్మీర్‌లో మొత్తం 90 సీట్లు ఉన్నాయి. వాటిలో లోయలో 47, జమ్మూ డివిజన్‌లో 43 ఉన్నాయి. ఈ నేపథ్యంలో భద్రతను కట్టుదిట్టం చేసిన ఎన్నికల సంఘం జమ్మూకశ్మీర్‌లో 3 దశల్లో ఓటింగ్‌ను నిర్వహిస్తోంది. సెప్టెంబరు 25న రెండో విడత, అక్టోబర్ 1న మూడో విడత పోలింగ్ జరగనుంది. ఎన్నికల ఫలితాలు అక్టోబర్ 8న వెల్లడికానున్నాయి.తొలి దశ ఎన్నికల్లో జమ్మూ, ఉదంపూర్, ఢిల్లీలో ఏర్పాటు చేసిన 24 ప్రత్యేక పోలింగ్ స్టేషన్లలో 35,500 మంది విదేశీ కశ్మీరీ ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. జమ్మూ కశ్మీర్‌లో అసెంబ్లీ ఎన్నికల ఓటింగ్ జరుగుతున్న నేపథ్యంలో ప్రధాని మోదీ ఎక్స్ వేదికగా ఓ పోస్ట్ చేశారు. అసెంబ్లీ ఎన్నికల మొదటి దశ ప్రారంభమైందని, ఈరోజు ఓటింగ్ జరుగుతున్న అన్ని నియోజకవర్గాల్లో అధిక సంఖ్యలో ప్రజలు ఓటు వేసి ప్రజాస్వామ్య పండుగను పటిష్టం చేయాలని కోరారు. ప్రధానంగా యువకులు, మొదటిసారి ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## జియో సేవలకు తీవ్ర విఘాతం




**న్యూఢిల్లీ– నవభూమి:** దేశంలో అతిపెద్ద టెలికాం కంపెనీ రిలయన్స్ జియో సేవలకు మంగళవారం ఉదయం తీవ్ర అంతరాయం ఏర్పడింది. ప్రధానంగా ముంబై సర్కిల్‌తో పాటు దేశంలోని పలు ప్రాంతాల్లో లక్షలాది మంది వినియోగదారులు కాలింగ్, ఇంటర్నెట్‌లో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దాంతో ఎక్స్ సహా ఇతర మాధ్యమాల్లో ఫిర్యాదులు వెల్లువెత్తాయి. టెక్నాలజీ సేవల విఘాతాలను పర్యవేక్షించే డౌన్‌డిటెక్టర్ వెబ్‌సైట్ ప్రకారం.. జియో మొబైల్ నెట్‌వర్క్ కనెక్టివిటీతో పాటు ఫైబర్ ఇంటర్నెట్ సేవలకూ అంతరాయం ఏర్పడింది. జియో ఐడీసీ డేటా సెంటర్‌లో చోటుచేసుకున్న అగ్నిప్రమాదమే ఇందుకు కారణమని రాయిటర్స్ కథనం పేర్కొంది. కానీ, కంపెనీ ఈ విషయాన్ని ధ్రువీకరించలేదు. వినియోగదారులకు క్షమాపణలు తెలిపిన జియో.. సేవల అంతరాయానికి చిన్న సాంకేతిక సమస్యే కారణమని పేర్కొంది. సమస్యను పరిష్కరించామని, సేవలను పూర్తిస్థాయిలో పునరుద్ధరించామని తెలిపింది. హైదరాబాద్, ఢిల్లీ, ముంబై సహా అనేక నగరాల్లో జియో సేవలకు అంతరాయం కలిగింది.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
8 | హైదరాబాద్ | గురువారం | 19 । సెప్టెంబర్ । 2024

# చిత్ర పరిశ్రమలో విషాదం..



చిత్ర పరిశ్రమలో విషాదం చోటు చేసుకుంది. దక్షిణాది అలనాటి నటి సీఐడీ శకుంతల కన్నుమూశారు. ప్రస్తుతం ఆమె వయసు 84. ఛాతి నొప్పితో బాధపడుతున్న ఆమె నిన్న సాయంత్రం బెంగళూరులోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచారు. ఆమె మరణ వార్త తెలుసుకున్న అభిమానులు, పలువురు సినీ సెలబ్రిటీలు నటి మృతిపై సంతాపం వ్యక్తం చేస్తున్నారు.కాగా, తెలుగు, కన్నడ, తమిళ, మలయాళం భాషల్లో దాదాపు 600కిపైగా సినిమాల్లో నటించారు. లెజెండరీ నటులు ఎంజీఆర్, శివాజీ వంటి వారితో స్క్రీన్ షేర్ చేసుకున్నారు. తెలుగులో బుద్ధిమంతుడు, నేను మనిషినే వంటి సినిమాల్లో కనిపించారు. సినిమాల్లోనే కాదు పలు సీరియల్లోనూ ఆమె నటించి మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. సీఐడీ ధారావాహికతో ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకున్నారు. ఇక అప్పటి నుంచి ఆమెను అంతా సీఐడీ శకుంతలగానే గుర్తిస్తున్నారు.

నవచిత్ర



# స్టన్నింగ్ దిశాపటానీ నెవ్వర్ బిఫోర్ లుక్!



ప్రతిసారీ ఏదో ఒక కొత్తదనంతో ఆకట్టుకోవడం దిశా పటానీకే చెల్లింది. ఇంతకుముందు సీకే బ్రాండ్ ప్రచారకర్తగా రకరకాల డిజైనర్ లుక్స్ తో మతులు చెడగొట్టిన దిశా ఇప్పుడు మరో వాణిజ్య ప్రకటన కోసం ఇచ్చిన ఫోజులు గుండెల్లో గుబులు పుట్టిస్తున్నాయి. దిశా అన్నివేళలా లుక్స్ పరంగా సంథింగ్ స్పెషల్ అందించాలని తపిస్తుంది. ఈసారి కూడా ఈ భామ ట్రెండీ లుక్ తో కట్టి పడేసింది. ఇటీవల జైపూర్‌లోని సిటీ ప్యాలెస్‌లో జరిగిన పోలో అస్ని ఈవెంట్‌లో రూపొందించిన ప్రకటన కోసం దిశా ఇలా సరికొత్త లుక్ లో ప్రత్యక్షమైంది. అద్భుతమైన మెరూన్ కలర్ మోనోక్రోమ్ దుస్తుల్లో దిశా ఈ వెన్యూ వద్ద మ్యాజిక్‌ను సృష్టించింది. దిశా ఫిగర్-గ్రేజింగ్ ఫిట్ అవతార్ కి తగ్గట్టు మెరూన్ కలర్ నెక్‌లైన్ బాడీసూట్ తో రియల్ స్టన్నర్ గా నిలిచింది. ఈ లుక్ చూశాక.. దిశా పటానీ పార్టీ గర్ల్ స్టైల్ ఆకట్టుకుందని అభిమానులు వ్యాఖ్యానిస్తున్నారు. ఇటీవలి కాలంలో యువతరాన్ని హీటెక్కించిన ది బెస్ట్ లుక్ ఇది అంటూ ప్రశంసలు కురుస్తున్నాయి. కెరీర్ మ్యాటర్ కి వస్తే... ఇటీవలే కల్కి 2989 ఏడిలో నటించింది. ప్రభాస్ మూవీతో పాన్ ఇండియా విజయం దక్కించుకుంది. టాలీవుడ్ స్టార్ ప్రభాస్ ఈ భామకు కెరీర్ బెస్ట్ విజయాన్ని అందించాడు. ఈ చిత్రంలో దీపిక పదుకొనే కీలక పాత్రను పోషించిన సంగతి తెలిసిందే. తదుపరి తమిళ హీరో సూర్య నటించిన ప్రతిష్ఠాత్మక చిత్రం కంగువ లోను దిశా పటానీ కనిపించనుంది. కంగువ పలు భాషల్లో అక్టోబర్ 10న అత్యంత భారీగా విడుదల కానుంది.



దిశాపటానీ

# గన్‌తో ఆకతాయిల్ని బెదిరించిన చిరంజీవి!



స్టార్ హీరోలు రీల్ మీదనే కాదు అప్పుడప్పుడు రియల్ లైఫ్ లోని హీరోలు అని ప్రూవ్ చేస్తుంటారు. చేస్తున్న సహాయాల రూపంలో కావొచ్చు..అందిస్తోన్న విరాళాల రూపంలో కావొచ్చు...ఒకరిని కాపాడే విషయంలో కావొచ్చు. ఇలా రియల్ లైఫ్ లో హీరోలు హైలైట్ అవుతుంటే? నిజంగానే వాళ్లు హీరోలు అనిపిస్తుంది. తాజాగా చిరంజీవి తన పాలిట రియల్ హీరో అనేసారు అందాల నటి సుహాసిని. చిరు నటించిన హీరోయిన్లు సుహాసిని కూడా ఒకరు. 1980-90 దశకంలో ఇద్దరి కాంబినేషన్ లో చాలా సినిమాలొచ్చాయి. తాజాగా చిరును ప్రశంసించిన వీడియో ఒకటి వైరల్ అవుతోంది. అందులో ఆమె మాట్లాడుతూ.. చిరంజీవి నా హీరో. అందరికీ ఓ విషయం చెప్పాలనుకుంటున్నా. ఓ సారి షూటింగ్ కోసం కేరళలోని ఓ ప్రాంతానికి వెళ్లాం. ముందు కారులో చిరంజీవి వెళ్తున్నారు. వెనుక కారులో నేను డాన్సు మాస్టర్, హెయిర్ డ్రెస్సర్ ఉన్నాం. అనుకోకుండా ఆ సమయంలో కొందరు తాగుబోతులు మమ్మల్ని వెంబడించారు. కారుపై తాగేసిన బీరు బాటిల్స్ విసిరారు. అది చూసిన చిరంజీవి వెంటనే కారు దిగి వాళ్లను గన్ తో బెదిరించారు. దీంతో వాళ్లంతా పారిపోయారు. హీరోయిజ్ అంటే కెమెరా ముందే కాదు. రియల్ లైఫ్ లో కూడా అలానే ఉండటం. ఈ సంఘటన మీకు గుర్తుందా? అని చిరంజీవిని అడిగారు. దానికి చిరంజీవి స్పందిస్తూ అవును గుర్తుంది. వాళ్లు మిమ్మల్ని వెంబడించనడం అనూహ్య పరిణామం- అని అన్నారు. ప్రస్తుతం ఈ వీడియో నెట్టింట వైరల్ గా మారింది. మెగా అభిమానులు అది విని చిరంజీవి ఇంతటి ధైర్యశాలినా? అంటూ పొగిడేస్తున్నారు గతంలో విజయశాంతి కూడా చిరంజీవి నా హీరో అంటూ ఎంతో ఆప్యాయంగా మాట్లాడారు. అలాగే రాధిక, రాధలు సైతం చిరంజీవితో నటించిన అనుభవాన్ని పలు సందర్భాల్లో గుర్తు చేసుకున్నారు.


# ఈ ఏడాదంతా ప్రీప్రొడక్షనే



మహేశ్‌బాబు, రాజమౌళి కాంబినేషన్‌లో తెరకెక్కనున్న చిత్రం అప్‌డేట్ కోసం దేశం మొత్తం ఆసక్తిగా ఎదురుచూస్తున్నది. కానీ రాజమౌళి మాత్రం అవేం పట్టించుకోకుండా కామ్‌గా తన పనితాను చేసుకుంటూ పోతున్నారు. ఈ సినిమా ప్రీప్రొడక్షన్ పనులు గప్‌చుప్‌గా జరిగిపోతున్నాయట. ఫిల్మ్ వర్గాల నుంచి అందుతున్న సమాచారం ప్రకారం రాజమౌళి ఈ ఏడాది మొత్తాన్నీ ప్రీప్రొడక్షన్ వర్క్‌కే కేటాయిస్తున్నారట. ఈ సినిమా షూటింగ్ మొదలయ్యేది వచ్చే ఏడాదే అని తెలుస్తున్నది. తొలి షెడ్యూల్ జర్మనీలో ఉండబోతున్నదట.

ఈ షెడ్యూల్‌లోనే కొందరు విదేశీ నటులు కూడా భాగం కానున్నారని వినికిడి. 18వ శతాబ్దానికి చెందిన పీరియాడికల్ ఎపిసోడ్ ఈ సినిమాలో హైలైట్‌గా నిలుస్తుందని సమాచారం. అమెజాన్ ఫారెస్ట్ నేపథ్యం అంతా ఆ ఎపిసోడ్‌లోనే ఉంటుందట. దీనికోసం రాజమౌళి ప్రత్యేకమైన స్కెచ్‌లు గీయిస్తున్నారని వినికిడి. అరుదైన గిరిజన జాతికి సంబంధించిన రిఫరెన్స్‌లు ఈ సినిమాలో ఉంటాయట. త్వరలోనే వీటికి సంబంధించిన స్కెచ్‌లు, కాస్ట్యూమ్స్ ఫైనలైజ్ చేయనున్నారు. దీనికోసం వందలమంది జూనియర్ ఆర్టిస్టులకు ముందే ట్రైనింగ్ ఇచ్చి, వారిని సిద్ధం చేయనున్నారట. దాదాపు వెయ్యికోట్ల భారీ వ్యయంతో రూపొందనున్న ఈ సినిమాను దుర్గా ఆర్ట్స్ పతాకంపై కె.ఎల్.నారాయణ నిర్మిస్తున్న విషయం తెలిసిందే.

# కార్తీ 29 స్టోరీ బ్యాక్‌డ్రాప్ ఇదే.. క్యూరియాసిటీ పెంచేస్తున్న డైరెక్టర్




కోలీవుడ్ స్టార్ యాక్టర్ కార్తీ ఇప్పటికే సత్యం సుందరం, సర్దార్ 2, వా వాతియర్ సినిమాలతో బిజీగా ఉన్నాడని తెలిసిందే. ఈ సినిమాలు సెట్స్‌పై ఉండగానే కార్తీ మరో కొత్త ప్రాజెక్ట్ 29ను ప్రకటించాడు. తానక్కరన్ ఫేం తమిళ్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించనున్నాడు. పీరియాడికల్ బ్యాక్‌డ్రాప్‌లో రానున్న ఈ చిత్రాన్ని డ్రీమ్ వారియర్ పిక్చర్స్ బ్యానర్‌పై ఎస్ఆర్ ప్రకాష్‌బాబు, ఎస్ఆర్ ప్రభు సంయుక్తంగా తెరకెక్కిస్తున్నారు. కార్తీ ఇప్పటికే ఈ బ్యానర్‌లో ఖాకీ, సుల్తాన్, కాష్మోరా, జపాన్ సినిమాలను చేశాడు. మళ్లీ ఈ బ్యానర్‌లో కార్తీ 29 సినిమా రానుండటంతో మూవీపై భారీ అంచనాలు ఉన్నాయి. టైటిల్ లుక్‌లో సముద్ర జలాల వెంబడి భారీ షిప్ వెళ్తున్న స్టిల్ ఇప్పటికే నెట్టింట వైరల్ అవుతూ వింటేజ్ వైబ్స్‌ను అందిస్తోంది. తాజాగా సినిమా బ్యాక్‌డ్రాప్ గురించి ఆసక్తకర వార్త నెట్టింట వైరల్ అవుతోంది. తమిళనాడులోని రామేశ్వరం బ్యాక్ డ్రాప్‌లో సాగే స్మగ్లింగ్ నేపథ్యంలో సినిమా ఉండబోతుందని డైరెక్టర్ ఓ ఇంటర్వ్యూలో తెలియజేశాడు. కార్తీ నయా ప్రాజెక్ట్‌పై డైరెక్టర్ చేసిన తాజా కామెంట్స్ సూపర్ హైప్ క్రియేట్ చేస్తున్నాయి.ఈ కథ 1960స్ నేపథ్యంలో ఉండబోతుందని కూడా చెప్పాడు. ఈ నేపథ్యంలో కార్తీని డైరెక్టర్ ఎలా చూపించబోతున్నాడన్నది సర్వత్రా ఆసక్తి నెలకొంది. కార్తీ లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో ఖైదీకి కొనసాగింపుగా రానున్న ఖైదీ 2లో కూడా నటిస్తుండగా.. దీనికి సంబంధించిన అప్‌డేట్ రావాల్సి ఉంది. కార్తీ, అరవింద స్వామి తో కలిసి నటిస్తోన్న చిత్రం మెయ్యళగన్ . '96' ఫేం ప్రేమ్ కుమార్.సీ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా తెలుగులో 'సత్యం సుందరం' పేరుతో సెప్టెంబర్ 27న విడుదలవుతోంది.

# సార్ ప్లీజ్ నాతో సినిమా తీయండి.. వెట్రిమారన్‌కు తారక్ రిక్వెస్ట్

టాలీవుడ్ స్టార్ యాక్టర్ జూనియర్ ఎన్టీఆర్ త్వరలోనే దేవరటైటిల్‌తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడని తెలిసిందే. పాన్ ఇండియా బ్యాక్ డ్రాప్‌లో రాబోతున్న ఈ చిత్రానికి కొరటాల శివ దర్శకత్వం వహిస్తున్నాడు. దేవర రెండు పార్టులుగా రానుండగా.. దేవర పార్టు 1 సెప్టెంబర్ 27న థియేటర్లలో ప్రపంచవ్యాప్తంగా తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో గ్రాండ్‌గా రిలీజ్ కానుంది. విడుదల తేదీ దగ్గర పడుతున్న నేపథ్యంలో ప్రమోషన్స్‌లో భాగంగా చెన్నైలో సందడి చేసింది తారక్ అండ్ టీం. ఈ సందర్భంగా వెట్రిమారన్‌తో సినిమా చేయాలని తన మనసులో మాటను బయటపెట్టేశాడు తారక్.మట్టిలో పుట్టే పాత్రలతో మ్యాజిక్ చేసే టాలెంటెడ్ డైరెక్టర్ల జాబితాలో టాప్‌లో ఉంటాడు కోలీవుడ్ డైరెక్టర్ వెట్రిమారన్. ఈ దర్శకుడు కథను నమ్మి సినిమా చేస్తుంటాడని ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. ఇక వెట్రిమారన్‌తో ఒక్క సినిమా అయినా చేయాలని అనుకునే నటీనటులు చాలా మందే ఉంటారు. వెట్రిమారన్ సినిమాలకు సినీ జనాలతోపాటు సెలబ్రిటీలు కూడా ఇంప్రెస్ అయిపోతుంటారు. ఈ స్టార్ డైరెక్టర్ అభిమానుల్లో స్టార్ హీరోలు సైతం ఉంటారు. ఇప్పుడీ జాబితాలో గ్లోబల్ స్టార్ హీరో తారక్ కూడా చేరిపోయాడు.ప్రమోషనల్ ఈవెంట్‌లో జూనియర్ ఎన్టీఆర్ చేసిన కామెంట్స్ ఇప్పుడు టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా మారాయి. నా అభిమాన దర్శకుడు వెట్రిమారన్‌ను అడుగుతున్నా.. సార్ దయచేసి నాతో స్ట్రెయిట్ తమిళ సినిమాను తీయండి. మనం తెలుగులో డబ్ చేసుకుందాం..అంటూ విజప్తి చేశాడు. మొత్తానికి అన్నీ కుదిరితే తాను కోలీవుడ్ ఎంట్రీ ఇవ్వడానికి కూడా రెడీగా ఉన్నానని చెప్పకనే చెబుతూ టాక్ ఆఫ్ ది టౌన్‌గా నిలుస్తున్నాడు తారక్.మరి ఈ స్టార్ యాక్టర్ విజ్ఞప్తికి వెట్రిమారన్ రియాక్షన్ ఎలా ఉంటుందనేది సర్వత్రా ఆసక్తికరంగా మారింది. కొంచెం ఆలస్యమైనా రాబోయే రోజుల్లో తారక్-వెట్రిమారన్ కాంబినేషన్ సిల్వర్ స్క్రీన్‌పై సందడి చేసే అవకాశాలు లేకపోలేదంటున్నారు సినీ జనాలు.



# హ్యాపీ బర్త్‌డే మై ఎవ్రీథింగ్.. భర్తతో రొమాంటిక్ ఫొటోలు షేర్ చేసిన నయనతార



లేడీ సూపర్ స్టార్ నయనతార భర్త విఘ్నేష్ శివన్ పుట్టిన రోజు నేడు ఈ సందర్భంగా నయన్ తన భర్తకు రొమాంటిక్‌గా బర్త్‌డే విషెస్ తెలియజేసింది. గత రాత్రి డిన్నర్ డేట్‌కు వెళ్లిన ఈ జంట తమ విలువైన సమయాన్ని గడిపారు. ఇద్దరూ ఒకరికొకరు ముద్దులు పెట్టుకుంటూ ఫొటోలకు ఫోజులిచ్చారు.ఇందుకు సంబంధించిన ఫొటోలను నయన్ తన ఇన్‌స్టా ఖాతాలో షేర్ చేశారు. 'హ్యాపీ బర్త్‌డే మై ఎవ్రీథింగ్. నేను నిన్ను ఎంతగా ప్రేమిస్తున్నానో మాటల్లో చెప్పలేను. నువ్వు కన్న కలలు నిజం కావాలని, ఆ దేవుడు నిన్ను ఎప్పుడూ దీవించాలని కోరుకుంటున్నాను' అంటూ ఫొటోలకు క్యాప్షన్ రాసుకొచ్చారు. ప్రస్తుతం ఈ రొమాంటిక్ కపుల్ ఫొటోలు నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి.

# అరంగేట్ర హీరోలు ఆగాల్సిందే.. తొలి టెస్టు తుది జట్టు ఇదే..!



**న్యూఢిల్లీ-నవభూమి:** టీ20 వరల్డ్ కప్ విజేతగా భారత జట్టు స్వదేశంలో తొలి సిరీస్ ఆడబోతోంది. శ్రీలంక పర్యటనలో స్పిన్ ఆడలేక తంటాలు పడిన భారత క్రికెటర్లు బంగ్లాదేశ్‌పై దంచికొట్టేందుకు ఉత్సాహంగా ఎదురుచూస్తున్నారు. చెన్నైలోని చెపాక్ స్టేడియంలో గురువారం తొలి టెస్టు మొదలవ్వనుంది. దీంతో, తుది జట్టులో ఉండేది ఎవరు? అనే ప్రశ్నకు హెడ్‌కోచ్ గౌతం గంభీర్ తెరదిం చాడు. ఇంగ్లండ్ సిరీస్‌లో ఆపద్బాంధవులుగా నిలిచిన అరంగేట్రం హీరోలు సర్ఫరాజ్ ఖాన్ ధ్రువ్ జురెల్‌లు బెంచ్ మీదనే ఉంటారని గౌతీ చెప్పాడు. 'మేము ఎవ్వరిపై వేటు వేయడం లేదు. అయితే.. తుది జట్టులో అవసరమైన వాళ్లనే తీసుకుంటున్నాం. రిషభ్ పంత్ గైర్హాజరీలో ధ్రువ్ జురెల్ అద్భుతంగా రాణించాడు. కానీ, కొన్నిసార్లు ఆటగాళ్లు వేచి చూడక తప్పదు. సర్ఫరాజ్ ఖాన్ పరిస్థితి కూడా అంతే. వీళ్లకు భవిష్యత్‌లో కచ్చితంగా అవకాశాలు ఇస్తాం. కాకపోతే కొంచెం ఓపిక పట్టాల్సి ఉంటుంది' అని గంభీర్ వెల్లడించాడు.

# సీనియర్ ఆల్‌రౌండర్‌కు షాక్.. బంగ్లాదేశ్ స్క్వాడ్‌లో యువరక్తం



**న్యూఢిల్లీ-నవభూమి:** మహిళల టీ20 వరల్డ్ కప్ కోసం బంగ్లాదేశ్(స్క్వాడ్‌ను ప్రకటించింది. ఆసియా కప్‌లో జట్టును నడిపించిన నిగర్ సుల్తానా కెప్టెన్‌గా 15 మందితో కూడిన బృందాన్ని బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు ఎంపిక చేసింది. ఆశ్చర్యకరమైన విషయం ఏంటంటే..? ఈసారి యువ రక్తంతో కూడిన స్క్వాడ్‌ను యూఈఏకి పంపాలని బీసీబీ సెలెక్టర్లు నిర్ణయించుకున్నారు. అందులో భాగంగానే వెటరన్ ఆల్‌రౌండర్ రుమనా అహ్మద్‌కు షాకిచ్చారు.వరల్డ్ కప్ స్క్వాడ్ ఎంపికపై బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు సభ్యులు, సెలెక్టర్లు ఈసారి పెద్ద కసరత్తు చేశారు. ఫామ్ లేమితో జట్టుకు భారంగా మారిన సీనియర్లకు చెక్ పెట్టారు. ఈ ఏడాది మహిళల ఆసియా కప్‌లో విఫలైమన రుబే హైదర్, షరిఫా ఖాతూన్, సబికున్ నహర్, ఇష్మా తంజీమ్‌లపై వేటు వేశారు. అన్‌క్యాప్డ్ ప్లేయర్లు తాజ్ నెహర్ దిశా బిస్వాల్‌లను తొలిసారి వరల్డ్ కప్ స్క్వాడ్‌లోకి తీసుకున్నారు. మరోవైపు.. శాంతి రాణి, ఫాహిమ ఖాతూన్, శోభన మోస్ట్రేలకు మరో అవకాశం ఇచ్చారు.

నవక్రీడ

# పంజాబ్ కింగ్స్ కోచ్‌గా పాంటింగ్.. ట్రోఫీ కరువు తీరుస్తాడా..?




**న్యూఢిల్లీ-నవభూమి:** ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో రికీ పాంటింగ్(మళ్లీ హెడ్‌కోచ్‌గా కనిపించ నున్నాడు. ఆస్ట్రేలియాకు మూడు వరల్డ్ కప్‌లు అందించిన ఈ దిగ్గజ కెప్టెన్ పంజాబ్ కింగ్స్(ఫ్రాంచైజీకి కోచ్‌గా నియమితుల య్యాడు. 17వ సీజన్ చాంపియన్ తర్వాత ఢిల్లీ క్యాపిటల్స్‌ను వీడిన పాంటింగ్ ఇప్పుడు పంజాబ్ ఐపీఎల్ ట్రోఫీ కలను నిజం చేసే పనిలో నిమగ్నం కానున్నాడు. కొత్త ఫ్రాంచైజీకి కోచ్‌గా వెళ్తున్న పాంటింగ్ ఎంతో సంతోషంగా ఉందంటున్నాడు.'నన్ను కొత్త హెడ్‌కోచ్‌గా తీసుకున్న పంజాబ్ కింగ్స్ ఫ్రాంచైజీకి కృతజ్ఞతలు. ఈ కొత్త సవాల్‌ను స్వీకరించేందుకు నేను ఎంతో ఉత్సాహంతో ఉన్నా. పంజాబ్ జట్టు ప్రణాళికల గురించి యాజయాన్యంతో జరిపిన చర్చలు చాలా సంతృప్తినిచ్చాయి. ఫ్రాంచైజీపై నమ్మకం పెట్టుకున్న అభిమానుల నమ్మకాన్ని నిజం చేయాల్సిన సమయం వచ్చేసింది. ఇకపై పంజాబ్ కింగ్స్ ఆటలో మార్పు చూస్తారని మేము మీకు ప్రామిస్ చేస్తున్నాం' అని పాంటింగ్ తెలిపాడు.

Printed,Published & Owned by SHAIK SHAHANAZ, Printed at SUPER PRINTERS Web offset Printers 2-3-655/C/118,Azad Nagar,Amberpet Circle 23,HYDERABAD -500113(T.S.), and Published D.No: 10-2-287/1/,Ground Floor,Santhinagar,A.C Guards,Masabtank,HYDERABAD - 500028,State TELANGANA (India). Editor: SHAIK SHAHANAZ, Phone: 9246213493,Email : navabhoomidaily@gmail.com,navabhoomi1@gmail.com RNI No: TEL TEL: 82083